గురువారం
27•2•2020
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 243
• పేజీలు : 12 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE






బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి ప్రకాశ్‌జవదేకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో ఎంపీలు బీబీపాటిల్, నామా నాగేశ్వరరావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి కూడా ఉన్నారు

### కేంద్రమంత్రి జవదేకర్‌తో
## సీఎం కేసీఆర్ భేటీ

పలు ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులపై చర్చ

ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకున్న ముఖ్యమంత్రి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు ఢిల్లీలో కేంద్ర అటవీ, పర్యావరణశాఖల మంత్రి ప్రకాశ్ జవదేకర్‌తో భేటీ అయ్యారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం కేసీఆర్ బుధవారం జవదేకర్ ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే మరికొన్ని ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులపై చర్చించినట్టు తెలిసింది. ముఖ్యమంత్రి వెంట టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, టీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత నామా నాగేశ్వరరావు, ఎంపీలు సంతోష్‌కుమార్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీ పాటిల్, మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. సీఎం కేసీఆర్ బుధవారం రాత్రి తిరిగి హైదరాబాద్‌కు చేరుకొన్నారు.



బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా బుధవారం ఆలయంలో స్వస్తివాచనం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న కలెక్టర్ అనితారామచంద్రన్, ఈవో గీత.

3

# లంచం సహించం



పట్టణప్రగతిలో భాగంగా బుధవారం జనగామ జిల్లా కేంద్రంలోని 13వ వార్డులో స్థానికుల సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి కేటీఆర్.

ఆన్‌లైన్ ద్వారానే భవననిర్మాణ అనుమతులు

- 85% మొక్కలు దక్కకుంటే పదవులకు గండమే
- ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆసరా పింఛన్లు అందజేత
- పార్టీలకు అతీతంగా పురపాలికల అభివృద్ధి
- బంగారు తెలంగాణ స్వాప్నికుడు సీఎం కేసీఆర్
- పల్లెలు, పట్టణాల ప్రగతితోనే సీఎం కల సాకారం: పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు
- జనగామ, భువనగిరి పట్టణప్రగతిలో ప్రజలతో మంత్రి ముఖాముఖి

**జనగామ/యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

పట్టణాల్లో భవననిర్మాణాల అనుమతుల కోసం ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదని.. ఎవరైనా లంచం డిమాండ్ చేసినట్లు తేలితే.. సహించబోమని పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు హెచ్చరించారు. ప్రజలకు పారదర్శకంగా పరిపాలన అందించడంకోసమే కొత్త మున్సిపల్ చట్టంలో అనేక వెసులుబాట్లు కల్పించామని పేర్కొన్నారు. 'కొత్త చట్టం ప్రకారం 596 చదరపు గజాల స్థలంవరకు ఆన్‌లైన్లో దరఖాస్తుచేసుకొన్న 21 రోజుల్లో భవన నిర్మాణ అనుమతులు ఇస్తున్నాం. 75 గజాల లోపు స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇండ్లు నిర్మించుకోవచ్చు. టౌన్‌ప్లానింగ్ అధికారులు లంచం అడిగినా ఇవ్వొద్దు. ఒకవేళ డిమాండ్ చేస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయండి. వారిపై కఠినచర్యలు తీసుకొనే బాధ్యత మాది' అని తెలిపారు. అక్రమ లే-అవుట్లు, దొంగ వెంచర్లపై ఉక్కుపాదం మోపాలని.. అందరూ పన్నులు చెల్లించేలా చర్యలు తీసుకొంటే ఆదాయం పెరుగుతుందని పురపాలకశాఖ అధికారులకు సూచించారు. పట్టణ ప్రగతి మూడోరోజు కార్యక్రమంలో భాగంగా బుధవారం మంత్రి కేటీఆర్ జనగామ, భువనగిరి పట్టణాల్లో పర్యటించారు. జనగామ మున్సిపాలిటీలోని 13, 30 వార్డుల్లో ఆకస్మికంగా తనిఖీచేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, జిల్లా కలెక్టర్ నిఖిలతో కలిసి కాలినడకన పర్యటించారు. స్థానికులను కలిసి వారి సమస్యలను తెలుసుకొన్నారు. ఆసరా పింఛన్లు వస్తున్నాయా అని ఆరాతీశారు. సంక్షేమపథకాలు అందుతున్న తీరు, తాగునీరు, విద్యుత్ సరఫరాల గురించి ప్రశ్నించారు. అనంతరం అంబేద్కర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు. ఖాళీ స్థలాల్లో మురికి తుమ్మలు, చెత్తచెదారం ఉంటే స్థల యజమానికి నోటీసు ఇవ్వాలని, వినకుంటే ఐదువేల జరిమానా విధించాలని అధికారులను ఆదేశించారు. జరిమానా విధించిన తర్వాత కూడా వినకుంటే స్థలాన్ని మున్సిపాలిటీ స్వాధీనం చేసుకొంటామని చెప్పారు. పట్టణంలో

మిగతా 2వ పేజీలో

• శిథిల నగరంలో..



అల్లర్లలో విధ్వంసానికి గురైన ఈశాన్య ఢిల్లీలోని ఖజూరీఖాస్ ప్రాంతం

# పోలీసుల వైఫల్యమే!

- ప్రొఫెషనల్‌గా వ్యవహరించలేదు
- స్వతంత్రంగా పనిచేయండి
- ఎవరి ఆదేశాల కోసమూ చూడొద్దు
- ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు చీవాట్లు
- విద్వేష వ్యాఖ్యలు చేసిన ఆ ముగ్గురు బీజేపీ నేతలపై చర్యలేవి?: ఢిల్లీకోర్టు
- హస్తినలో 27కు పెరిగిన మృతులు
- ఈశాన్య ఢిల్లీలో హింస తగ్గుముఖం

**ఢిల్లీ** పోలీసులు ఇతరుల ఆదేశాల కోసం ఎదురుచూడకుండా స్వతంత్రంగా వ్యవహరించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అల్లర్లను అడ్డుకోవడంలో 'ప్రొఫెషనల్'గా వ్యవహరించడంలో విఫలమయ్యారని, హింసను రెచ్చగొట్టేవారు పారిపోయేందుకు అవకాశమిచ్చారని షాహీన్‌బాగ్ నిరసనలపై దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా పోలీసులు, దర్యాప్తు సంస్థలకు చీవాట్లు పెట్టింది. మరోవైపు విద్వేష వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేతలు కపిల్‌మిశ్రా, అనురాగ్‌ఠాకూర్, పర్వేశ్‌వర్మపై పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకపోవడంపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. దీనిపై గురువారంలోగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

5

# సిద్ధమవుతున్న డయాగ్నస్టిక్ హబ్‌లు

ఇరవై జిల్లాల్లో ఏర్పాట్లు పూర్తి • మార్చినుంచి అందుబాటులోకి

ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

విద్య, వైద్యం ప్రజలందరికీ అందుబాటులో ఉంటేనే రాష్ట్రం సౌభాగ్యవంతమవుతుందన్న దూరదృష్టితో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలు ఫలితాలనిస్తున్నాయి. ముఖ్యంగా పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని ప్రభుత్వ దవాఖానల్లో అందించేందుకు వీలుగా అన్ని జిల్లాల్లోనూ దవాఖానలను అప్‌గ్రేడ్‌చేయడమే కాకుండా వ్యాధినిర్ధారణ పరీక్షలు సైతం నిర్వహించేందుకు సకల సౌకర్యాలను కల్పిస్తున్నారు. రాజధాని హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి డయాగ్నస్టిక్ హబ్‌ను ప్రారంభించిన ప్రభుత్వం.. జిల్లాలకు సైతం ఈ సేవలను విస్తరించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ప్రస్తుతానికి 20 చోట్ల డయాగ్నస్టిక్ హబ్‌లను అందుబాటులోకి తెస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా దవాఖానలు, జిల్లాస్థాయి హాస్పిటళ్లలో వీటిని ఏర్పాటుచేసేందుకు వైద్యశాఖాధికారులు సన్నాహాలుచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమకు దగ్గర్లో ఉన్న దవాఖానలో వ్యాధినిర్ధారణ పరీక్షలు చేయించుకొంటే.. వాటి శాంపిళ్లను సంబంధిత డయాగ్నస్టిక్ హబ్‌కు పంపించి సత్వరమే ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకొంటున్నారు. దీంతో పల్లె ప్రజలు పట్టణాలకు వచ్చే శ్రమ తగ్గిపోతుంది. ఈ డయాగ్నస్టిక్

మిగతా 4వ పేజీలో

# రివాల్వర్ గురిపెట్టారు

ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకుంటే బెదిరింపులు • బాధితులపై రేవంత్ సోదరుల గూండాగిరి!

- 21 మందిమి కోర్టుల చుట్టూ తిరుగుతున్నాం
- మా భూమి మాకు ఇప్పించండి సారూ
- రంగారెడ్డి కలెక్టర్‌తో 'రేవంత్' బాధితులు
- నేడు ఆర్డీవోను కలవాలన్న కలెక్టర్




గోపన్‌పల్లి సర్వేనంబర్ 127లోని భూమిలో ఈ లక్ష్మయ్య, వారసులను పేర్కొంటూ ఏర్పాటు చేసిన బోర్డు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

'రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లిలో సర్వేనంబర్ 127లోని పదెకరాల భూమిచుట్టూ ప్రహరీ కడుతుంటే అడ్డుకునేందుకు వెళ్లాం.. ఆ భూమి వారసులమైన మాపై రేవంత్‌రెడ్డి సోదరులు రౌడీలను పంపి గెంటివేయించారు. రివాల్వర్‌తో చంపుతామంటూ బెదిరించడంతోపాటు, పోలీసులతో కేసులు పెట్టించారు. 21 మందిమి ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నాం' అంటూ 'రేవంత్‌రెడ్డి భూదందా' బాధితులు బుధవారం రంగారెడ్డి కలెక్టరేట్ వద్ద వాపోయారు. తమ భూమిని తమకు ఇప్పించాలని.. కోర్టు కేసుల నుంచి విముక్తి కలిగించాలని గోపన్‌పల్లి తండాకు చెందిన రైతులు నర్సింహ, రమేశ్, శ్రీశైలం, దేవేందర్, సంజీవ, యాదమ్మ, జంగమ్మ, స్వాతి, శ్రీనివాస్ కుటుంబసభ్యులు కలెక్టర్ అమయ్‌కుమార్‌కు మొరపెట్టుకున్నారు. గురువారం ఆర్డీవో చంద్రకళను కలువాలని కలెక్టర్ వారికి సూచించారు. గోపన్‌పల్లి సర్వేనంబర్ 127లో 10.21 గుంటల భూమి యజమాని ఈ లక్ష్మయ్యకు మల్లయ్య, హన్మయ్య, ఎల్లయ్య, రామయ్య, కిష్టయ్య ఐదుగురు కుమారులు. తాము వారి వారసులమని, కొన్నేండ్లుగా ఈ భూమి విషయంలో పోరాటం చేస్తున్నామని నర్సింహ, రమేశ్, శ్రీశైలం, దేవేందర్, సంజీవ, యాదమ్మ, జంగమ్మ, స్వాతి, శ్రీనివాస్ పేర్కొన్నారు. లక్ష్మయ్య పేరుమీద ఉన్న భూమిని పెద్దకుమారుడైన మల్లయ్య పేరు మీదకు రికార్డుల్లో మార్పులు చేశారని తెలిపారు. మల్లయ్య పేరిట ఉన్న భూమిని ఆయన పెద్ద కుమారుడు లక్ష్మయ్య.. రేవంత్‌రెడ్డి తమ్ముడు కొండల్‌రెడ్డికి అమ్మాడని.. మాకు తెలియకుండా ఎలా అమ్ముతారని లక్ష్మయ్యను అడిగితే సమాధానం దాటవేస్తూ వచ్చాడని చెప్పారు. అధికారుల వద్దకు వెళ్లినా

మిగతా 4వ పేజీలో



## ముదిరితే మాంద్యమే

ప్రపంచ ఆర్థికవ్యవస్థకు ముప్పే

కరోనా వైరస్‌పై మూడీస్ భయాందోళన

8

## ఆరు లక్షల కోట్లు ఆవిరి

నాలుగు రోజుల్లో నష్టపోయిన మదుపరుల సంపద

కల్లోలం సృష్టించిన కరోనా.. 40 వేల దిగువకు సెన్సెక్స్

8

## పెండ్లింట విషాదం

24 మంది దుర్మరణం

వంతెనపై నుంచి నదిలో పడిన బస్సు

రాజస్థాన్‌లోని కోటాలో దుర్ఘటన

5

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 52.00 | రిటైల్ లైవ్ | 74.00 |
| డ్రెస్డ్ | 107.00 | స్కిన్‌లెస్ | 122.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 313.00 | రంగారెడ్డి | 313.00 |
| మెదక్ | 313.00 | కరీంనగర్ | 316.00 |
| వరంగల్ | 316.00 | డజన్ ధర | 60.00 |

# జీఎస్టీ రాబడిలో తెలంగాణ టాప్




వృద్ధిరేటు తగ్గినా అగ్రస్థానంలో రాష్ట్రం

- ఇప్పటికే 40వేల కోట్లు దాటిన రాబడి
- భారీ లక్ష్యం దిశగా అధికారుల అడుగులు
- జీరో దందాకు పూర్తిస్థాయిలో బ్రేక్
- ఫలిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లు, ప్రత్యేక యాప్‌లు
- స్ఫూర్తిగా తీసుకుంటున్న ఇతర రాష్ట్రాలు
- తెలంగాణ మోడల్‌పై అధ్యయనం

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

దేశవ్యాప్తంగా నెలకొన్న ప్రతికూల పరిస్థితులను, ఆర్థిక ప్రతిబంధకాలను అధిగమించి వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రాబడిలో తెలంగాణ రాష్ట్రం ప్రత్యేకతను చాటుకొంటున్నది. పన్ను వసూళ్లలో భారీ లక్ష్యసాధనవైపు వడివడిగా అడుగులు వేస్తున్నది. ప్రత్యేక యాప్‌లు, స్పెషల్‌డ్రైవ్‌లతో జీరో దందాను పూర్తిగా నిరోధించి ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నది. దేశంలో జీఎస్టీ వసూళ్లు తగ్గినా తెలంగాణలో మాత్రం రాబడి పెరిగింది. గత ఏడాది కంటే వృద్ధిరేటు తగ్గినప్పటికీ రాష్ట్ర వాణిజ్యపన్నులశాఖ అధికారులు చేపట్టిన ప్రత్యేక చర్యల వల్ల లక్ష్యాన్ని మించి ఖజానాకు రాబడి చేకూరుతున్నది. వాస్తవానికి ప్రస్తుతం దక్షిణాదిలో జీఎస్టీ రాబడిలో మన రాష్ట్రమే అగ్రభాగాన నిలిచింది. 2019-20 వార్షిక బడ్జెట్‌లో వాణిజ్యపన్నులు, జీఎస్టీ ద్వారా రూ.47 వేల కోట్ల రాబడి వస్తుందని అంచనా వేయగా.. ఈసారి ఆ అంచనాను దాటే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వాస్తవానికి బడ్జెట్ అంచనాల్లో 80 నుంచి 90 శాతం సాధిస్తే దానినే గొప్ప విజయంగా భావిస్తారు. కానీ ఈసారి ఇప్పటికే రూ.40,268 కోట్లు వసూలయ్యాయి. ఇది మొత్తం లక్ష్యంలో 86 శాతంగా ఉండటం గమనార్హం. గతేడాదితో పోలిస్తే ఈసారి ఇప్పటికే 6.35 శాతం వృద్ధిరేటు నమోదయింది. గత ఆర్థిక సంవత్సరం (2018-19) ముగిసేనాటికి రూ.45,379 కోట్ల రాబడి వచ్చింది. దీంతో 15.37 శాతం వృద్ధిరేటు నమోదైంది. ఈసారి ప్రతికూల పరిస్థితులున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు ప్రత్యేక కార్యక్రమాలు సత్ఫలితాలనిచ్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరినాటికి రూ.48 వేల కోట్ల నుంచి రూ. 50 వేల కోట్ల రాబడి సాధించాలన్న

మిగతా 2వ పేజీలో

# అవ్వకు ఆత్మీయ పలుకరింపు

## భూపాలపల్లిలో వృద్ధురాలికి పింఛన్ మంజూరు చేయించిన కలెక్టర్

**జయశంకర్ భూపాలపల్లి కలెక్టరేట్:** పింఛన్ రాక ఇబ్బంది పడుతున్న ఓ వృద్ధురాలికి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి మంజూరుచేయించారు. జిల్లాలోని గుర్రంపేట గ్రామానికి చెందిన అజ్మీరా మంగమ్మ (70) పింఛన్‌కోసం బుధవారం కలెక్టరేట్‌కు వచ్చి మెట్లపై కూర్చున్నారు. అటుగా వచ్చిన కలెక్టర్ మహ్మద్ అబ్దుల్ అజీమ్ ఆమెను గమనించారు. వెళ్లి ఆ వృద్ధురాలి పక్కనే కూర్చొని సమస్యను తెలుసుకొన్నారు. వెంటనే జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సుమతితో ఫోన్‌లో మాట్లాడి పింఛన్ మంజూరుచేయించారు. దీంతో మంగమ్మ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న ఆమె పింఛన్ కోసం కలెక్టరేట్‌లో ఎవరిని కలువాలో తెలియక మెట్లపై కూర్చోగా కలెక్టరే వచ్చి ఆదుకోవడంతో సంతోషం వ్యక్తంచేశారు.



బుధవారం జయశంకర్ భూపాలపల్లి కలెక్టరేట్‌లో మెట్లపై కూర్చొని వృద్ధురాలు మంగమ్మతో మాట్లాడుతున్న కలెక్టర్ మహ్మద్ అబ్దుల్ అజీమ్

# హరితహారం చెట్లు నరికినందుకు 30 వేల జరిమానా

## మేడ్చల్ జిల్లా గోధుమకుంటలో చర్యలు

**కీసర:** హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసరమండలం గోధుమకుంట అధికారులు, సర్పంచ్ కచ్చితంగా పాటించారు. చెట్లు నరికిన వ్యక్తులకు భారీగా జరిమానా విధించారు. గోధుమకుంట గ్రామంలోని కృష్ణానగర్‌కాలనీలో నాటిన మొక్కలు మూడేండ్లలో ఏపుగా పెరిగి, భారీ చెట్లుగా మారి.. ఆ ప్రాంతంలో పచ్చదనాన్ని నింపాయి. వీటిలో ఆరు చెట్లను ఇటీవల కృష్ణ, రమాకాంత్ అనే ఇద్దరు స్థానికులు నరికివేశారు. విషయం తెలుసుకున్న ఎంపీవో మంగతాయారు, గ్రామ సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి.. చెట్లు నరికినవారికి ఒక్కోదానికి రూ.5 వేల చొప్పున రూ.30 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.. పచ్చదానికి నిలయమైన చెట్లను నరికితే ఎంతటివారైనా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాతావరణ సమతుల్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో తామంతా శ్రమించి మొక్కలునాటి కంటికి రెప్పలా కాపాడుతుంటే.. కొందరు వాటిని నరికివేయడం క్షమించరాని నేరమన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సోమని ఆంజనేయులు, పంచాయతీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# దుఃఖ సమయాల్లో సానుభూతి చూపాలి

- ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ట్వీట్
- ఆత్మహత్యచేసుకున్న విద్యార్థిని తండ్రిని కానిస్టేబుల్ తన్నడంపై మంత్రి స్పందన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రజలు దుఃఖంలో ఉన్నప్పుడు అధికారులు వారి పట్ల సానుభూతి చూపించాల్సిన అవసరం ఉంటుందని మంత్రి కేటీఆర్ సూచించారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలంలోని ఓ కళాశాలలో ఇంటర్ విద్యార్థిని సంధ్యారాణి ఆత్మహత్య చేసుకున్నది. బుధవారం బీడీఎల్ భానూర్ పోలీసులు సిటిజన్ హాస్పిటల్‌నుంచి పటాన్‌చెరు ఏరియా దవాఖానకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తీసుకొచ్చారు. ఇదే సమయంలో పలు విద్యార్థి సంఘాల నాయకులు వచ్చి బాధిత కుటుంబసభ్యులతో కలిసి మృతదేహాన్ని కళాశాల వద్దకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీన్ని పోలీస్ సిబ్బంది అడ్డుకొన్నారు. ఈ సందర్భంగా ఓ కానిస్టేబుల్ మృతురాలి తండ్రి చంద్రశేఖర్‌ను తన్నడంతో ఉద్రిక్తత నెలకొన్నది. ఈ ఘటనపై మంత్రి కేటీఆర్ స్పందించారు. 'ప్రజలు దుఃఖ సమయాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వ అధికారులు సానుభూతి చూపించాలి' అని ట్వీట్‌చేశారు. ఈ విషయంపై హోంమంత్రి మహమూద్ అలీ, డీజీపీ మహేందర్‌రెడ్డి దృష్టి సారించి, పోలీసుల ప్రవర్తనపై సమీక్షించాలని కోరారు. దురుసుగా ప్రవర్తించిన కానిస్టేబుల్ శ్రీధర్‌ను సంగారెడ్డి ఏఆర్ హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

# పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. పగలు 32 నుంచి 36 డిగ్రీలవరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాత్రిపూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు 11.4 నుంచి 13.9 డిగ్రీల మధ్య రికార్డయి వాతావరణం చల్లగా ఉంటున్నది. బుధవారం జోగుళాంబ గద్వాల జిల్లాలో అత్యధికంగా 36 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, అతి తక్కువగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 33.1 డిగ్రీలుగా రికార్డయింది. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం అర్లి(టి)లో 11.4 డిగ్రీ ల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండలం గిన్నెధరి, ఆసిఫాబాద్‌లో 11.6 డిగ్రీలుగా నమోదైంది.

### ముహూర్తం

సూర్యోదయం: 6.36 గంటలకు

సూర్యాస్తమయం: 6.15 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం చతుర్థి రోజంతా, నక్షత్రం: రేవతి రాత్రి 1.09 వరకు, తదుపరి అశ్విని, అమృతఘుడియలు: రాత్రి 10.27 నుంచి అర్ధరాత్రి 12.15 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.52 నుంచి 3.20 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.09 నుంచి సాయంత్రం 4.41 వరకు, వర్జ్యం: ఉదయం 11.39 నుంచి మధ్యాహ్నం 1.26 వరకు.

### లోకం పోకడ




ఈ అల్లర్లు మీడియా కంట పడకుండా ఢిల్లీ చుట్టూ గోడ కట్టిస్తే?!

# లంచం సహించం


మొదటిపేజీ తరువాయి...


పందులు ఉండకుండా పెంపకందారులకు ఉపాధికల్పించాలని సూచించారు. తడి, పొడి చెత్తబుట్టలద్వారా చెత్తను వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి విడివిడిగా ఇవ్వాలని.. వాటిద్వారా ఎరువులు తయారుచేయొచ్చని, విద్యుత్ ఉత్పత్తిచేయవచ్చని తెలిపారు. 'పల్లెప్రగతిలో గ్రామాలు.. పట్టణప్రగతితో పట్టణాలు, నగరాల రూపురేఖలుమారితే రాష్ట్రమంతా బాగుపడ్డట్టే లెక్క. అందుకోసమే సీఎం కేసీఆర్ పకడ్బందీగా కొత్త చట్టాలను తెచ్చారు' అని పేర్కొన్నారు.

### మొక్కలు కాపాడకుంటే పదవులు పోతాయి

కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం పనిచేసే ప్రజాప్రతినిధులకు బాధ్యతలతోపాటే గౌరవం ఉన్నది.. అదే సమయంలో నిర్లక్ష్యంగా పనిచేసే చైర్మన్, కౌన్సిలర్లను పదవుల నుంచి తొలగించే అధికారం కూడా కలెక్టర్లకు ఉన్నదని మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. 'జనగామ మున్సిపాలిటీకి రూ.12.45కోట్ల బడ్జెట్ ఉన్నది. ఇందులో పదిశాతం హరితహారానికి కేటాయించాలి. ప్రతివార్డులో నిర్దేశించిన మేరకు మొక్కలునాటాలి. ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవసరమైన మొక్కల వివరాలతో హరిత ప్రణాళికద్వారా మొక్కలు అందించి నాటినవాటిలో 85శాతం బతికేలా చూసే బాధ్యత వార్డు కౌన్సిలర్‌పై ఉన్నది. కౌన్సిలర్లు ఏ పార్టీవారైనా.. మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యంచేసినా.. పట్టణ ప్రగతి లక్ష్యాలను నెరవేర్చకున్నా చైర్మన్ సహా కౌన్సిలర్ల పదవులు పోతాయి' అని స్పష్టంచేశారు. లక్ష జనాభా ఉన్న మున్సిపాలిటీలో ప్రతి వెయ్యిమందికి ఒక పబ్లిక్ టాయిలెట్ ఉండాలని చెప్పారు. జనగామలో రానున్న రెండు నెలల్లో వంద టాయిలెట్లను నిర్మించాలన్నారు. ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సవాలుగా తీసుకొని జనగామ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుకోవాలని కోరారు. పట్టణ ప్రణాళికలో భాగస్వాములవుతున్న ప్రత్యేక అధికారులు, అభివృద్ధి కమిటీల సభ్యులు ఆయా వార్డుల్లో పారిశుద్ధ్యం, హరితహారం పర్యవేక్షించాలని, ప్రతి మనిషికి రోజూ 135 లీటర్ల నీళ్లు అందేవిధంగా వాటర్ ఆడిట్‌చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆదాయాన్ని పెంచుతూ.. ఆ ఆదాయాన్ని పేదలకు పంచడమే ప్రభుత్వ లక్ష్యమని.. ఈ లక్ష్యసాధనకు సీఎం ఒక్కొక్క కార్యక్రమాన్ని చేసుకొంటూ ముందుకుపోతున్నారని చెప్పారు.



జనగామలోని 13వ వార్డులో రోడ్డు పక్కన చెత్తను చూసి అధికారులపై అగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఉన్నారు.



బుధవారం జనగామ పట్టణంలోని 13వ వార్డులో గృహిణి హైమతో మాట్లాడుతున్న మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కూడా ఉన్నారు.

### ఏప్రిల్‌లో కొత్త పింఛన్లు..

ఆలస్యమైనా అర్హులకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు తప్పకుండా అందుతాయని మంత్రి కేటీఆర్ చెప్పారు. 'రందిపడొద్దు. బాధపడద్దు. పైరవీలు చేయొద్దు. ఎవరికీ ఒక్క పైసా ఇవ్వద్దు. సమగ్ర కుటుంబసర్వే ద్వారా సేకరించిన ప్రజల వివరాలన్నీ ప్రభుత్వం వద్ద ఉన్నాయి. అర్హులైనవారికి ఏప్రిల్‌లో కొత్త పింఛన్లు అందిస్తాం. నిరుపేదలను దేవులాడి (వెతికి) మొదటి విడుతలో డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తాం. రెండోవిడుతలో గుడిసెలు, రేకుల ఇండ్లు ఉన్నవారికి ఇస్తాం' అని హామీ ఇచ్చారు. పింఛన్ల పెంపు, సన్నబియ్యం, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలను సమర్థంగా అమలుచేస్తున్నామని.. ఇన్నిరోజుల దరిద్రాన్ని పోగొట్టడానికి సమయం పడుతుందని చెప్పారు. వచ్చే నాలుగేండ్లలో ఎన్నికలు లేవని.. ఓట్లయిన తర్వాత ప్రజల దగ్గరకు వచ్చేవాడే నిజమైన నాయకుడన్నారు. ప్రజల అవసరాలను పదిరోజుల్లో గుర్తిస్తే.. ఆరునెలల్లో పూర్తిచేస్తామని తెలిపారు.

# అభివృద్ధికి అంకితమవుదాం

**పార్టీలక**తీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకొందామని భువనగిరి పట్టణ ప్రగతి కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ అన్నారు. భువనగిరి పట్టణ పురపాలక పాలకవర్గం సమావేశానికి హాజరైన మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. 'మాపార్టీ కౌన్సిలర్లు లేకపోయినంత మాత్రాన ప్రజలు మావారు కాదా. అందరూ మనవారే' అని వ్యాఖ్యానించారు. అన్ని ప్రాంతాలను వివక్ష లేకుండా అభివృద్ధిచేయాల్సిన బాధ్యత కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లపై ఉన్నదని హితవుచెప్పారు. బంగారు తెలంగాణ స్వాప్నికుడైన సీఎం కేసీఆర్ కలను సాకారం చేద్దామని పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరూ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని, తమ ప్రభుత్వం ఏనాడూ ప్రతిపక్షపార్టీల శాసనసభ్యులను మొదలుకొని పంచాయతీ వార్డు సభ్యుల దాకా ఎలాంటి వివక్ష చూపలేదని స్పష్టం చేశారు. ప్రతిపక్షపార్టీలు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులోని ప్రజలకు అవసరమైన కార్యక్రమాలు ఉంటే వాటికోసం నిధులు కేటాయించి అభివృద్ధి జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. భువనగిరిలో పారిశుద్ధ్య, హరితహారం కార్యక్రమాల గురించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. పారిశుద్ధ్య ప్రణాళికలో భాగంగా పట్టణానికి అవసరమైన స్వచ్ఛవాహనాలు, పారిశుద్ధ్య సిబ్బంది, డంప్ యార్డుల అభివృద్ధి, తడి పొడి చెత్త కార్యక్రమాన్ని అమలుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలుచేశారు. కౌన్సిలర్లు తమ బాధ్యతలను సంపూర్ణంగా నిర్వర్తిస్తే పట్టణానికి అవసరమైన నిధులను ఇచ్చేందుకు సిద్ధంగా ఉంటామని హామీఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జిల్లా పాలనాధికారి అనితా రామచంద్రన్, భువనగిరి మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింత కిష్టయ్య, ఆర్డీవో ఎంవీ భూపాల్‌రెడ్డి, కమిషనర్ నాగిరెడ్డి పాల్గొన్నారు.



భువనగిరి మున్సిపాలిటీ పాలకవర్గం సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కలెక్టర్ అనితారామచంద్రన్ తదితరులు

# హైమమ్మా.. నీళ్లొస్తున్నయా?

**జనగామ, నమస్తే తెలంగాణ:** జనగామ మున్సిపాలిటీ 13వ వార్డులో పాదయాత్రలో భాగంగా మంత్రి కేటీఆర్.. హైమవతి అనే గృహిణి మధ్య జరిగిన సంభాషణ ఇదీ..

**కేటీఆర్: రోజూ నల్లా నీళ్లు వస్తున్నాయా?**

**గృహిణి:** వస్తున్నయి సార్

**మిషన్ భగీరథ నల్లా పెట్టిండ్లా?**

**గృహిణి:** పాత నల్లాతో రోజు నీళ్లు వస్తున్నయ్..

**చెత్తబండి వస్తున్నదా?**

**గృహిణి:** రోజు వస్తున్నది సార్

**చెత్త బుట్టలు ఉన్నయా?**

**గృహిణి:** ఉన్నయ్

**రిక్షాకు చెత్త ఎట్ల ఇస్తున్నవ్.. నీకు టెస్ట్ పెడుతున్న.. ఏవీ మీ ఇంట్లో రెండు బుట్టలు ఉన్నయా? చూపిస్తవా? తీసుకురా పో..**

**గృహిణి:** సార్ మాది ఈ ఇల్లు కాదు.. ఎదురిల్లు

**మీ ఇంట్లో వాడుతున్నవా? లేదా?**

**గృహిణి:** ఒకటే ఉన్నది సార్..

**ఇంకోటి ఏమైంది?**

**గృహిణి:** అప్పుడిచ్చిండ్లు.. ఇప్పుడు ఇవ్వలేదు సార్

**నెలకోటి ఇస్తరా ఏందీ? ఆ డబ్బాల్లో పప్పులు పోసిండ్లా?**

**గృహిణి:** అవును సార్

**అందుకే అడుగుతున్న తెల్వక అడుగుతున్న అనుకున్నవా?**

**గృహిణి:** హా అవును సార్ నిజమే

**(అధికారులతో)మళ్లీ ఒక రౌండ్ కొత్తగా ఇవ్వండి.. హైమా ఈసారి వాడకపోతే ఫైన్ వేస్తం**

**గృహిణి:** కొత్తవి ఇవ్వండి సార్

**పప్పులు, బియ్యాలు పొయ్యద్దు మరి**

**గృహిణి:** పప్పులు, బియ్యం కాదు.. తడి, పొడి చెత్త వేస్తం

**ఉల్టా నాకే చెప్తున్నవా? (నవ్వులు).. నేను ఇంతసేపు క్లాస్ పీకితే, నువ్వు ఉల్టా నాకే చెప్తావ్.. బాగున్నవ్ తల్లీ..**

**గృహిణి:** మీక్కూడా క్లారిటీ ఇవ్వడం కోసం చెప్తున్నం సార్

**ఏం చదువుకున్నవ్.. జీవితం చదివినవా?**

**గృహిణి:** ఇంటర్ సార్

**చదివేసినవ్ అర్థమైంది.. కానీ బుట్టలు ఇస్తాం.. సిబ్బందిని పెంచుతం కాని దయ చేసి వాడండి..(నవ్వుతూ..)**

# వేగంగా సమ్మక్క బరాజ్ పనులు

- కొనసాగుతున్న గేట్ల బిగింపు ప్రక్రియ
- ఏప్రిల్ చివరినాటికి నీటినిల్వ
- దేవాదుల, ఎస్సారెస్పీ ఆయకట్టు స్థిరీకరణకు మరింత భరోసా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద గోదావరిపై చేపట్టిన సమ్మక్క బరాజ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశానుసారం ఏప్రిల్ చివరినాటికి సమ్మక్క బరాజ్‌ను సిద్ధంచేసి.. నీటిని నిల్వచేసేందుకు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. ఇప్పటికే 80 శాతానికిపైగా పనులు పూర్తికాగా.. కొన్నిరోజులుగా గేట్ల బిగింపు ప్రక్రియను శరవేగంగా చేపడుతున్నారు. ఉమ్మడిరాష్ట్రంలో నిర్మించిన దేవాదుల ప్రాజెక్టు మనుగడ ప్రశ్నార్థకంగా మారిన నేపథ్యంలో సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల రీడిజైనింగ్‌లో భాగంగా సమ్మక్క బరాజ్ నిర్మాణానికి రూపకల్పన చేసిన విషయం తెలిసిందే. దేవాదుల పరిధిలోని 6.21 లక్షల ఎకరాలతోపాటు ఎస్సారెస్పీ 1, 2 కింద ఏడున్నర లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ఈ బరాజ్ కీలకం కానున్నది. సరాసరి 470 టీఎంసీల నీటిలభ్యత ఉన్న ఈ ప్రదేశంలో బరాజ్ నిర్మాణం ద్వారా 50 టీఎంసీలను వినియోగించుకొనేందుకు వీలుంటుంది. దీంతోపాటు పది యూనిట్ల ద్వారా 240 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన కేంద్రాన్ని కూడా ప్రతిపాదించారు. రూ.1,624.83 కోట్లతో తుపాకులగూడెం వద్ద 92 మీటర్ల ఎత్తులో 1132 మీటర్ల పొడవున బరాజ్ నిర్మాణాన్ని చేపడుతుండగా.. 83 మీటర్ల ఎత్తులో 6.94 టీఎంసీలను నిల్వ చేయనున్నారు. దేవాదుల ఇన్‌టేక్ పాయింట్ సముద్రమట్టానికి 71మీటర్ల మేర ఉండటంతో కొన్నిరోజులు మాత్రమే నీటి లభ్యతకు అవకాశం ఉన్నది. దీంతో ఆయకట్టులో కనీసం పదిశాతానికి కూడా నీటిని అందించలేని పరిస్థితి. కానీ సమ్మక్క బరాజ్ వల్ల దేవాదుల ప్రాజెక్టు ఇన్‌టేక్ వద్ద ఏడాది పొడవునా నీటి లభ్యత ఉండనున్నది.



ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద గోదావరిపై నిర్మాణంలో ఉన్న సమ్మక్క బరాజ్

### 80 శాతం పూర్తయిన పనులు

సమ్మక్క బరాజ్ నిర్మాణంలో భాగంగా 24 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పనిచేయాల్సి ఉండగా.. ఇప్పటికే 20 లక్షల క్యూబిక్ మీటర్ల పని పూర్తయింది. 10.24 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులకు దాదాపు ఎనిమిదిన్నర లక్షల క్యూబిక్ మీటర్లు పూర్తయింది. బరాజ్‌కు 59 రేడియల్ గేట్లను బిగించాల్సి ఉండగా.. కొన్నిరోజులుగా ఆ పనులు కొనసాగుతున్నాయి. లక్ష్మీ, సరస్వతి, పార్వతీ బరాజ్‌ల నుంచి మోటర్ల ద్వారా ఎత్తిపోతల తర్వాత గేట్లు ఎత్తి దిగువకు వదిలే నీటిని ఒడిసిపట్టేలా బరాజ్‌ను సిద్ధంచేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. దీంతో స్లూయిస్ బేస్ వద్ద గేట్ల బిగింపును త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. తద్వారా ఎగువనుంచి వచ్చే 2.50-3 టీఎంసీల వరకు జలాలను ఒడిసిపట్టేందుకు వీలవుతుందని భావిస్తున్నారు. ఇప్పటికే 80 శాతం ఫిజికల్ వర్క్స్ పూర్తయినట్టు అధికారులు తెలిపారు. రూ.1217.34 కోట్లు (75 శాతం) వరకు ఖర్చుచేశారు. వర్షాకాలం నుంచి బరాజ్‌లో నీటి నిల్వ కొనసాగడంతోపాటు దేవాదుల పునర్జీవ ప్రస్థానం మొదలుకానున్నది.

# రోజున్నరలో 12 టీఎంసీలు

- శ్రీశైలం నుంచి విద్యుదుత్పత్తిద్వారా కొనసాగుతున్న నీటివిడుదల
- సాగర్‌లో క్రమంగా పెరుగుతున్న నీటిమట్టం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కృష్ణానదీ యాజమాన్య బోర్డు దౌత్యం ఫలించింది. శ్రీశైలం నుంచి విద్యుదుత్పత్తి ద్వారా ఒకటిన్నర రోజులోనే నాగార్జునసాగర్‌కు 12 టీఎంసీల జలాలు చేరుకున్నాయి. దీంతో సాగర్ నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. నాగార్జునసాగర్ నుంచి రెండురాష్ట్రాల అవసరాలకు కేటాయించిన నీటిపరిమాణం.. ఆ ప్రాజెక్టు ఎండీడీఎల్ ఎగువన నిల్వల కంటే ఎక్కువగా ఉండటంతో శ్రీశైలం నుంచి 63 టీఎంసీలు విడుదలచేయాలని బోర్డు ఆదేశించింది. శ్రీశైలంలో ఎడమ, కుడిగట్టు విద్యుత్ కేంద్రాల ద్వారా ఈ నీటిని విడుదలచేయాలని సూచించింది. ఆ ఆదేశాలు సక్రమంగా అమలుకాకపోవడంతో ఈ నెల 12న బోర్డు రెండురాష్ట్రాలకు లేఖ రాసింది. కానీ, 10.941 టీఎంసీలు మాత్రమే విడుదలయ్యాయి. శ్రీశైలం, సాగర్ నుంచి రెండు రాష్ట్రాల నీటి వినియోగం పెరుగుతుండటం.. జలాశయాల్లో నీటిమట్టాలు తగ్గుతున్న దరిమిలా ఈ నెల 24న మరోసారి బోర్డు రెండురాష్ట్రాలకు లేఖ రాసింది. తమ ఆదేశాలను వెంటనే అమలుచేయాలని, విద్యుదుత్పత్తి ద్వారా సాగర్‌కు నీటిని విడుదలచేయాలని ఆదేశించింది. తక్కువ మోతాదులో నీటిని విడుదల చేయడంతో ఆవిరి నష్టాలు ఎక్కువగా ఉంటున్నాయని.. సాధ్యమైనంత మేర ఎక్కువ పరిమాణాన్ని విడుదల చేయాలని కూడా పేర్కొన్నది. దీంతో ఏపీ ఎట్టకేలకు స్పందించింది. ఈ నెల 24న అర్ధరాత్రి నుంచి శ్రీశైలం రెండువైపులా విద్యుదుత్పత్తిని పెంచారు. ఫలితంగా బుధవారం మధ్యాహ్నం మూడుగంటలవరకు శ్రీశైలం నుంచి 12 టీఎంసీలకుపైగా జలాలు నదిలోకి విడుదలయ్యాయి. ఇదే సమయంలో సాగర్‌లో నీటిమట్టం 546.2 అడుగుల నుంచి 548.7 అడుగులకు పెరిగింది. బోర్డు ఆదేశాల ప్రకారం శ్రీశైలం నుంచి 63 టీఎంసీలను విడుదల చేయాల్సి ఉండగా.. బుధవారం మధ్యాహ్నం వరకు సుమారు 24 టీఎంసీల విడుదల పూర్తయింది. ఇదేతీరున కరంటు ఉత్పత్తిని కొనసాగించినా.. 20-25 రోజుల్లో బోర్డు సూచించిన మేరకు జలాలు సాగర్‌కు చేరుకుంటాయి. తద్వారా రెండు రాష్ట్రాల యాసంగి సాగు, తాగునీటి అవసరాలకు ఇబ్బంది ఏర్పడకుండా ఉంటుంది.

# జీఎస్టీ రాబడిలో తెలంగాణ టాప్


మొదటిపేజీ తరువాయి...


లక్ష్యంతో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సారథ్యంవహిస్తున్న వాణిజ్యపన్నులశాఖపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ ప్రత్యేక పర్యవేక్షణ ఉండటంవల్ల పన్ను వసూళ్లలో అధికారులు దూకుడు ప్రదర్శిస్తున్నారు. వచ్చే 36 రోజుల్లో బకాయిలతోపాటు పన్నుల రూపంలో రూ.8 వేల కోట్ల నుంచి రూ.10 వేల కోట్ల మేరకు వసూలు చేసేందుకు నిరంతర నిఘా కార్యక్రమాన్ని చేపట్టారు. పన్నుల వసూలుతోపాటు ఎగవేతలను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు నిరంతరం పనిచేస్తూ ప్రతిపైసాను ఖజానాకు చేర్చేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నాయి. ప్రతి డివిజన్‌లో రెండు చొప్పున ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. ఇవి రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్నాయి. మరోవైపు ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు వచ్చే వాహనాలను తనిఖీచేసేందుకు 30 ప్రత్యేక బృందాలను నియమించారు. జీఎస్టీ బిల్లు చెల్లించకుండా సరుకులను రవాణా చేస్తున్న వాహనాలను పెద్ద సంఖ్యలో పట్టుకుంటున్నారు. స్పెషల్‌డ్రైవ్‌లను నిరంతరం కొనసాగిస్తూ జీరో దందాకు పూర్తిగా చెక్‌పెట్టగలిగారు. కేవలం వాహనాలను సీజ్‌చేయడం ద్వారానే రూ.27 కోట్ల పన్ను రాబట్టారు. ఈ నెల 23 నాటికి స్టేట్ జీఎస్టీ, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీతోపాటు మద్యం, పెట్రోల్‌పై వ్యాట్ కలిపి మొత్తం రూ.40,268 కోట్ల రాబడి వచ్చింది. ఇందులో కేవలం జీఎస్టీ ద్వారా రూ.20,618 కోట్లు, పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ ద్వారా రూ.7,720 కోట్లు, మద్యం అమ్మకాలపై వ్యాట్ ద్వారా రూ.7,980 కోట్లు వసూలయ్యాయి. గత ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ, వ్యాట్ ద్వారా రాష్ట్ర ఖజానాకు దాదాపు రూ.45 వేల కోట్లు సమకూరాయి. దీంతో తెలంగాణ 15.5 శాతం వృద్ధిరేటు నమోదు చేసుకొని దేశంలో అగ్రభాగాన నిలిచింది. కానీ ఈ సంవత్సరం వృద్ధిరేటు 13 శాతానికి తగ్గింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం పలురకాల వస్తు, సేవలపై జీఎస్టీ రేట్లను తగ్గించడంతోపాటు ఆర్థికమాంద్యం వల్ల రవాణా, సరుకుల కొనుగోలు తగ్గింది. వీటితోపాటు ఈసారి ఎక్కువ కాలంపాటు వర్షాలు కురవడం వల్ల పెట్రోల్‌పై వ్యాట్ కొంత తగ్గింది. ఈ కారణాల వల్ల వృద్ధిరేటు తగ్గినప్పటికీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా రాష్ట్రంలో జీఎస్టీ, వ్యాట్ రాబడులు భారీగా పెరుగుతున్నాయి.




**రాష్ట్రంలో ఈ నెల 23 నాటికి జీఎస్టీ, వ్యాట్ రాబడులు (రూ.కోట్లలో)**

| | |
|---|---|
| జీఎస్టీ, ఐజీఎస్టీ | 20,618 |
| పెట్రోల్‌పై వ్యాట్ | 7,720 |
| మద్యంపై వ్యాట్ | 7,980 |
| కేంద్రం నుంచి జీఎస్టీ నష్టపరిహారం | 2,263 |
| ప్రొఫెషనల్ ట్యాక్స్ ఇతర వ్యాట్ | 1,687 |
| **మొత్తం** | **40,268** |

### జీఎస్టీలోకి 3.85 లక్షల మంది డీలర్లు, ట్రేడర్లు

రాష్ట్రంలో గతేడాది వరకు జీఎస్టీ కింద 2.40 లక్షల మంది డీలర్లు, ట్రేడర్లు నమోదవగా.. ఇప్పుడు ఆ సంఖ్య 3.85 లక్షల వరకు పెరిగింది. వీరిలో 75 శాతం మంది స్టేట్ జీఎస్టీ పరిధిలో, 25 శాతం మంది కేంద్ర జీఎస్టీ పరిధిలో ఉంటారు. వీరందరి నుంచి పన్నుల వసూళ్ల కోసం చేపడుతున్న స్పెషల్‌డ్రైవ్‌లను సీఎస్ సోమేశ్‌కుమార్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఈసారి రాబడి రూ.50 వేల కోట్లు దాటాలని ఆయన స్పష్టం చేయడంతో కమిషనర్ నీతూకుమారి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు తదనుగుణంగా చర్యలు చేపడుతున్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఎప్పటికప్పుడు స్పెషల్‌డ్రైవ్‌లను నిర్వహించడం ద్వారా పన్నుల ఎగవేతకు తావులేకుండా చూస్తున్నారు.

## దేశానికి రోల్‌మోడల్

**జీఎస్టీ** వసూళ్లలో తెలంగాణ అనుసరిస్తున్న విధానాలు.. వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం దేశానికే ఆదర్శంగా నిలిచాయి. కేంద్రం ఇచ్చే నష్టపరిహారంపై ఆధారపడకుండా స్వయం సమృద్ధిని సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న విధానాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. మధ్యప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, రాజస్థాన్, జార్ఖండ్, ఢిల్లీ తదితర రాష్ట్రాల అధికారులు తెలంగాణలో పర్యటించి జీఎస్టీ వసూలుకు అవలంబిస్తున్న విధానాల గురించి తెలుసుకొన్నారు. హైదరాబాద్ ఐఐటీ సహకారంతో రూపొందించిన ఆఫీసర్ ఇంచార్జి (ఓఐసీ), రెవెన్యూ డ్రైవ్ యాప్‌లను వినియోగించాలని కేంద్ర జీఎస్టీ అధికారులు నిర్ణయించారు. కేంద్ర జీఎస్టీ నెట్‌వర్క్ అధికారులు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఎకనామిక్ ఇంటెలిజెన్స్ యూనిట్ ద్వారా అమలవుతున్న సాంకేతికపరమైన విధానాలను పరిశీలించారు. పన్ను ఎగవేతదారుల జాతకాలను వెల్లడించే ఆర్డీ యాప్ అన్ని రాష్ట్రాలను ఆకర్షిస్తున్నది. ఒక్కక్లిక్‌తో డిఫాల్టర్ ఏ ఏ రకమైన పన్నులు ఎంతమేరకు బాకీ ఉన్నారనే సమస్త సమాచారం సాక్షాత్కరిస్తుంది. ఇటీవల రాష్ట్రంలో పర్యటించిన 15వ ఆర్థిక సంఘం సభ్యుడు అజయ్‌నారాయణ తెలంగాణలో అమలవుతున్న విధానాలను ప్రశంసించడమే కాకుండా దేశమంతటా వీటిని అమలుచేయడం మంచిదని అభిప్రాయపడ్డారు. పన్ను రాబడిలో తెలంగాణ ముందువరుసలో ఉన్నదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ సైతం కొనియాడారు.

### వృద్ధిరేటును పెంచండి

జీఎస్టీ, వ్యాట్ పన్నుల వసూలుతీరును నిరంతరం పర్యవేక్షిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ బుధవారం ఉదయం వాణిజ్యశాఖ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 124 సర్కిళ్లు, 12 డివిజన్లు 9 ఎన్‌ఫోర్స్‌మెంట్, ఒక ఎకనామిక్ ఇంటెలిజెన్స్ యూనిట్లకు చెందిన అధికారులు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి వృద్ధిరేటు తక్కువగా ఉన్నదన్న విషయాన్ని గమనంలోకి తీసుకొని అన్ని స్థాయిల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులను నిర్వర్తించాలని ఆదేశించారు. పాత బకాయిలను మార్చి నెలాఖరు వరకు వసూలుచేసి రాబడిని రికార్డుస్థాయిలో పెంచాలని సూచించారు.

## యాదాద్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామివారి బాలాలయంలో ఉదయం 10.55 గంటలకు పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారంగా శ్రీ విష్వక్సేనారాధన, స్వస్తివాచనం కార్యక్రమాలతో ఉత్సవాలకు వేదపండితులు శ్రీకారంచుట్టారు. రక్షాబంధనంతో అధికారుల ఉత్సవ దీక్ష మొదలైంది. సాయంత్రం మృత్సంగ్రహణం, అంకురార్పణం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలి పూజలకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, కలెక్టర్ అనితారామచంద్రన్, యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ సుధాహేమేందర్ హాజరయ్యారు. పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకులు లక్ష్మీనరసింహాచార్యులు, నరసింహాచార్యులు, ఉప ప్రధానార్చకులు వెంకటాచార్యులు, యాజ్ఞీకులు శేషం ప్రణీతాచార్యులు కు ఆలయ ఈవో గీత దీక్షావస్త్రాలు అందజేశారు. గురువారం ఉదయం 11 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 6 గంటలకు భేరీ పూజ, దేవత ఆహ్వానం, హవనం నిర్వహించనున్నారు.



బుధవారం యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

## జైనథ్‌లో పెద్దపులి సంచారం

**జైనథ్:** ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలో పెద్దపులి సంచారం ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నది. నిరాల గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి పెద్దపులి రోడ్డు దాటుతుండగా స్థానికులు సెల్‌ఫోన్లలో ఫొటోలు తీశారు. బుధవారం మాంగూర్ల పంచాయతీ పరిధిలోని దేవుజీగూడలో రాము అనే రైతుకు చెందిన రెండు ఎడ్లను పెద్దపులి గాయపర్చింది. గమనించిన స్థానికుల పెద్దగా కేకలు వేయడంతో పార్డీ, రామాయి గ్రామాల మధ్య సాత్నాల వాగు పరిసరాల్లోకి వెళ్లింది. సాయంత్రం మేడిగూడ ప్రాంతాల్లో పులిని చూసినట్టు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న డీఎఫ్‌వో చంద్రశేఖర్, అధికారులు మేడిగూడ, పార్డీ, రామాయి గ్రామాల పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టి పెద్దపులి అడుగులను గుర్తించారు.



ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం నిరాల వద్ద మంగళవారం రాత్రి రోడ్డు దాటుతున్న పెద్దపులి

# జనగణనతోపాటే ఎన్పీఆర్

- ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు జనాభా లెక్కల సేకరణ
- మూడు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు విజయవంతం
- రాష్ట్రస్థాయిలో మాస్టర్ ట్రైనింగ్ పూర్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో జనాభా లెక్కల సేకరణకు ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. జనగణనతోపాటే జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్) వివరాలను కూడా నవీకరించనున్నట్టు తెలుస్తున్నది. ఇందుకోసం కేంద్రం నుంచి వచ్చిన సూచనల మేరకు తెలంగాణ జనగణన విభాగం, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. దేశవ్యాప్తంగా ఏప్రిల్ ఒకటి నుంచి సెప్టెంబర్ 30లోగా జనాభా లెక్కల సేకరణను పూర్తిచేయాలని నిర్ణయించారు. ఈ వ్యవధిలోనే రాష్ట్రాలు వరుసగా 45 రోజులను ఎంపికచేసుకొని జనగణన పూర్తిచేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే తేదీల ప్రకారం అధికారులు జనాభా లెక్కల సేకరణను చేపట్టనున్నారు. రాష్ట్రంలో పదేండ్ల క్రితం (2010లో) ఏప్రిల్ 26 నుంచి జూన్ 10వ తేదీ వరకు జనగణన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులను ఉపయోగించనున్న నేపథ్యంలో ఈ ఏడాది కూడా వేసవి సెలవుల సమయంలోనే జనగణన చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.




### ఎన్పీఆర్‌కు ఆధారాలు అవసరంలేదు

జనగణనతోపాటే ఎన్పీఆర్ డేటాను అప్‌డేట్ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్పీఆర్‌కు సంబంధించి కుటుంబయజమానికి తెలిసిన వివరాలు చెప్తేచాలని, వాటికి ఎలాంటి ఆధారాలు చూపాల్సిన అవసరం లేదని, జనగణన కోసం ఇండ్లకు వచ్చే ఎన్యూమరేటర్లు కూడా ఎలాంటి పత్రాలు అడుగబోరని అధికారులు చెప్తున్నారు. జనగణన కోసం 31 రకాల ప్రశ్నావళి ఉండగా, ఎన్పీఆర్‌కు 23 ప్రశ్నలున్నాయి. ఈ ప్రశ్నావళిని కేంద్రం త్వరలో విడుదల చేయనుంది. ఎన్యూమరేటర్లు జనాభా లెక్కలు, ఎన్పీఆర్ డేటా వివరాలను వేర్వేరుగా నమోదు చేయనున్నారు. ఈ రెండింటికి వేర్వేరుగా ఫారాలు ఉంటాయి. ఆ ఫారాలలోని వివరాలను ఎన్యూమరేటర్లు కుటుంబ పెద్దను అడిగి నమోదుచేయాల్సి ఉంటుంది.

### మొబైల్‌యాప్ ద్వారా జనగణన

జనగణన, ఎన్పీఆర్ వివరాలను ఎన్యూమరేటర్లు మొబైల్ ద్వారా సేకరించే విధంగా కేంద్ర సెన్సస్ విభాగం ఓ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. దీనికి సంబంధించిన సర్వర్ ఢిల్లీలో ఉంటుంది. జనగణన, ఎన్పీఆర్ వివరాలను యాప్‌లోని వేర్వేరు ఫారాలలో నమోదు చేసిన తరువాత ఎన్యూమరేటర్లు వాటిని సర్వర్‌కు అప్‌లోడ్ చేస్తారు. అప్‌లోడ్ అయిన వివరాలు సదరు మొబైల్‌ఫోన్ నుంచి తొలిగిపోతాయి. దీంతో ఇతరులు వాటిని చూసే లేదా మార్చే అవకాశం ఉండదు. యాప్‌లో కాకుండా ఫారాలపై వివరాలు సేకరించే ఎన్యూమరేటర్లు వాటిని స్థానిక తాసిల్దార్‌కు అప్పగించాల్సి ఉంటుంది.

### అన్ని జిల్లాలకు ప్రిన్సిపల్ సెన్సస్ అధికారుల నియామకం

జనాభా లెక్కల సేకరణ, ఎన్పీఆర్ కోసం జనగణన విభాగం అన్ని జిల్లాలు, మున్సిపల్ కార్పొరేషన్లకు ప్రిన్సిపల్ సెన్సస్ అధికారులను నియమించింది. జిల్లాలకు కలెక్టర్లు, కార్పొరేషన్లకు కమిషనర్లు ప్రిన్సిపల్ సెన్సస్ అధికారులుగా వ్యవహరిస్తారు. డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు, మండలాలలో తాసిల్దార్లు ఆ బాధ్యతను నిర్వహిస్తారు. ఇదిలాఉండగా, జనగణన విభాగం రాష్ట్ర స్థాయిలో శిక్షణ పూర్తిచేసింది. జిల్లాస్థాయిలో శిక్షణ కొనసాగుతున్నట్టు తెలిసింది. అనంతరం క్షేత్రస్థాయి సిబ్బందికి కూడా శిక్షణ ఇవ్వనున్నారు.

### పైలట్ ప్రాజెక్టు విజయవంతం

జనాభా లెక్కల సేకరణకు దేశవ్యాప్తంగా నమూనా సర్వే నిర్వహించారు. తెలంగాణలో నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈ సర్వే చేపట్టారు. ఒక్కో జిల్లాలో 150 ఎన్యూమరేట్ బ్లాక్‌లలో సర్వే నిర్వహించారు. ఒక్కో ఎన్యూమరేట్ బ్లాక్‌లో 150 ఇండ్లు ఉంటాయి. ఈ నమూనా సర్వేలో సుమారు లక్ష మందిని సర్వేచేసినట్టు తెలిసింది. ఈ విధానం విజయవంతం కావడంతో దేశమంతటా అదే విధానాన్ని కొనసాగించాలని నిర్ణయించినట్టు తెలిసింది.

**PROFESSOR JAYASHANKAR TELANGANA STATE AGRICULTURAL UNIVERSITY**
Administrative Office: Rajendranagar: Hyderabad-30

Ref. No.14786/Exams/2019 Date:26-02-2020

**FOURTH CONVOCATION NOTIFICATION**

The Fourth Convocation of Professor Jayashankar Telangana State Agricultural University will be held on 18th March, 2020 (Wednesday) at 10:30 A.M. in the University Auditorium, Rajendranagar. For details visit: www.pjtsau.edu.in

Dr. S.SUDHEER KUMAR, REGISTRAR

**TELANGANA STATE PUBLIC SERVICE COMMISSION**
Prathibha Bhavan, M.J.Road, Nampally, Hyderabad

**VIVA-VOCE FOR DEPARTMENTAL TESTS NOVEMBER-2019 SESSION (Notfn. No.07/2019)**

It is to inform that the TSPSC Will conduct VIVA-VOCE for the eligible candidates on 05-03-2020. The list of eligible candidates along with their Hall Ticket Numbers is displayed on the Commission's website For further details visit website www.tspsc.gov.in

**NOTE:-** Eligible Cnadidates must invariably bring the copy of Hall-Ticket, (Which he/she had produced at the time of written examination) along with their Employee ID card without fail.

Place: Hyderabad Sd/-
Date: 20/02/2020 PRINCIPAL SECRETARY
DIPR R.O. No. 711-PP/CL/Advt/1/2019-20 Dt:26-02-2020

## హైదరాబాద్‌లో రేపటినుంచి ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ, తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 28, 29 తేదీల్లో ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్ (చేప వంటకాల పండుగ) జరుగనుంది. హైదరాబాద్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నేతృత్వంలో రెండురోజులపాటు ఎన్టీఆర్ స్టేడియంలో ఉదయం 11 నుంచి రాత్రి 10.30 వరకు మత్స్య సహకార సంఘాల మహిళలు తయారుచేసిన వంటకాలు ప్రదర్శించనున్నట్టు హైదరాబాద్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షురాలు కొప్పు పద్మ బుధవారం తెలిపారు.

## ఇంజినీరింగ్ అఫిలియేషన్ ప్రక్రియ ప్రారంభం

దరఖాస్తు గడువు మార్చి 11

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరానికి ప్రైవేటు ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల్లో అఫిలియేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఆన్‌లైన్ అఫిలియేషన్ దరఖాస్తుల స్వీకరణకు జేఎన్టీయూహెచ్ బుధవారం నోటిఫికేషన్ జారీచేసింది. ఈ ప్రక్రియ బుధవారం నుంచే ప్రారంభం కాగా, మార్చి 11 వరకు గడువు విధించారు. ఫార్మట్ ఏ-120 ద్వారా దరఖాస్తుకు వీలు కల్పించామని వర్సిటీ రిజిస్ట్రార్ గోవర్ధన్ తెలిపారు. దరఖాస్తులకు www. jntuhaac.in వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలని, పూర్తి వివరాల కోసం 80084 21860 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# టీఎస్ బీపాస్‌పై కసరత్తు

- కామన్ అప్లికేషన్ ఫారం సిద్ధం
- ఎనిమిది శాఖలకు ఒకేసారి దరఖాస్తు
- వివరాలన్నీ సక్రమంగా ఉంటే 21 రోజుల్లోనే అనుమతులు జారీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఎస్ బీపాస్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చే చర్యల్లో రాష్ట్ర పురపాలక శాఖ వేగంపెంచింది. ఇందులో భాగంగా కామన్ అప్లికేషన్ ఫారంను సిద్ధంచేసింది. తద్వారా 500 చ.మీ. విస్తీర్ణం, పదిమీటర్ల ఎత్తున్న నిర్మాణాలకు సులువుగా అనుమతులు లభిస్తాయి. వాణిజ్యభవనాలు, బహుళ అంతస్తుల అపార్టుమెంట్లు, అపార్టుమెంట్ కాంప్లెక్సులు, మల్టిప్లెక్స్ థియేటర్లు, నివాసేతర భవనాలకు సులువుగా అనుమతులు, నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలు (ఎన్వోసీలు) మంజూరు చేస్తారు. దీనికోసం ప్రతిజిల్లాలో కలెక్టర్ నేతృత్వాన సింగిల్ విండో కమిటీ ఏర్పాటుచేస్తారు. 1,000 చ.మీ. లేదా అంతకంటే అధిక విస్తీర్ణంలో నిర్మించే భవనాలకు సంబంధించిన దరఖాస్తులు డీటీసీపీ (టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్)కి వెళ్తాయి. ఆయా నిర్మాణాల సాంకేతిక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాక స్థానిక మున్సిపల్ కమిషనర్ ద్వారా అనుమతులిస్తారు.

### ఒకేసారి ఎనిమిదిశాఖలకు దరఖాస్తు

ప్రస్తుతం బహుళ అంతస్తుల భవనాలు లేదా వాణిజ్య సముదాయాల నిర్మాణానికి అనుమతులు పొందేందుకు, నాలా కన్వర్షన్లకు వివిధ శాఖల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. టీఎస్ బీపాస్ అమల్లోకి వస్తే ఈ దుస్థితి ఉండదు. ఎవరైనా అనుమతి కోసం దరఖాస్తు చేసుకోగానే.. ఆ పత్రం ఎనిమిది ప్రభుత్వ శాఖలకు చేరుతుంది. భూమి యాజమాన్య హక్కు సక్రమంగానే ఉన్నదా? లేదా? అనే విషయాన్ని తెలుసుకునేందుకు దరఖాస్తుదారుడు సమర్పించిన వివరాల కంటే అదనంగా ఎలాంటి సమాచారం కావాలన్నా రెవెన్యూ అధికారులు పదిరోజుల్లోపే అందజేస్తారు. ఆ పత్రాల్ని దరఖాస్తుదారుడు అందజేయగానే రెవెన్యూశాఖ ఎన్వోసీ మంజూరు చేస్తుంది.




**2019 మున్సిపల్ చట్టం ప్రకారం..**

- 75 గజాల్లోపు స్థలంలో జీ+1 ఇల్లు కట్టుకునే వారికి ఎలాంటి అనుమతి అక్కర్లేదు. ఒక్క రూపాయి చెల్లించి అనుమతి తీసుకోవచ్చు. స్థానిక సంస్థ నుంచి ఎన్వోసీ కూడా తీసుకోనక్కర్లేదు.
- 200 చదరపు మీటర్లలోపు స్థలంలో అభివృద్ధి చేసే భవనాలకు ఎలాంటి తనఖా అక్కర్లేదు.
- 500 చ.మీ. లేదా 10 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో నిర్మించే భవనాలకు సింగిల్ విండో ద్వారా 21 రోజుల్లో అనుమతి ఇస్తారు.

### పత్రాలన్నీ సక్రమంగా ఉంటేనే..

సైటు, డ్రాయింగులు, తనఖాకు సంబంధించిన తనిఖీలను టౌన్‌ప్లానింగ్ విభాగం చేపడుతుంది. ఇందుకు పత్రాలన్నీ సక్రమంగా ఉంటే భవన నిర్మాణాలకు 21 రోజుల్లోనే అనుమతి లభిస్తుంది. షార్ట్‌ఫాల్ నోటీసులు ఏమైనా ఉంటే సంబంధిత శాఖలు 10 రోజుల్లోగా దరఖాస్తుదారుడికి అందజేయాలి. ఆ పత్రాలను దరఖాస్తుదారుడు 15 రోజుల్లోగా సమర్పించాలి. ఇవన్నీ సక్రమంగా ఉంటే వెంటనే ఫీజుకు లెటర్‌ను మున్సిపల్ కమిషనర్ ఆ దరఖాస్తుదారుడికి జారీ చేయాల్సి ఉంటుంది. టీఎస్ బీపాస్‌ను త్వరగా అమల్లోకి తెచ్చేందుకు మున్సిపాలిటీలకు సంబంధించిన ప్రభుత్వ భూములు, వక్ఫ్ స్థలాలు, మున్సిపల్ స్థలాలు, లేఅవుట్లు, ఎల్‌ఆర్‌ఎస్, మంచినీట కుంటలు సహా ప్రతిస్థలానికి సంబంధించిన డాటాను తీసుకొని డీటీసీపీ ఓ జాబితాను రూపొందించింది. ప్రస్తుతం ఈ మొత్తం సమాచారాన్ని ఇంటిగ్రేట్ చేయడంతో టీఎస్ బీపాస్ కొలిక్కివచ్చినట్టు తెలుస్తున్నది.

### ప్రత్యేకతలు

- ప్రతి జిల్లాలో కలెక్టర్ నేతృత్వాన బీపాస్ కమిటీ ఏర్పటవుతుంది.
- లేఅవుట్లు, భవన నిర్మాణ ప్రతిపాదనలను ఈ కమిటీ క్షుణ్ణంగా పరిశీలిస్తుంది.
- ఎన్వోసీని ఆన్‌లైన్‌లోనే మంజూరుచేస్తారు.
- అనుమతి తీసుకున్న తర్వాత జిల్లాస్థాయి కమిటీ ఆయా భవనాలను పరిశీలిస్తుంది.
- అనుమతికి విరుద్ధంగా ఎవరైనా నిర్మాణాలను చేపట్టినా, తప్పుడు సమాచారాన్ని అందజేసి అనుమతి తీసుకున్నా చట్టరీత్యా శిక్షిస్తారు.
- ఆయా నిర్మాణాలను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే కూల్చివేస్తారు.




# మూడునెలల్లో యూట్యూబ్ పాఠాలు

- ప్రాథమిక విద్యకు అధిక ప్రాధాన్యం
- ఇంజినీరింగ్ విద్య సమావేశంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రారామచంద్రన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో బోధనా విధానంలో మార్పులు తీసుకొస్తున్నామని విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రారామచంద్రన్ తెలిపారు. ప్రాథమిక విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, వచ్చే మూడునెలల్లో 7-11 తరగతుల వరకు యూట్యూబ్ పాఠాలు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో 'ఇంజినీరింగ్ విద్య - భవిష్యత్తు ప్రణాళిక' అనే అంశంపై బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యలో నాణ్యత ప్రమాణాలు పెరగాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ కళాశాలల్లో కొత్త కోర్సులు ప్రవేశ పెట్టడానికి సరైన బోధనాసిబ్బంది అందుబాటులో లేదని, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ సూచించారు. నానో టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డాటాసైన్స్ వంటి కొత్త కోర్సులను ప్రోత్సహించాలని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ పేర్కొన్నారు. వచ్చే రెండేండ్లలో రాష్ట్రంలో మరో 30 వరకు కళాశాలలు తగ్గుతాయని, కొత్తవాటికి అనుమతిచ్చే ప్రసక్తేలేదని స్పష్టంచేశారు.

**ఇంజినీరింగ్‌లో అప్రెంటిస్‌షిప్ ప్రోత్సహించాలి**

ఇంజినీరింగ్ విద్యలో అప్రెంటిస్‌షిప్‌ను ప్రోత్సహించాలని సైయంట్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి అన్నారు. పారిశ్రామికరంగానికి అనుగుణంగా ఇంజినీరింగ్ విద్యలో మార్పులు తీసుకురావాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ఎన్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్వీ రమణారావు, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) వైస్ చైర్మన్ రాజన్న, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, వెంకటరమణ, జేఎన్టీయూహెచ్ ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



బుధవారం హైదరాబాద్‌లో రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రారామచంద్రన్. చిత్రంలో ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్, ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తదితరులు ఉన్నారు.




**తెలంగాణ ప్రాంతీయ కార్యాలయం**
1-1-61, RTC 'X' రోడ్, P.B.No. 1863,
హైదరాబాద్-500 020.
NABARD ఇ-మెయిల్: hyderabad@nabard.org | www.nabard.org

**హెచ్చరిక ప్రకటన**

కరీంనగర్‌లో శ్రీ అంబటి ప్రసాద్‌రావు అనే పేరుగల వ్యక్తి నాబార్డ్ అధికారిగా నటిస్తూ మరియు నాబార్డ్ పేరును దుర్వినియోగపరుస్తూ సాధారణ ప్రజలను మోసంచేసే ఉద్దేశంతో నాబార్డ్ నుండి రాయితీ భాగాన్ని విడుదల చేయుటకు సహకరించడానికి కమీషన్ డిమాండ్ చేయడం ద్వారా అమాయకులైన రైతులను మోసం చేస్తున్నాడని ఇందుమూలముగా తెలియజేయడమైనది. కరీంనగర్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌వారు 03-02-2020న శ్రీ అంబటి ప్రసాద్‌ను అరెస్ట్ చేశారు.

పైన తెలిపిన వ్యక్తికి-నాబార్డ్‌కు ఎటువంటి సంబంధం లేదని మరియు సదరు వ్యక్తికి సబ్సిడీ దరఖాస్తులు, క్లెయిమ్‌లు లేదా సెటిల్‌మెంట్లతో వ్యవహరించడానికి మరియు/లేదా కమీషన్ వసూలు చేయడానికి ఏ విధమైన రూపంలో కూడా నాబార్డ్ నుండి అధికారం ఇవ్వబడలేదని మరియు పైన తెలిపిన వ్యక్తితో ఎవరైనా వ్యవహరిస్తే అతని/ఆమె స్వంత పూచీకత్తుతో అలా చేసుకోవచ్చునని నాబార్డ్ (నాబార్డ్ చట్టం క్రింద నెలకొల్పబడిన చట్టబద్ధ సంస్థ) తరపున దిగువ సంతకందారు ఇందుమూలముగా ప్రకటిస్తున్నారు.

తేది: 26-02-2020 [నాబార్డ్ తరపున]

## కాకినాడ-తిరుపతికి ప్రత్యేక రైళ్లు

రేపటినుంచి మార్చి 2 వరకు: దక్షిణ మధ్య రైల్వే

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో సికింద్రాబాద్- కాకినాడ టౌన్, సికింద్రాబాద్- తిరుపతి మార్గాల్లో నాలుగు ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైళ్లు శుక్రవారం నుంచి మార్చి 2 వరకు కొనసాగుతాయని చెప్పారు. ఒక్కోమార్గంలో రెండు రైళ్లను నడుపనున్నామని, సికింద్రాబాద్- కాకినాడటౌన్- సికింద్రాబాద్ మార్గంలో నడిచే రెండు రైళ్లు నల్లగొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, భీమవరంటౌన్, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతాయని, వీటిలో ఏసీ 3టైర్, 2టైర్, చైర్‌కార్, స్లీపర్ కోచులుంటాయని తెలిపారు. సికింద్రాబాద్- తిరుపతి-సికింద్రాబాద్ మార్గంలో నడిచే రైళ్లు కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతాయని, వీటిలో ఏసీ 3టైర్, స్లీపర్ కోచులుంటాయని చెప్పారు.

## మే 27న పాఠశాల విద్యపై భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర పాఠశాల విద్యాశాఖకు సంబంధించిన ప్లానింగ్ అండ్ అప్రూవల్ బోర్డు (పీఏబీ) మే 27వ తేదీన సమావేశం కానున్నది. ప్రాథమిక, పాఠశాల విద్యాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న మధ్యాహ్న భోజనం, యూనిఫారాల పంపిణీ, కేజీబీవీలు, సమగ్ర శిక్ష అభియాన్ వంటి పథకాలపై సమావేశంలో చర్చిస్తారు. పాఠశాలలకు సదుపాయాలు మెరుగుపరచడం, ఉపాధ్యాయుల్లో నైపుణ్యాలు పెంచడానికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, కేజీబీవీలలో నాణ్యమైన విద్య, 12వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయడం, విద్యార్థుల నమోదు కోసం ప్రణాళికలు సిద్ధంచేయడం, ఒకేషనల్ విద్యను ప్రోత్సహించడం, వినూత్న ప్రాజెక్టులను రూపొందించడంపై కూడా చర్చించనున్నారు.





నిజామాబాద్‌లో మొక్కనాటి నీళ్లు పోస్తున్న అల్లం నారాయణ

## చెట్లు గొప్ప కమ్యూనికేటర్లు

- కష్టకాలంలో పరస్పరం సహకరించుకుంటాయి
- ఆలోచింపజేస్తున్న ఎంపీ సంతోష్‌కుమార్ ట్వీట్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ ఇందూరు:** గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ చెట్ల గురించి బుధవారం ట్విట్టర్‌లో పోస్ట్‌చేసిన వీడియో క్లిప్పింగ్ ఆద్యంతం ఆలోచింపజేస్తున్నది. నీడనివ్వడమే కాదు, పక్కనున్న చెట్లకు కష్టకాలంలో సహకారమందించే గొప్పగుణం కూడా వాటికి ఉంటుందని తెలియజేసేలా ఒక నిమిషం 46 సెకండ్ల నిడివితో ఉన్న వీడియో నెటిజన్లను అమితంగా ఆకట్టుకుంటున్నది. 'చెట్లు పైకి మౌనంగానే కనిపిస్తాయి కానీ, అవి సమాచారాన్ని పరస్పరం చెరవేసుకొనే గొప్ప కమ్యూనికేటర్లు' అని సంతోష్‌కుమార్ అభివర్ణించారు. కరువు కాటకాలు, ప్రకృతి విపత్తులకు సంబంధించిన సమాచారాన్ని వేర్ల ద్వారా ఒకదాని నుంచి మరో వృక్షానికి చేరవేసుకుంటాయని వివరించారు. పక్కపక్కన ఉన్న చెట్లు ఎలా పరస్పరం సహకరించుకుటాయో వివరించే ఈ వీడియో అందరి దృష్టి ని ఆకర్షిస్తున్నది.

### జోరుగా గ్రీన్‌చాలెంజ్

గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ బుధవారం నిజామాబాద్ నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మొక్క నాటారు. వెల్స్ ఫర్గో కంపెనీ అధికారి శ్రీధర్ చుండూరి హైదరాబాద్ రాయదుర్గంలోని కార్యాలయం ఆవరణలో సిబ్బందితో కలిసి 200 మొక్కలు నాటారు.



మొక్కనాటుతున్న వెల్స్ ఫర్గో కంపెనీ అధికారి శ్రీధర్



హైదరాబాద్ ఓల్డ్‌సిటీలోని జామియా నిజామియా యూనివర్సిటీలో ఆడిటోరియం నిర్మాణానికి మంజూరు చేసిన రూ.50 లక్షల చెక్కును బుధవారం నాంపల్లిలోని వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ అధికారులకు అందజేస్తున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్ సలీం. -హైదరాబాద్, నమస్తే తెలంగాణ



# రివాల్వర్ గురిపెట్టారు



రేవంత్‌రెడ్డి స్వాధీనంలో ఉన్న భూమి చుట్టూ ఏర్పాటుచేసిన ప్రహరీ, ప్రధాన గేట్



న్యాయం కోసం బుధవారం రంగారెడ్డి కలెక్టరేట్‌కు వచ్చిన బాధితులు

మొదటిపేజీ తరువాయి...

న్యాయం జరుగకపోవడంతో పొలం వద్దకెళ్లి కూర్చున్నామన్నారు. దీంతో రేవంత్‌రెడ్డి సోదరులు గూండాగిరి చేశారని.. మొత్తం 21 మందిపై పోలీసులు కేసులు నమోదుచేశారని చెప్పారు. ఆ కేసుల నిమిత్తం ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నామని.. ఈ విషయాలన్నీ గుర్తించి తమకు న్యాయం చేయాలని, విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

### అనిల్‌కుమార్‌కు సంబంధం లేదు

గోపన్‌పల్లికి చెందిన వడ్డే లక్ష్మయ్య వారసులమంటూ నర్సింహ, రమేశ్, శ్రీశైలం, దేవేందర్, సంజీవ, యాదమ్మ, జంగమ్మ, స్వాతి, శ్రీనివాస్ తదితరులు కలెక్టరేట్‌కు రాగా.. అదే గ్రామానికి చెందిన టీ అనిల్‌కుమార్.. రేవంత్‌రెడ్డి, కొండల్‌రెడ్డి మమ్మల్ని మోసంచేశారంటూ 'టీ న్యూస్'తో వాపోయారు. అయితే అనిల్‌కు ఈ భూమితో ఎలాంటి సంబంధం లేదని, ఆయన వేరు.. మేము వేరు అంటూ లక్ష్మయ్య వారసులుగా చెప్పుకొంటున్నవారు పేర్కొంటున్నారు.

### మరో ఇద్దరు తాసిల్దార్ల పాత్ర

గోపన్‌పల్లి భూ వివాదంలో శ్రీనివాస్‌రెడ్డితోపాటు, మరో ఇద్దరు తాసిల్దార్ల పాత్ర ఉన్నట్టు అధికారులు గుర్తించారు. 127 సర్వేనంబర్‌లోని భూమిని అసలు రైతులకు తెలియకుండా కొండల్‌రెడ్డికి మ్యుటేషన్ చేయడంలో రెవెన్యూ అధికారులు కీలకపాత్ర పోషించారు. ఈ విషయంలో శ్రీనివాస్‌రెడ్డి కంటే ముందు ఇక్కడ తాసిల్దార్లుగా పనిచేసిన రాజేశ్వర్‌రెడ్డి, సుబ్బారావు కీలకంగా వ్యవహరించారని అధికారులు గుర్తించారు. శ్రీనివాస్‌రెడ్డిని ఇప్పటికే సస్పెండ్ చేయగా.. రాజేశ్వర్‌రెడ్డి, సుబ్బారావు రిటైర్డ్ కావడంతో వారిపై చర్యలకు ప్రభుత్వానికి సిఫారసు చేశారు. గోపన్‌పల్లి భూ వివాదంపై ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ముందుకెళ్తామని రంగారెడ్డి కలెక్టర్ అమయ్‌కుమార్ 'నమస్తే తెలంగాణ' తో తెలిపారు.

### రౌడీలతో గెంటివేయించారు: శ్రీశైలం, బాధిత రైతు

లక్ష్మయ్య వారసులుగా ఆ భూమిలో మాకు వాటా ఉన్నది. 10.21 ఎకరాల చుట్టూ ప్రహరీ నిర్మించేటప్పుడు అడుకున్నాం. దానిని కూల్చేశాం. మమ్మల్ని రౌడీలతో బయటకు తోసేశారు. వివాదం పెద్దది కావడంతో చర్చలు జరిపి డబ్బులు ఇస్తామని హామీ ఇచ్చారు. అప్పుడు.. ఇప్పుడూ అంటూ తిప్పి డబ్బులు ఇవ్వకపోగా పోలీస్‌స్టేషన్‌కు పిలిచి బెదిరించారు. 21 మందిపై కేసులు పెట్టారు.

### మా ఫిర్యాదును తీసుకోలేదు: సంజీవ, బాధిత రైతు

గోడ నిర్మాణం సమయంలో గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేస్తే పట్టించుకోకపోగా పోలీసులు బెదిరించారు. మీ పేరుమీద భూ రికార్డులు లేవు.. డాక్యుమెంట్స్ తీసుకు రండి అంటూ ఉచిత సలహాఇచ్చారు. మా తాత భూమికి మేము వారసులం.. మేమే రికార్డు అంటే ఎవరూ పట్టించుకోలేదు.

### మా మామను గన్‌తో బెదిరించారు: శ్రీనివాస్, బాధిత రైతు

పైసలు ఇస్తామని మా మామను పిలిచి రేవంత్‌రెడ్డి తమ్ముడు కొండల్‌రెడ్డి గన్‌తో బెదిరించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఫిర్యాదు తీసుకోలేదు. 24 గంటల సమయం ఇచ్చారు. తిరిగి మాపైనే కేసులు పెట్టారు.

### కలెక్టర్ సారూ.. న్యాయం చేయండి: స్వాతి, బాధిత రైతు

కలెక్టర్ సారూ.. మా భూమిమాకు ఇప్పించి న్యాయం చేయండి. మా కుటుంబంలో ఎవరికీ చదువులేదు. భూమి రికార్డులు అంటే ఏమిటో తెలియదు. మా పొలంలో పంటలు పండించినం. ఇప్పుడు కూడా మామిడి తోట ఉన్నది. అది మా పెద్దవాళ్లు పెట్టిన్రు. గోపన్‌పల్లి అప్పుడు పల్లెటూరు. ఇప్పుడు ఐటీ కంపెనీలు రావడంతో పొలాల విలువ పెరిగింది. మా లక్ష్మయ్య తాతతో 2019లో రేవంత్‌రెడ్డితో మాట్లాడించాం. ఎకరం చొప్పున ధర కట్టించి ఇస్తానని చెప్పారు. కానీ నేటివరకు మా డబ్బులు ఇవ్వలేదు. ఈ బాధతోనే మా తాత 2019లో చనిపోయాడు. రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే, ప్రజాసేవ చేస్తున్న నాయకుడు.. మాకెందుకు అన్యాయం చేస్తాడులే అని అనుకున్నాం. ఎంతకైనా పోరాటం చేస్తాం. ఎవరి బెదిరింపులకు భయపడం.



నెదర్లాండ్స్ బృందానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మార్కెటింగ్‌శాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి

## 'ఉద్యాన'కు సాంకేతిక సహకారం

- ప్రాసెసింగ్ యూనిట్లకు టెక్నాలజీని అందిస్తాం
- నెదర్లాండ్స్ ట్రేడ్ యూనియన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ఉద్యానపంటల దిగుబడులను పెంచడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు తాము సిద్ధమని నెదర్లాండ్స్ ట్రేడ్ యూనియన్ అధికారుల బృందం హామీ ఇచ్చింది. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో భారత్‌లోని నెదర్లాండ్స్ రాయబార కార్యాలయానికి చెందిన ప్రతినిధి ఏఈవాన్ డిజీల్, ట్రేడ్ యూనియన్ కమిషనర్ రాంబాబు ఆధ్వర్యంలో తొమ్మిదిమంది సభ్యుల ట్రేడ్ యూనియన్ అధికారుల బృందం వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ కార్యదర్శి డాక్టర్ బీ జనార్దన్‌రెడ్డితో సమావేశమైంది. ఈ సందర్భంగా తెలంగాణలో ఉద్యానపంటల తీరును నెదర్లాండ్స్ బృందానికి జనార్దన్‌రెడ్డి వివరించారు. రాష్ట్రంలో వివిధ రకాల పంటల దిగుబడిని పెంచడానికి నెదర్లాండ్‌లో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై చర్చించారు. వ్యాపార ప్రణాళికలను రూపొందించడానికి, సుగంధ ద్రవ్యాలు, పండ్ల కోసం గ్రామస్థాయి ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు సాంకేతిక సహకారం అందిస్తామని బృందం తెలిపింది. సమావేశంలో ఉద్యానశాఖ డైరెక్టర్ వెంకట్రాంరెడ్డి, ఉద్యాన వర్సిటీ ఇంచార్జి రిజిస్ట్రార్ భగవాన్ పాల్గొన్నారు.

## ఇతర రాష్ట్రాలకు బ్లాక్‌చైన్ చేయూత

సహకరించేందుకు సిద్ధం: పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బ్లాక్‌చైన్ టెక్నాలజీ వినియోగంలో తెలంగాణ ముందంజలో ఉన్నదని, ఇతర రాష్ట్రాలకు దాని సాంకేతిక సహకారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ చెప్పారు. హైదరాబాద్‌లోని హోటల్ హరిత ప్లాజాలో బుధవారం తెలంగాణ ఐటీ శాఖ, సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్(సీ-డాక్)ల సంయుక్త ఆధ్వర్యంలో బ్లాక్‌చైన్ టెక్నాలజీ, ఈ-సైన్ అంశాలపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జయేశ్‌రంజన్ మాట్లాడుతూ, తెలంగాణలోని వివిధ శాఖల్లో బ్లాక్‌చైన్ టెక్నాలజీని సమర్థంగా ఉపయోగించుకుంటున్నామని, ఇందుకోసం ప్రత్యేకంగా బ్లాక్‌చైన్ డిస్ట్రిక్ట్‌నే ఏర్పాటుచేశామని చెప్పారు. బ్లాక్‌చైన్ టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకుని, మంచి ఫలితాలు సాధిస్తున్న నేపథ్యంలో తెలంగాణకు ఇప్పటికే అనేక అవార్డులు వచ్చాయని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఏడు రాష్ట్రాలకు చెందిన 72 మంది అధికారులు ప్రాపర్టీ రికార్డ్ మేనేజ్‌మెంట్, డిజిటల్ సర్టిఫికెట్ మేనేజ్‌మెంట్, హెల్త్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్, ఈ-సైన్స్, ఈ-గవర్నెన్స్ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎమర్జింగ్ టెక్నాలజీస్ డైరెక్టర్, ఐటీ శాఖ ఓఎస్డీ రమాదేవి, సీ-డాక్ హైదరాబాద్ డైరెక్టర్ మాగేష్ పాల్గొన్నారు.

## గల్ఫ్ ఆయిల్‌లో పేలుడు

- ఒకరి మృతి.. నలుగురికి గాయాలు



చికిత్స పొందుతున్న పద్మారావు

**కూకట్‌పల్లి, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ కూకట్‌పల్లిలోని గల్ఫ్ ఆయిల్ కార్పొరేషన్ కంపెనీలో పేలుడు సంభవించి ఒకరు మృతి చెందారు. నలుగురు గాయపడ్డారు. బుధవారం కంపెనీలోని 46 సీ బ్లాక్‌లో ఫిల్లింగ్ అండ్ ప్రెస్సింగ్ విభాగంలో డిటోనేటర్‌లో పేలుడు పదార్థాన్ని నింపుతున్న సమయంలో ఒక్కసారిగా డిటోనేటర్ పేలడంతో ఉప్పల్ బీరప్పగడ్డకు చెందిన ఏలేశ్వర వాసుదేవశర్మ (62) అక్కడికక్కడే మృతిచెందారు. వారాసిగూడకు చెందిన రాజు, మియాపూర్ జేపీనగర్‌కు చెందిన గోరికలల పద్మారావు, బోయిన్‌పల్లికి చెందిన హరినాథ్, నాగోల్ మోహన్‌నగర్‌కు చెందిన నవీన్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఈఎస్‌ఐ దవాఖానకు తరలించారు. రాజు పరిస్థితి విషమంగా ఉన్నదని వైద్యులు తెలిపారు. మృతుడు వాసుదేవశర్మ కుటుంబానికి కంపెనీ యాజమాన్యం రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించేందుకు హామీఇచ్చినట్టు తెలిసింది. మృతిచెందిన కార్మికుడితో పాటు గాయపడ్డవారు గతంలో ఈ కంపెనీలోనే ఉద్యోగ విరమణ పొంది.. ప్రస్తుతం క్యాజువల్ లేబర్‌గా పనిచేస్తున్నట్టు సమాచారం. నెల వ్యవధిలో ఇది రెండో ప్రమాదం కావడం గమనార్హం.

## నీరా అమలుకు ప్రణాళికలు

- ఉన్నతాధికారులతో సమీక్షలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశం



బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పర్యాటక, ఎక్సైజ్ శాఖలపై ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నీరా పాలసీని వీలైనంత త్వరగా అమల్లోకి తెచ్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్‌శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. నీరా పాలసీ అమలు, ఆబ్కారీశాఖ పనితీరుపై మంత్రి బుధవారం తన కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఎక్సైజ్‌శాఖ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు కమిషనర్ అజయ్‌రావు, హరికిషన్, జేసీ ఎస్‌వై ఖురేషి, ఈఎస్ దత్తరాజ్‌గౌడ్‌తోపాటు టీఎస్‌బీసీఎల్ ఉన్నతాధికారులు సంతోష్‌రెడ్డి, కులకర్ణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలమేరకు రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా నీరా పాలసీని ప్రవేశపెడుతున్నామని చెప్పారు. ఇందులో భాగంగా ఆబ్కారీశాఖ అధికారులు కేరళ, ఏపీలోని రాజమండ్రి హార్టికల్చర్ వర్సిటీలలో పర్యటించి నీరా సేకరణ, నిల్వ, మార్కెటింగ్‌తోపాటు కేఫ్‌ల ద్వారా అందించడంపై చేసిన అధ్యయనాన్ని అడిగి తెలుసుకొన్నారు. సీఎం కేసీఆర్ ప్రజల ఆరోగ్యంతోపాటు గీత వృత్తిదారుల ఆత్మగౌరవం కోసం ప్రవేశపెడుతున్న నీరాను అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధంచేయాలని అధికారులను ఆదేశించారు. టీఎస్‌బీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మద్యం డిపోల సామర్థ్యాన్ని బట్టి అవసరమైన కొత్త డిపోల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

### 'పురావస్తు' పనుల్లో వేగంపెంచండి

హెరిటేజ్ సర్క్యూట్‌లో భాగంగా పురావస్తు కట్టడాల పరిరక్షణకు చేపడుతున్న పనులను వేగవంతంచేయాలని పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. బుధవారం రవీంద్రభారతిలోని ఆయన కార్యాలయంలో పర్యాటకశాఖపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. హయత్ భక్షి మసీదులో చేపట్టిన పునర్నిర్మాణ పనులను త్వరలో పరిశీలిస్తామని చెప్పారు. సిరిసిల్ల, మిడ్ మానేరులలోని పర్యాటక ప్రదేశాల అభివృద్ధిపై చర్చించారు. గత పర్యటనలో మంత్రి కేటీఆర్ సూచించిన విధంగా డిజైన్లు రూపొందించి, సీఎం కేసీఆర్ ఆదేశాలమేరకు టూరిజం అభివృద్ధి పనుల ప్రణాళిక సిద్ధంచేయాలని ఆదేశించారు. సమావేశంలో టూరిజం ఎండీ మనోహర్, ఎస్‌ఈ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్ మందలించారని..

నార్సింగిలోని కార్పొరేట్ కాలేజీలో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



మృతుడు సంజీవ్‌కుమార్

**మణికొండ, నమస్తే తెలంగాణ:** ప్రిన్సిపాల్ వేధింపులు తాళలేక ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. అవుటింగ్ నుంచి వస్తూ సిగరెట్లు, పాన్లు తీసుకొచ్చావంటూ గేటు ముందు గంటల తరబడి కూర్చోబెట్టి దూషించడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం తీవ్ర కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా జగిత్యాలకు చెందిన ఎం కాశీరాం కుమారుడు సంజీవ్‌కుమార్ (17) నార్సింగిలోని ఓ ప్రైవేటు రెసిడెన్షియల్ కాలేజీలో సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం అనుమతితో నాటా అప్లికేషన్ కోసం బయటకువెళ్లాడు. అనంతరం స్నేహితులతో కలిసి వచ్చాడు. గేటు వద్ద సెక్యూరిటీ సిబ్బంది సంజీవ్‌ను సోదాచేయగా.. అతడి వద్ద సిగరెట్లు, పాన్లు ఉన్నట్టు గుర్తించి ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డికి ఫిర్యాదుచేశారు. ప్రిన్సిపాల్ వేధింపుల కారణంగానే సంజీవ్ ఆత్మహత్యకు పాల్పడినట్టు తోటి విద్యార్థులు ఆరోపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించామని కేసు దర్యాప్తుచేస్తున్నామని ఎస్సై రాములు తెలిపారు.

## సింగరేణి ఉద్యోగాల పేరిట మోసానికి యత్నం

- పోలీసుల అదుపులో ఇద్దరు

**హైదరాబాద్, మంచిర్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** సింగరేణిలో ఉద్యోగాల పేరిట ప్రలోభాలకు గురిచేస్తున్న ఓ ముఠా ఆటను ఆ సంస్థ విజిలెన్స్ అధికారులు కట్టించారు. రూ.20 లక్షలు ఇస్తే సింగరేణిలో ఉద్యోగం ఖాయమంటూ వలవేసేందుకు ప్రయత్నిస్తూ బుధవారం సాయంత్రం పోలీసులకు దొరికిపోయారు. సింగరేణి మేనేజ్‌మెంట్ ట్రైనీ ఉద్యోగాల కోసం మార్చి ఒకటిన రాతపరీక్ష జరుగనున్న నేపథ్యంలో ఇద్దరు వ్యక్తులను ఆ సంస్థ విజిలెన్స్, సెక్యూరిటీ విభాగం నాంపల్లి పోలీసులకు పట్టించింది. కంప్యూటర్ ఆధారిత వ్యవస్థతో పరీక్షలను నిర్వహించేందుకు చర్యలు తీసుకొంటున్నా.. కొందరు దళారులు ఉద్యోగాలు ఇప్పిస్తామనే పేరుతో డబ్బు దండుకొనేందుకు రంగంలోకి దిగినట్టు సింగరేణి విజిలెన్స్ దృష్టికొచ్చింది. హైదరాబాద్‌కు చెందిన అశోక్‌రెడ్డి, ఐత సాయి అనే వ్యక్తులు అమాయక అభ్యర్థులను మోసపుచ్చడానికి ప్రయత్నిస్తున్నారని తెలిసి నాంపల్లి పోలీస్‌స్టేషన్‌లో సింగరేణి విజిలెన్స్ అధికారులు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు నాంపల్లిలో కాపుకాసి వారిని పట్టుకొని స్టేషన్‌కు తరలించి కేసు నమోదుచేశారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా చెప్తే మోసపోకుండా జాగ్రత్త పడాలని సింగరేణి డైరెక్టర్ ఎస్ చంద్రశేఖర్ సూచించారు.

## సిద్ధమవుతున్న డయాగ్నస్టిక్ హబ్‌లు

మొదటిపేజీ తరువాయి...

హబ్‌లలో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులతోపాటు వీడీఆర్‌ఎల్, హెమటాలజీ, బ్లడ్‌గ్రూపింగ్, ప్లేట్‌లెట్స్, హార్మోన్ స్టడీస్, మేజర్, మైనర్ సర్జికల్ ప్రొఫైల్, హెచ్‌ఐవీ, హెచ్‌బీఎస్‌ఏజీ, హెచ్‌సీవీ, విటమిన్ బీ 12, డీ విటమిన్, షుగర్, కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు, థైరాయిడ్, ఫీవర్, టీబీ, క్యాల్షియం వంటి అనేక పరీక్షలను నిర్వహిస్తారు.

### రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ

ప్రస్తుతానికి 20చోట్ల డయాగ్నస్టిక్ హబ్‌లను అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు, ఏరియా, జిల్లాస్థాయి దవాఖానలను అనుసంధానిస్తూ వీటిని నిర్వహిస్తారు. ఇందుకోసం కరీంనగర్, సిద్దిపేట, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, వికారాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, నల్లగొండ, సూర్యాపేట, జనగామ, ములుగు, మహబూబాబాద్, ఖమ్మం, కొత్తగూడెం, జగిత్యాల, ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో ఏర్పాటుచేసిన డయాగ్నస్టిక్స్ హబ్‌లను దశలవారీగా అందుబాటులోకి తెచ్చేందుకు వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

### తెలంగాణ విధానాలపై కేంద్రం అధ్యయనం

తెలంగాణ డయాగ్నస్టిక్స్ ప్రొక్యూర్‌మెంట్ విషయంలో తెలంగాణ అనుసరిస్తున్న విధానాలను కేంద్ర ప్రభుత్వం అధ్యయనంచేస్తున్నది. తెలంగాణ సలహాలు, సూచనలతో మెరుగైన పద్ధతులను కేంద్రం అనుసరించబోతున్నది. ప్రధానంగా బోధన వైద్యశాలల్లో అడ్వాన్స్‌డ్ డయాగ్నస్టిక్స్ కేంద్రాల ఏర్పాటు, వాటి పనితీరుపై కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వశాఖ ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నది. పలు రాష్ట్రాలు కూడా తెలంగాణను అనుసరించడానికి ఆసక్తిచూపుతున్నాయి.

# కట్టెలపొయ్యితో కష్టాలే

కిరోసిన్ వాడకం, కట్టెల పొగతో అధిక ప్రమాదం

- ప్రపంచవ్యాప్తంగా ఏటా 38 లక్షల మంది మృత్యువాత
- 45% గుండె, 8% ఊపిరితిత్తుల క్యాన్సర్ బాధితులు
- బాధితుల్లో మహిళలు, బాలికలే ఎక్కువ: డబ్ల్యూహెచ్‌వో



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

మనుషులు జీవించేందుకు గాలి, నీరు, భూమి అత్యంత ప్రధానం. ఇందులో ఏదిలేకున్నా జీవితమే ప్రశ్నార్థకమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ కాలుష్యం పెరుగుతున్నది. గాలి కాలుష్యం ప్రమాదకరంగా మారింది. ప్రపంచ వ్యాప్తంగా వాయుకాలుష్య ప్రభావంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) అధ్యయనం చేయగా సర్వేలో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. ప్రపంచంలో 70 లక్షల మందికిపైగా వాయుకాలుష్యం కారణం గా మృతి చెందుతున్నారని, వీరిలో 38 లక్షలమంది ప్రజలు ఇండ్లలో ఉపయోగించే కట్టెల పొయ్యి, కిరోసిన్ వంటి ఇంధనాల కారణంగా అర్ధంతరంగా మరణిస్తున్నారని సర్వే స్పష్టం చేసింది.

### ఇప్పటికీ కట్టెల పొయ్యిమీదే వంట!

ప్రపంచవ్యాప్తంగా పేద, మధ్య దేశాల్లోని 300 కోట్ల మంది ప్రజలు ఇప్పటికీ కట్టెలు, కిరోసిన్, పశువులపేడ, బొగ్గులనే వంట వండుకోవడానికి ఉపయోగిస్తున్నారని తేలింది. వీటి వాడకంతో అనేక వ్యాధుల బారినపడి ఆరోగ్యం దెబ్బతింటున్నది. బహిరంగ ప్రదేశాల్లో మంటద్వారా జరిగే వాయుకాలుష్యంతో కంటే.. ఇండ్లలో వంటకు ఉపయోగించే మంట ద్వారా వచ్చే వాయు కాలుష్యంతోనే వంద రెట్లు ఎక్కువగా వ్యాధులకు గురవుతున్నారని అధ్యయనంలో స్పష్టమైంది. ఇండ్లలో సరైన వాయుప్రసరణ (వెంటిలేషన్) లేకపోవడమే దీనికి కారణమని తెలిపింది. గృహవాయు కాలుష్యంతో వ్యాధులబారిన పడుతున్నవారిలో మహిళలు, బాలికలే ఎక్కువగా ఉన్నట్టు పేర్కొన్నది.

### ఎదురవుతున్న ప్రమాదాలు

గృహ వాయు కాలుష్యంతో మరణించినవారిలో 27 శాతం మంది న్యుమోనియా బాధితులున్నారు. గృహ వాయుకాలుష్య ప్రభావం పిల్లలపై ఎక్కుగా ఉంటుంది. న్యుమోనియా బారినపడి మరణించేవారిలో 45 శాతం ఐదేండ్లలోపు పిల్లలే ఉంటున్నారు. 20 శాతం మంది ప్రజలు క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్‌తో మరణించడానికి ఈ వాయు కాలుష్యమే కారణమవుతున్నది. గృహ వాయుకాలుష్యానికి మహిళలే ఎక్కువగా గురవుతున్నారు. వంటల కోసం వినియోగించే ఘన ఇంధనాల కారణంగా మృతిచెందేవారిలో 12 శాతం మంది గుండెపోటు బాధితులున్నారు. 27 శాతం గుండె సంబంధిత వ్యాధులకు గురవుతున్నారు. 8శాతం మంది ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు గురై మరణిస్తుండగా మృతుల్లో 17 శాతం యువత ఉండటం విశేషం.



### మరణాల తీరు

- 27% మందికి న్యుమోనియా
- 18% మందికి గుండెపోటు
- 27% గుండె సంబంధిత వ్యాధులు
- 20% క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్
- 8 శాతం మందికి ఊపిరితిత్తుల క్యాన్సర్

## ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదులపై మార్చి 26న విచారణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఫిర్యాదులపై మార్చి 26న హైదరాబాద్‌లో బహిరంగ విచారణ నిర్వహిస్తామని ఎన్సీఎస్సీ బుధవారం ప్రకటించింది. ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన వర్గాలు తమ ఫిర్యాదులను ఢిల్లీలోని ఎన్సీఎస్సీ కార్యాలయానికి లేదా రిజిస్ట్రార్-ఎన్సీఎస్సీ@ఎన్ఐసీ.ఇన్ మెయిల్ ద్వారా పంపాలని తెలిపింది. ప్రభుత్వ అధికారులు వేధింపులకు పాల్పడినా, వేధింపులను నిరోధించడంలో నిర్లక్ష్యం వహించినా మార్చి 13లోగా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నది.

## 'అంగన్‌వాడీలకు నిరంతరం పాలు'

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బాలింతలు, గర్భిణుల ఆరోగ్యరక్షణకు అంగన్‌వాడీల ద్వారా అందించే పాలను నిరంతరం సరఫరా చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ కే తిరుమల్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల తనిఖీలో చార్మినార్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలో రెండునెలలనుంచి పాలు సరఫరా కావడంలేదని దృష్టికి వచ్చిందని చెప్పారు. తక్షణమే పాలు సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఫుడ్ కమిషన్ సభ్యుడు కొంతం గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర సమగ్ర శిశు సంక్షేమశాఖ అదనపు డైరెక్టర్ గిరిజ పాల్గొన్నారు.

## అల్లర్లను రాజకీయం చేస్తున్నారు: జవదేకర్

న్యూఢిల్లీ: ఢిల్లీ అల్లర్లకు కేంద్రం బాధ్యత వహించాలన్న సోనియా గాంధీ వ్యాఖ్యలను బీజేపీ ఖండించింది. ఢిల్లీ అల్లర్లపై కాంగ్రెస్ రాజకీయం చేస్తున్నదని కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ విమర్శించారు. 1984 సిక్కు అల్లర్లలో పారిన రక్తంతో చేతులు తడుపుకున్నవారు ఇప్పుడు హింసను అదుపు చేయాలని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని సోనియా డిమాండ్ చేయడం హాస్యాస్పదమన్నారు. పరిస్థితిని అదుపు చేసేందుకు ఆయన నిరంతరం పోలీసులతో సంప్రదింపులు జరుపుతున్నారని చెప్పారు. శాంతిని నెలకొల్పడంలో అన్ని పార్టీలకు బాధ్యత ఉందన్నారు.



ఇప్పుడు ఢిల్లీ ప్రజల ముందు రెండు మార్గాలున్నాయి. ఒకటి.. మనం ఒకరికొకరు అండగా నిలబడటం. ఢిల్లీ అభివృద్ధి కోసం కృషి చేయడం. రెండోది.. అందరం హింసలో పాల్గొని ఒకరిపై ఒకరం దాడిచేసుకోవడం. శవాల గుట్టలపై ఆధునిక ఢిల్లీ నిర్మాణం ఎన్నటికీ సాధ్యం కాదు. మంచి పాఠశాలలు, దవాఖానల ద్వారానే ఢిల్లీ అభివృద్ధి సాధ్యమవుతుంది. ఇక్కడి హిందువులు, ముస్లింలు శాంతియుత జీవనాన్నే కోరుకుంటారు. బయటి నుంచి వచ్చిన వ్యక్తులే హింసాకాండకు కారణం'

—అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి

## గుజరాత్ హింసాకాండను గుర్తుచేస్తున్నది

సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

న్యూఢిల్లీ: ఢిల్లీలో చెలరేగిన హింసాత్మక ఘర్షణలు 2002నాటి గుజరాత్ మత అల్లర్లను గుర్తుచేస్తున్నాయని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. దేశ రాజధానిలో సాధారణ, శాంతియుత వాతావరణం నెలకొనాలంటే తక్షణమే మిలిటరీని రప్పించడమే ఏకైక మార్గమని చెప్పారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ రాజాతో కలిసి బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. పోలీసుల అనుమతితోనే హింస చెలరేగుతున్నదని స్పష్టమవుతున్నదని, కేంద్రం కనుసన్నల్లోనే అది జరుగుతున్నదని ఆరోపించారు. దీనికి రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి బాధ్యత వహించాలని పేర్కొన్నారు. హింసాత్మక ఘటనలను నిలువరించడంలో హోం మంత్రి అమిత్‌షా తీసుకున్న చర్యలేమిటని ఏచూరి, రాజా ప్రశ్నించారు. పరిస్థితిని అదుపుచేయడంలో ఆయన విఫలమయ్యారని విమర్శించారు. త్వరలోనే ఘర్షణలు చోటుచేసుకున్న ప్రాంతాల్లో పర్యటిస్తామన్నారు.

## ఉక్కుపాదంతో అణచివేయండి

లేకపోతే రాజీనామా చేయండి.. కేంద్రంపై మండిపడిన రజినీకాంత్



చెన్నై: ఢిల్లీ అల్లర్లను ఉక్కుపాదంతో అణచివేయాలని, లేకపోతే రాజీనామా చేసి తప్పుకోవాలంటూ తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ కేంద్రంపై మండిపడ్డారు. దేశ రాజధానిలో హింసాత్మక ఘటనల్లో పలువురు ప్రాణాలు కోల్పోవడంపై బుధవారం ఆయన స్పందించారు. 'కచ్చితంగా ఇది కేంద్ర ప్రభుత్వ నిఘా వైఫల్యం. అమెరికా అధ్యక్షుడు (ట్రంప్) మన దేశాన్ని సందర్శించినప్పుడు నిఘా వ్యవస్థలు తమ విధులు సక్రమంగా నిర్వహించలేదు. అల్లర్లను కేంద్రం ఉక్కుపాదంతో అణచివేయాల్సింది. నిఘా వైఫల్యమంటే కేంద్ర హోంమంత్రి వైఫల్యమే. ఉక్కుపాదంతో అణచివేయాలి లేదా రాజీనామా చేసి తప్పుకోవాలి. కేంద్ర, ఢిల్లీ ప్రభుత్వాలు ఇలాంటి వాటిని ఉపేక్షించకూడదు. వీటిని తీవ్రంగా ఖండిస్తున్నా' అని ఆయన అన్నారు.



# 'షా' రాజీనామా చేయాలి

సోనియా గాంధీ డిమాండ్



న్యూఢిల్లీ: ఈశాన్య ఢిల్లీలో హింసకు కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వం బాధ్యత వహించాలని, నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ డిమాండ్ చేశారు. బుధవారం సోనియా నేతృత్వంలో సీడబ్ల్యూసీ సమావేశం జరిగింది. ఢిల్లీ అల్లర్లపై చర్చించి, తీర్మానం చేశారు. అనంతరం సోనియా మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీలో జరుగుతున్న పరిణామాల వెనక ప్రణాళికాబద్ధమైన కుట్ర ఉన్నదని ఆరోపించారు. 'ఢిల్లీ ఎన్నికలప్పుడు బీజేపీ నేతలు తమ ప్రసంగాలతో ప్రజల మధ్య విద్వేషం, భయానక వాతావరణాన్ని సృష్టించారు. బీజేపీ నేత కపిల్ మిశ్రా పోలీసులకు మూడు రోజులు గడువు ఇస్తున్నానంటూ రెచ్చగొట్టారు. అయినా ప్రభుత్వాలు మిన్నకుండిపోవడంతో 72 గంటల్లో 20 మందికిపైగా మరణించారు' అని విమర్శించారు. ఆదివారం నుంచి అమిత్ షా ఎక్కడున్నారని ప్రశ్నించారు. అనంతరం రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించాలని భావించినా.. గురువారం అపాయింట్‌మెంట్ ఇవ్వడంతో నేటికి వాయిదా వేశారు. మరోవైపు ప్రతిపక్ష పార్టీల నేతలు ఈ నెల 28న రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరుతూ లేఖ రాశారు.

# ఢిల్లీని సైన్యానికి అప్పగించండి!

అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఢిల్లీలో అమానుషం రాజ్యమేలుతున్నదని, మానవత్వం మంటగలుస్తున్నదని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తంచేశారు. బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీ పోలీసులు అల్లర్లను అదుపుచేయకపోగా మరింతగా రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. కేంద్రం వెంటనే సైనికులను రంగంలోకి దించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ అల్లర్లు మతకలహాలు కావని, బీజేపీ నాయకులు రెచ్చగొట్టడం, పోలీసులు సహకరించడంతోనే అల్లర్లు జరుగుతున్నాయని విమర్శించారు. ఢిల్లీ అల్లర్లలో మరణాల సంఖ్య ఎక్కువగా ఉన్నదని, ఈ హింసాకాండ గుజరాత్‌లో 2002లో జరిగిన దారుణ మారణకాండను తలపిస్తున్నదని, అల్లా దయతో అటువంటి పరిస్థితి రావద్దని తాను కోరుకుంటున్నానని చెప్పారు. ఢిల్లీ నగరం తగులబడుతున్నా అమిత్‌షా ఇప్పటివరకు ప్రభావిత ప్రాంతాలను సందర్శించలేదని, కిషన్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడమేమిటని ఆయన ప్రశ్నించారు.

# హారర్ సినిమాలా ఢిల్లీలో హింస

దేశానికి అపఖ్యాతి: శివసేన

ముంబై: హారర్ సినిమాను తలపించేలా, 1984లో సిక్కు వ్యతిరేక అల్లర్ల మాదిరిగా.. ఢిల్లీలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయని శివసేన ఆందోళన వ్యక్తంచేసింది. 'ప్రేమ సందేశం'తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌లో పర్యటిస్తున్న సమయంలోనే ఢిల్లీ వీధుల్లో రక్తపుటేరులు పారడం దేశానికి అపఖ్యాతిని తెచ్చిపెట్టిందని శివసేన అధికార పత్రిక సామ్నా ఎడిటోరియల్‌లో బుధవారం పేర్కొన్నది. శాంతిభద్రతల పరిరక్షణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించింది. కొందరు బీజేపీ నాయకులు చేస్తున్న బెదిరింపులు, హెచ్చరికలను ప్రస్తావిస్తూనే.. ప్రస్తుతం ఢిల్లీలో అల్లర్లకు ఎవరు బాధ్యులో బయటపెట్టాలని డిమాండ్ చేసింది. భారత్‌ను అప్రతిష్ఠపాలుచేసేందుకే ఢిల్లీలో హింసకు కుట్ర జరిగిందని కేంద్రం ఆరోపించడాన్ని తప్పుపట్టింది. కుట్ర గురించి ముందుగా తెలియకపోవడం జాతిభద్రతకే ప్రమాదమని పేర్కొన్నది.

# కాలుతున్న ఢిల్లీ



ఢిల్లీ శివవిహార్‌లోని పార్కింగ్ ప్రాంతంలో అల్లరిమూకలు నిప్పుపెట్టడంతో కాలిబూడిదైన కార్లు

27కు పెరిగిన మృతుల సంఖ్య

- అల్లరిమూకల స్వైరవిహారంతో విధ్వంసం
- దగ్ధమైన వాహనాలు, దుకాణాలు, ఇండ్లు
- ఈశాన్య ఢిల్లీలో హింస కాస్త తగ్గుముఖం
- అజిత్ దోవల్‌ను రంగంలోకి దించిన కేంద్రం
- సామరస్యతను పాటించాలని ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: అడుగడుగునా రాళ్లు, ఇటుకలు, గాజు ముక్కలు.. ధ్వంసమైన వాహనాలతో నిండిన రోడ్లు.. కాలిపోయిన దుకాణాలు, పొగచూరిన ఇండ్లు, ప్రార్థనా మందిరాలు. బిక్కుబిక్కుమంటూ బతుకుతున్న ప్రజలు. బోసిపోయిన వీధులు.. ప్రస్తుతం ఢిల్లీలో కనిపిస్తున్న విషాద దృశ్యాలివి. మూడు రోజులుగా కొనసాగుతున్న హింసతో దేశ రాజధాని విధ్వంసమైంది. చాంద్‌బాగ్, జఫ్రాబాద్, భజన్‌పురా, యమునావిహార్, మౌజ్‌పూర్ తదితర ప్రాంతాల్లో వీధులన్నీ విధ్వంసపు సాక్ష్యాలుగా మిగిలాయి. గోకుల్‌పురి సహా కొన్నిచోట్ల అల్లర్లు బుధవారం కూడా కొనసాగాయి. అల్లరిమూకలు స్వైరవిహారం చేశాయి. దుకాణాలను, వాహనాలను ధ్వంసం చేసి నిప్పు పెట్టారు. కొన్ని దుకాణాలను లూటీ చేశారు. అల్లర్లకు సంబంధించి ఇప్పటివరకు 18 కేసులు నమోదు చేశామని, 106 మందిని అరెస్ట్ చేశామని అదనపు పోలీస్ కమిషనర్ మన్‌దీప్‌సింగ్ తెలిపారు. భద్రతా బలగాలను భారీగా మోహరించడంతో ఈశాన్య ఢిల్లీలో బుధవారం పరిస్థితి కొంత అదుపులోకి వచ్చింది. దుకాణాలు, పాఠశాలలను మూసివేయించారు. ప్రజలు ఇండ్లల్లో నుంచి బయటికి రావొద్దని హెచ్చరించారు. ఆయా ప్రాంతాలకు వెళ్లే మార్గాలను మూసివేశారు. తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో ఇరుక్కుపోయిన కుటుంబాలను సురక్షితంగా వారి బంధువుల ఇండ్లకు చేర్చారు. ఆయా ప్రాంతాల్లో మెట్రో స్టేషన్లను మూసివేస్తున్నట్టు ఢిల్లీ మెట్రోరైలు సంస్థ ప్రకటించింది. గురువారం జరుగాల్సిన సీబీఎస్ఈ 12వ తరగతి ఇంగ్లిష్ పరీక్షను ఈశాన్య ఢిల్లీ పరిధిలో వాయిదా వేస్తున్నట్టు బోర్డు ప్రకటించింది.

### కొనసాగుతున్న మరణాలు

ఢిల్లీలో బుధవారం ఒక్కరోజే ఓ పోలీస్ సహా 14 మంది దుర్మరణం చెందారు. దీంతో మృతుల సంఖ్య 27కు పెరిగింది. క్షతగాత్రుల్లో మరికొందరి పరిస్థితి తీవ్రంగా ఉన్నదని గురు తేజ్ బహదూర్ (జీటీబీ) హాస్పిటల్ సూపరింటెండెంట్ సునిల్ కుమార్ గౌతమ్ తెలిపారు. వారికి రాళ్లదెబ్బలతోపాటు తుపాకీ గాయాలు, ఆయుధాలతో దాడి చేసిన గుర్తులు ఉన్నాయన్నారు. చాంద్‌బాగ్ ప్రాంతంలోని ఓ మురుగు కాలువలో ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి అంకిత్ శర్మ(26) మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. రాళ్లదాడిలో ఆయన తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెంది ఉంటాడన్నారు.

### శాంతి నెలకొనాలి: మోదీ

ఢిల్లీ హింసపై ప్రధాని మోదీ తొలిసారి స్పందించారు. ప్రజలంతా శాంతియుతంగా, సోదరభావంతో ఉండాలని పిలుపునిచ్చారు. దేశ రాజధానిలో నెలకొన్న పరిస్థితిపై సమగ్రంగా సమీక్షించినట్టు చెప్పారు. శాంతిభద్రతలు నెలకొనడం, పరిస్థితిని అదుపులోకి తేవడానికి తొలిప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు, ఇతర బలగాలు, ఏజెన్సీలు కృషిచేస్తున్నాయన్నారు.

### సైన్యాన్ని దింపండి

ఈశాన్య ఢిల్లీలో పరిస్థితి ప్రమాదకరంగా మారిందని ఆ రాష్ట్ర సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు విఫలమయ్యారని, వెంటనే సైన్యాన్ని రంగంలోకి దింపాలని కోరుతూ బుధవారం అమిత్‌షాకు లేఖ రాశారు. డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. రాళ్లదాడిలో మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ రతన్‌లాల్ కుటుంబానికి రూ.కోటి పరిహారం ప్రకటించారు.

### రంగంలోకి దోవల్

ఢిల్లీలో పరిస్థితిని చక్కదిద్దే బాధ్యతను కేంద్రం జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌కు అప్పగించింది. ఆయన మంగళవారం అర్ధరాత్రి, బుధవారం పలు ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. స్థానికులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'జరిగిందేదో జరిగింది. అల్లా దయతో.. త్వరలోనే ఈ ప్రాతంలోశాంతి నెలకొంటుంది' అని వ్యాఖ్యానించారు. కొందరు నేరగాళ్లు మాత్రమే విధ్వంసం సృష్టిస్తున్నారని, వారిని గుర్తిస్తున్నామని చెప్పారు. అనంతరం అమిత్‌షాను కలిసి పరిస్థితిని వివరించారు.



క్షతగాత్రుడిని దవాఖానకు తరలిస్తున్న దృశ్యం




# ప్రొఫెషనల్‌గా వ్యవహరించలేదు

ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు చీవాట్లు

న్యూఢిల్లీ: ఈశాన్య ఢిల్లీలో చెలరేగిన హింసపై సుప్రీంకోర్టు విచారం వ్యక్తంచేసింది. అల్లర్లను అడ్డుకోవడంలో పోలీసులు 'ప్రొఫెషనల్'గా వ్యవహరించలేదని చీవాట్లు పెట్టింది. హింసకు సంబంధించిన పిటిషన్లపై విచారణకు నిరాకరించింది. రెచ్చగొట్టేవారు పారిపోయేందుకు అవకాశమిచ్చారని దర్యాప్తు సంస్థలపై మండిపడింది. ఇతరుల ఆదేశాల కోసం ఎదురుచూడకుండా చట్టప్రకారం 'స్వతంత్రంగా' వ్యవహరించాలని స్పష్టంచేసింది. షాహీన్‌బాగ్ నిరసనలపై దాఖలైన పిటిషన్ల వరకే తాము పరిమితమవుతామని, హింసకు సంబంధించిన అంశాలను హైకోర్టు పరిశీలిస్తుందని జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ కేఎం జోసెఫ్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది.

## వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదెందుకు?

న్యూఢిల్లీ: సీఏఏ అల్లర్లకు సంబంధించి ముగ్గురు బీజేపీ నేతలు (కపిల్ మిశ్రా, అనురాగ్ ఠాకూర్, పర్వేశ్ వర్మ) చేసిన విద్వేషపూరిత వ్యాఖ్యలపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. గురువారంలోగా 'జాగరూకతతో' నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. నగరం ఇప్పటికే చాలినంత హింసాకాండను చవిచూసిందని, 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల తరహా మారణహోమం మరోసారి జరుగకూడదని అభిప్రాయపడింది. హింసకు బాధ్యులపై వారిపై ఎఫ్ఐఆర్ నమోదుచేసి, అరెస్ట్ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై కోర్టు బుధవారం విచారణ జరిపింది. కేంద్రాన్ని ఇంప్లీడ్ చేయాలని కోరుతూ తుషార్ మెహతా దాఖలుచేసిన అభ్యర్థనపై పిటిషనర్లకు నోటీసులు జారీచేసింది.

## భారత్ మాతాకీ జై అనేవాళ్లే దేశంలో ఉండాలి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న హింసాకాండపై హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి జైరామ్ ఠాకూర్ స్పందించారు. 'భారత్ మాతాకీ జై' అని అనేవాళ్లే దేశంలో ఉండాలని వ్యాఖ్యానించారు. అలా అనని వారు, భారత్‌ను వ్యతిరేకించేవారు, రాజ్యాంగాన్ని గౌరవించని వారు, పదేపదే దాన్ని అగౌరపరిచేవారి పట్ల తప్పకుండా ఆలోచించాల్సిన అవసరం ఉన్నదని ఆయన పేర్కొన్నారు.

## ఎంపీ హీరోయిన్.. మంత్రి డైరెక్షన్

కోల్‌కతా, ఫిబ్రవరి 26: పశ్చిమబెంగాల్ మంత్రి బ్రత్యా బసు తన బిజీ షెడ్యూల్ నుంచి కాస్త విరామం తీసుకుని ఒక సినిమాను తెరకెక్కిస్తున్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ నుస్రత్ జహాన్ ఇందులో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాకు 'డిక్షనరీ' అని పేరుపెట్టారు. మానవ సంబంధాల్లో ఏర్పడుతున్న అంతరాల గురించి ఈ సినిమాలో చర్చించనున్నట్లు బసు తెలిపారు. బుద్ధదేవ్ గుహ రచించిన రెండు లఘుకథలను ఆధారంగా చేసుకుని ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. థియేటర్ ఆర్టిస్ట్‌గా పేరుపొందిన బసు దాదాపు 30 బెంగాలీ సినిమాల్లో నటించారు. 2010లో ఆయన తారా అనే సినిమాకు దర్శకత్వం వహించారు. అనంతరం తృణమూల్‌లో చేరిన ఆయన మమత క్యాబినెట్‌లో చోటు దక్కించుకున్నారు. ఇక గతేడాదే రాజకీయాల్లోకి ప్రవేశించిన నుస్రత్ జహాన్.. తృణమూల్ కాంగ్రెస్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. బసుతో కలిసి పనిచేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నానని, ఈ సినిమాతో ఆ కోరిక నెరవేరిందని నుస్రత్ తెలిపారు. ప్రముఖ బంగ్లాదేశీ నటుడు ముషారఫ్ కరీమ్ ఈ సినిమాలో ఒక కీలక పాత్ర పోషిస్తున్నారు.

# సరోగసీ బిల్లుకు ఓకే

- విడాకులు తీసుకున్న మహిళలకు, వితంతువులకూ ఇకపై లబ్ధి
- 1,480 కోట్లతో నేషనల్ టెక్నికల్ టెక్స్‌టైల్స్ మిషన్
- కేంద్ర మంత్రివర్గం నిర్ణయాలు




న్యూఢిల్లీ: సరోగసీ (అద్దెగర్భం) నియంత్రణ బిల్లు-2020కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ పలు కీలక నిర్ణయాలను తీసుకున్నది. సమావేశం అనంతరం కేంద్రమంత్రులు ప్రకాశ్ జవదేకర్, స్మృతీ ఇరానీ మీడియాకు వివరాలు వెల్లడించారు. రాజ్యసభ సెలెక్ట్ కమిటీ చేసిన సిఫార్సులన్నింటినీ బిల్లులో పొందుపరిచినట్లు జవదేకర్ తెలిపారు. వాణిజ్యపరమైన సరోగసీని నిషేధించి, 'నిస్వార్థమైన' సరోగసీని అనుమతించాలనే లక్ష్యంతో ఈ బిల్లును తీసుకువచ్చినట్లు చెప్పారు. భారతీయ దంపతులు మాత్రమే దేశంలో సరోగసీ (అద్దెగర్భం) విధానాన్ని ఎంచుకునేలా ప్రతిపాదనలు పొందుపరిచినట్లు స్మృతీ ఇరానీ తెలిపారు. వచ్చే నెలలో ప్రారంభంకానున్న మలివిడుత బడ్జెట్ సమావేశాల్లోనే ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉన్నది. 2019 ఆగస్టులో లోక్‌సభ ఆమోదం పొందిన సరోగసీ ముసాయిదా బిల్లుకు పలు సవరణలు చేసి తాజా బిల్లు తెచ్చారు. అద్దెగర్భానికి అంగీకరించే మహిళ.. దంపతులకు సమీప బంధువై ఉండాలన్న నిబంధనతోపాటు నాటి బిల్లులోని పలు ప్రతిపాదనలపై విమర్శలు రావడంతో కేంద్రం ఆ బిల్లును రాజ్యసభ సెలెక్ట్ కమిటీకి పంపింది. బీజేపీ ఎంపీ భూపేందర్ యాదవ్ నేతృత్వంలోని కమిటీ వివిధ భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు జరిపి పలు సిఫార్సులు చేసింది. తాజా బిల్లు ప్రకారం.. అద్దెగర్భం ఇచ్చేందుకు మహిళ సమీప బంధువే కానక్కర్లేదు. అలాగే విడాకులు తీసుకున్నవారైనా, భర్తను కోల్పోయిన వారైనా సరోగసీ ద్వారా బిడ్డను కనొచ్చు. సరోగసీ నియంత్రణకు జాతీయ, రాష్ట్రస్థాయిలో సరోగసీ బోర్డులను ఏర్పాటుచేస్తారు. సరోగసీకి సిద్ధపడే మహిళకు బీమా సౌకర్యాన్ని 16 నెలల నుంచి 36 నెలలకు పొడిగించారు.

**మరికొన్ని నిర్ణయాలు..**

రూ.1,480 కోట్లతో 'నేషనల్ టెక్నికల్ టెక్స్‌టైల్స్ మిషన్' ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. చాబహార్ పోర్ట్ నిర్మాణం సాఫీగా సాగేందుకు మార్గం సుగమం చేస్తూ 'పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (డీపీఈ)' మార్గదర్శకాల నుంచి 'ఇండియా పోర్ట్స్ గ్లోబల్ లిమిటెడ్ (ఐపీజీఎల్)'కు క్యాబినెట్ మినహాయింపునిచ్చింది. ఉమ్మడి జాబితాలోని కేంద్ర చట్టాలను జమ్ముకశ్మీర్‌లోనూ అమలుచేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

# పెండ్లింట విషాదం

- 24 మంది దుర్మరణం
- వంతెనపై నుంచి నదిలో పడిన బస్సు
- రాజస్థాన్‌లోని కోటాలో దుర్ఘటన

బుండీ: పెండ్లి బృందంతో వెళ్తున్న ప్రైవేటు బస్సు అదుపుతప్పి వంతెనపై నుంచి నదిలో పడింది. రాజస్థాన్‌లోని బుండీ జిల్లాలో బుధవారం ఉదయం 9.30 గంటలకు ఈ ఘోర ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 24 మంది దుర్మరణం చెందగా ఐదుగురు గాయపడ్డారు. మరణించిన వారిలో 11 మంది మహిళలు, పది మంది పురుషులు, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ నెహ్రా తెలిపారు. పెండ్లి వేడుక కోసం 29 మందితో కూడిన ప్రైవేటు బస్సు కోటా నుంచి సవాయ్ మాధోపూర్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు చెప్పారు. లేఖరి పోలీస్ స్టేషన్ పరిధిలోని పాప్డి గ్రామ సమీపంలోని వంతెన వద్దకు బస్సు చేరిన సమయంలో డ్రైవర్ శ్యామ్‌సింగ్ నియంత్రణ కోల్పోయాడు. వంతెనకు ఎలాంటి రక్షణ గోడలు లేకపోవడంతో సుమారు 20-25 అడుగుల ఎత్తు నుంచి కిందనున్న మేజ్ నదిలోకి బస్సు దూసుకెళ్లింది. పెద్ద శబ్దం రావడంతో ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. తాళ్ల సాయంతో కొందరిని బస్సు నుంచి బయటకు వెలికి తీశారు. డ్రైవర్‌తో సహా 13 మంది ఘటనా స్థలంలోనే చనిపోయారు. క్షతగాత్రులను దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో 11 మంది మరణించారు. సీఎం అశోక్ గెహ్లాట్ బస్సు ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.



నదిలో పడిపోయిన బస్సు నుంచి ప్రయాణికులను కాపాడుతున్న స్థానికులు, సహాయక సిబ్బంది

## ఛత్తీస్‌గఢ్‌లో రెండు ఎన్‌కౌంటర్లు

ఓ జవాన్‌కు గాయాలు

చర్ల, రూరల్: ఛత్తీస్‌గఢ్‌లో రెండు చోట్ల ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) కు చెందిన ఓ జవాన్‌కు గాయాలయ్యాయి. బుధవారం నారాయణపూర్ జిల్లాలోని కట్మెరా పోలీస్ స్టేషన్ పరిధిలోని పుస్పాల్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు డీఆర్జీ, ఎస్టీఎఫ్ జవాన్లు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో మావోయిస్టులు కాల్పులకు తెగబడటంతో జవాన్లు ఎదురుకాల్పులు జరిపారు. ఈ ఘటనలో జవాన్ సంజయ్‌కి గాయాలయ్యాయి. మరో ఘటనలో కాంకేర్ జిల్లా మిచ్‌బెడా గ్రామ సమీపంలో ఎదురుకాల్పులు జరిగాయి.

# 'బాలాకోట్'కు ఏడాది

- యుద్ధవిమానాన్ని నడిపిన వైమానికదళాధిపతి

న్యూఢిల్లీ: బాలాకోట్ దాడులకు ఏడాది నిండింది. గత ఏడాది ఫిబ్రవరి 14న పుల్వామాలో ఉగ్రవాదులు దాడిచేసి 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లను పొట్టనబెట్టుకున్న సంగతి తెలిసిందే. దీనికి ప్రతిగా ఫిబ్రవరి 26న భారత వైమానిక దళానికి (ఐఏఎఫ్) చెందిన యుద్ధ విమానాలు సరిహద్దు దాటి బాలాకోట్‌లోని జైషే మహ్మద్ ఉగ్రవాద శిబిరంపై బాంబులు కురిపించాయి. ఈ ఘటనకు ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం దేశవ్యాప్తంగా సంబురాలు చేసుకున్నారు. 'దేశం ఈరోజు బాలాకోట్ దాడుల మొదటి వార్షికోత్సవ సంబురాలు చేసుకుంటున్నది. ఇది ఉగ్రవాదంపై ఐఏఎఫ్ విజయానికి గుర్తు' అని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ట్వీట్ చేశారు. మరోవైపు ఐఏఎఫ్ చీఫ్ ఆర్కేఎస్ బధౌరియా శ్రీనగర్ ఎయిర్‌బేస్‌లో మిగ్-21 యుద్ధ విమానాన్ని నడిపారు.



యుద్ధ విమానంలో బధౌరియా

### రహస్య కమాండ్.. బందర్

బాలాకోట్ దాడి విజయవంతమైందని చెప్పడానికి సైనికాధికారులు 'బందర్' (కోతి) అనే రహస్య కమాండ్‌ను వినియోగించినట్టు ఐఏఎఫ్ మాజీ కమాండర్ హరికుమార్ తెలిపారు. దాడులు విజయవంతం అయితే తనకు ఈ కోడ్ చెప్పాలని నాటి వైమానికదళాధిపతి బీఎస్ ధనోవా సూచించారని, ఈ మేరకు 26న ఉదయం 3:35 గంటలకు ఫోన్ చేసి 'బందర్' అని చెప్పానన్నారు.

## హమ్మయ్య.. తిరిగొస్తున్నాం

టోక్యో: కరోనా కలకలం నేపథ్యంలో జపాన్‌కు చెందిన 'డైమండ్‌ప్రిన్స్' నౌకలో కొన్ని రోజులపాటు చిక్కుకున్న భారతీయ సిబ్బంది, ప్రయాణికుల్లో కొందరికి ఊరట లభించింది. ఫిబ్రవరి 3 నుంచి యోకోహోమా పోర్టులో నిలిపివేసిన ఈ నౌకలోని 3711 మందిలో 138 మంది భారతీయులున్నారు. అయితే వైరస్ సోకని వారిని ఇటీవల నౌక నుంచి బయటకు తరలించారు. వీరిలోని భారతీయులు బుధవారం ఎయిర్ ఇండియా విమానం ఎక్కారు. కాగా 15 టన్నుల వైద్య సామగ్రితో కూడిన భారతీయ వాయుసేన విమానం కరోనా వ్యాప్తికి మూలమైన చైనాలోని వుహాన్‌కు మంగళవారం చేరుకుంది.



విమానంలో తిరిగి వస్తున్న భారతీయులు

## జైలుకు ఆజంఖాన్ కుటుంబం



లక్నో: నకిలీ జనన ధ్రువీకరణ పత్రం కేసులో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఆజంఖాన్, ఆయన భార్యతజీన్ ఫాత్మ, కుమారుడు, ఎమ్మెల్యే అబ్దుల్లా ఆజంకు కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. స్వార్ నుంచి గెలుపొందిన అబ్దుల్లా రెండు జనన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉన్నాడని, 2017లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తప్పుడు ధ్రువ పత్రాన్ని సమర్పించాడని పేర్కొంటూ బీజేపీ నేత ఆకాశ్ సక్సెనా 2019లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అబ్దుల్లా రెండో నకిలీ జనన ధ్రువీకరణ పత్రం పొందేందుకు అఫిడవిట్‌లో సంతకాలు చేసినందుకు ఆజంఖాన్, తజీన్‌పైనా కేసు నమోదు చేశారు.

## ఇక ట్రాక్‌పై కంబళ పరుగులరాయుడి సత్తా!

మంగళూరు: ఉసేన్ బోల్ట్‌ను తలపించిన కంబళ వీరుడు శ్రీనివాస్ గౌడ ఇక ట్రాక్‌పై తన సత్తా చూపనున్నారు. క్రీడల్లో శిక్షణ తీసుకునేందుకు ఆయన అంగీకరించారు. కర్ణాటకలోని మూడ్‌బిద్రిలో నిర్మాణ కార్మికుడైన శ్రీనివాస గౌడ, ఇటీవల మంగళూరు సమీప గ్రామంలో జరిగిన సంప్రదాయ కంబళ పోటీల్లో 100 మీటర్ల దూరాన్ని 9.55 సెకండ్లలో చేరి అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ నేపథ్యంలో అతడికి శిక్షణ ఇస్తే ఒలింపిక్స్‌లో రాణిస్తాడంటూ పలువురు అభిప్రాయపడ్డారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఏఐ)లో శిక్షణ పొందాలంటూ కేంద్ర క్రీడల మంత్రి కిరణ్ రిజిజు ఆయనను ఆహ్వానించారు. అయితే శ్రీనివాస్ తొలుత ఆసక్తి చూపలేదు. ఎస్ఏఐ దక్షిణ భారత డైరెక్టర్ అజయ్ కుమార్ బెహ్లా నేతృతంలోని అధికారులు ఆయనను ఒప్పించారు.

## పరారీలో ఉన్న నిందితుడిగా నవాజ్ షరీఫ్

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 26: వైద్య నివేదికలు సమర్పించకుండా బెయిల్ నిబంధనలను ఉల్లంఘించిన కారణంగా పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్‌ను ఆ దేశ ప్రభుత్వం 'పరారీలో ఉన్న నిందితుడిగా' ప్రకటించింది. అలాగే షరీఫ్‌కు బెయిల్‌ను పొడిగించకూడదని నిర్ణయించింది. బుధవారం ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ అధ్యక్షతన సమావేశమైన ఫెడరల్ క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. మెరుగైన వైద్యం కోసం విదేశాలకు వెళ్లేందుకు అనుమతిస్తూ లాహోర్ కోర్టు నాలుగు వారాలు బెయిల్ మంజూరు చేయడంతో గత నవంబర్‌లో షరీఫ్ లండన్‌కు వెళ్లారు. పలుమార్లు లేఖలు రాసినప్పటికీ ఆయన వైద్య నివేదికలు సమర్పించకుండా కేవలం సర్టిఫికెట్ మాత్రమే పంపారని, దీన్ని మెడికల్ బోర్డు తిరస్కరించిందని ప్రధాని కార్యాలయం తెలిపింది.

## పదవీవిరమణ పొందిన ఆరేండ్ల తర్వాత పదోన్నతి

అహ్మదాబాద్, ఫిబ్రవరి 26: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సొహ్రాబుద్దీన్ షేక్, ఇష్రాత్ జహాన్ బూటకపు ఎన్‌కౌంటర్ల కేసులో నిందితుడైన (తర్వాత కోర్టులు నిర్దోషిగా ప్రకటించాయి) గుజరాత్ మాజీ డీఐజీ వంజరకు ఆ రాష్ట్ర ప్రభుత్వం ఐజీపీగా పదోన్నతి కల్పించింది. ఆయన 2014లోనే పదవీ విరమణ పొందారు. అయితే ఆయనకు 2007 నుంచి ఐజీపీగా పదోన్నతి కల్పిస్తున్నట్లు పేర్కొంటూ ఇప్పుడు ఉత్తర్వులు జారీ చేసింది. అంటే పదవీవిరమణ పొందిన ఆరేండ్ల తర్వాత ఇప్పుడు పదోన్నతి కల్పించడం విశేషం. తాజా ఉత్తర్వుల ప్రకారం ఆయనకు 2007 నుంచి ఐజీపీ హోదాలో లభించే ప్రయోజనాలన్నీ సమకూరుతాయి. 1987 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన వంజరను సొహ్రాబుద్దీన్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో 2007లో పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేసింది. తర్వాత ఆయన నిర్దోషిగా బయటపడ్డారు.

## యువరాజు హోదాను వదులుకున్న హ్యారీ



లండన్: బ్రిటన్ యువరాజు హ్యారీ తనను ఇక నుంచి ప్రిన్స్ హ్యారీ అనికాకుండా కేవలం హ్యారీ అని పిలువాలని కోరారు. తన చివరి రాచరిక విధులను నిర్వర్తించడంలో భాగంగా ఎడిన్‌బర్గ్‌లో జరుగుతున్న ట్రావెలిస్ట్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు ఆయన బ్రిటన్‌కు వచ్చారు. రాచరిక బంధనాలను తెంచుకుని, ఆర్థికంగా స్వతంత్రంగా జీవించాలని హ్యారీ, మేఘన్ మార్కెల్ దంపతులు నిర్ణయించిన సంగతి తెలిసిందే. మార్చి చివరినాటికి వారు అధికారికంగా హోదాలను వదులుకోనున్నారు. అప్పటివరకు ఆ హోదా ఉన్నా తనను పేరుతో మాత్రమే పిలువాలని హ్యారీ చెప్పినట్టు కాన్ఫరెన్స్ నిర్వాహకులు తెలిపారు.



డేవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్ రాకతో ఆస్ట్రేలియా జట్టు పటిష్ఠంగా తయారైంది. ఈ యేడాది చివర్లో ఆసీస్‌తో జరిగే నాలుగు టెస్టుల సిరీస్‌లో భారత్ ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశమున్నది. సొంతగడ్డపై కంగారూలను నిలువరించాలంటే భారత్ శక్తికి మించి పోరాడాలి. రెండు మేటి జట్ల మధ్య పోటీ రసవత్తరంగా సాగే అవకాశం ఉన్నది.

**మెక్‌గ్రాత్, ఆస్ట్రేలియా క్రికెటర్**

ప్రత్యర్థులకు దీటైన పోటీనివ్వాలంటే నా టెక్నిక్‌పై మరింత దృష్టిపెట్టాలి. దీనికితోడు మానసికంగా బలంగా ఉండాలనుకుంటున్నా. లక్ష్యంపై గురిపెట్టినప్పుడు మనసు ప్రశాంతంగా ఉన్నప్పుడే అది సాధ్యమవుతుంది. ఆలోచనలు అదుపులో ఉంచుకోవడానికి మెడిటేషన్ బాగా ఉపయోగపడుతుంది. దీనిద్వారా మనం అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చు.

**మను భాకర్, యువ షూటర్**



**చరిత్రలో నేడు**



**1956**
మహిళలకు ఓటుహక్కు కల్పించిన ఈజిప్ట్ ప్రభుత్వం.

**1969**
సిరియాలో సైనిక తిరుగుబాటు. అధ్యక్షుడిగా హఫీజ్ అల్ అస్సాద్.





**2013**
కలకత్తా మార్కెట్‌లో అగ్ని ప్రమాదం. 20 మంది సజీవ దహనం.

కరోనా వైరస్ చైనాలో ఇంకా ఏ మాత్రం తగ్గుముఖం పట్టకపోగా, దక్షిణకొరియా, పశ్చిమాసియా, యూరప్‌లకు విస్తరించింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలు అనేక ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాయి. కానీ నేపాల్‌లోని ఏకైక అంతర్జాతీయ విమానాశ్రయంలో మాత్రం అలసత్వం కనిపిస్తున్నది. సింగపూర్ నుంచి వచ్చిన వ్యక్తిని, భారత్ నుంచి వచ్చిన విదేశీయులను కనీసం శరీర ఉష్ణోగ్రత పరిశీలించకుండా అనుమతిచ్చారు. కరోనా వైరస్ సోకిన లక్షణాలు కనిపించిన ఒక సౌదీ జాతీయుడు ఆస్పత్రి నుంచి మాయమయ్యాడు.

**ది హిమాలయన్ టైమ్స్**

కరోనా వైరస్ ప్రమాదం ఆస్ట్రేలియా సమీపానికి వచ్చింది. కరోనా వైరస్ ఎంత ప్రమాదకరం, ఏ విధంగా ఎదుర్కోవాలనే విషయమై ప్రజలకు కచ్చితమైన సమాచారాన్ని అందించడం ద్వారానే ఈ ముప్పు నుంచి బయటపడగలం. ఆస్ట్రేలియా ప్రభుత్వం ఇప్పటివరకు చేపట్టిన చర్యలన్నీ సత్ఫలితాలను ఇచ్చాయి. పొదల మంటలను ఏ విధంగా ఎదుర్కొన్నామనేది మనకు అనుభవాన్నిచ్చింది. అగ్నిమాపక దళం, రాజకీయ నాయకులు కనబరిచిన చిత్తశుద్ధి వల్ల అనేక మంది ప్రాణాలు నిలబడ్డాయి.

**ది సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్**



# ఈ పాపం ఎవరిది?

రాజధాని ఢిల్లీలోని ఈశాన్య ప్రాంతంలో మూడురోజుల పాటు పెచ్చరిల్లిన హింసావిధ్వంసాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ విద్వేషదాడుల్లో ఇరువై మందికి పైగా మరణించగా, దాదాపు మూడు వందల మంది గాయపడ్డారు. గూఢచార విభాగం యువ అధికారి ఒకరు కూడా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. సాధారణంగా ఘర్షణలు లేదా దాడులు సాగినప్పుడు చేతికందిన కర్రలు, కత్తులు వినియోగిస్తారు. కానీ ఈ దాడుల్లో అనేకమందికి బుల్లెట్ గాయాలు కావడం దిగ్భ్రాంతికరం. మరణించిన వారిలో దాదాపు పది మందికి బుల్లెట్ గాయాలున్నాయి. దీనిని బట్టి మారణాయుధాలు సంఘ విద్రోహశక్తుల దగ్గర ఏమేర చేరాయో అర్థం చేసుకోవచ్చు. కొంతమందిపై యాసిడ్ దాడులు జరిగాయి. దుండగులు పోలీసులపైనే పెట్రోలు బాంబులు విసిరారు. ఇనుప చువ్వలు, కర్రలు చేతబూని, హెల్మెట్లు పెట్టుకొని, గుంపులుగా వచ్చి సాగించిన దాడులను గమనిస్తే, ఇవి అనుకోకుండా పెల్లుబికినవి కావని, పథకం ప్రకారం సాగిన దాడులని అర్థమవుతున్నది. పారా మిలిటరీ, రాపిడ్ యాక్షన్ ఫోర్స్, సీఆర్‌పీఎఫ్ దళాలను రంగంలోకి దింపి, కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు జారీ చేస్తే కానీ పరిస్థితి అదుపులోకి రాలేదు. రాజధాని ఢిల్లీలోనే, అధికారపీఠాలకు సమీపంలో ఇంత హింస, విధ్వంసం చెలరేగడాన్ని తీవ్రంగా పరిగణించాలి. నిప్పు రాజేసింది ఎవరైనా కావచ్చు. అవకాశం దొరికితే హత్యలు, విధ్వంసాలు సాగించడానికి సంఘ విద్రోహశక్తులు కాచుకొని ఉంటాయి. అందుకే పరిస్థితి అదుపు తప్పకుండా శాంతి భద్రతలను, సామరస్య జీవనాన్ని కాపాడటం తమ బాధ్యతగా అన్నివర్గాలూ గుర్తించాలి.

దేశంలో పాదుకొని ఉన్న ప్రజాస్వామిక, రాజ్యాంగవ్యవస్థలకు ఇటువంటి ఘటనలు పరీక్ష వంటివి. శాసనసభ్యులు, పరిపాలన యం త్రాంగం, న్యాయస్థానం, రాజకీయపక్షాలు మొదలైన వ్యవస్థలన్నీ చట్టబద్ధపాలనను, ప్రజల హక్కులను, సామరస్య జీవనాన్ని పరిరక్షించడంలో క్రియాశీలంగా వ్యవహరించాలి. ఒక వ్యవస్థ విఫలమైనా ఇతర వ్యవస్థలు అప్రమత్తం కావాలి. ఢిల్లీలో హింసాకాండ సందర్భంగా హైకోర్టు వ్యవహరించిన తీరు ప్రశంసనీయమైనది. ఈ అల్లర్ల సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై తీవ్ర విమర్శలు వచ్చిన నేపథ్యంలో, న్యాయస్థానం తీవ్రంగా స్పందించి ప్రజలను రెచ్చగొట్టిన నాయకులపై చర్య తీసుకోవాలని ఆదేశాలు జారీచేసింది. పౌరసత్వ సవరణ చట్టంపై వ్యతిరేక ప్రదర్శనలకు ఢిల్లీ కేంద్ర బిందువైంది. ఢిల్లీ శాసనసభ ఎన్నికల సందర్భంగా రాజకీయ నాయకులు ఈ వివాదాన్ని ఉపయోగించుకోవడానికి యత్నించారు. దానికి కొనసాగింపుగానే తాజా విద్వేషదాడులు, విధ్వంసాలు చోటు చేసుకున్నాయనే అభిప్రాయం కూడా ఉన్నది. అందువల్లే ఈ మొత్తం ఉదంతంలో రెచ్చగొట్టేవిధంగా వ్యవహరించిన నలుగురు బీజేపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని న్యాయస్థానం ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. కపిల్‌మిశ్రాతో పాటు అనురాగ్ ఠాకూర్, పర్వేశ్ వర్మ, అభయ్ వర్మపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హైకోర్టు సూచించింది. విధ్వంసాలకు పాల్పడిన వారందరిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించింది. వీరు విద్వేష ప్రసంగాలు చేసిన దృశ్యాలు టీవీ చానెల్స్‌లో ప్రసారమయ్యాయి. కపిల్ మిశ్రా ముందుండి విద్వేషదాడులు సాగిస్తుంటే, పోలీసులు చూసీచూడనట్టు వ్యవహరించారనే ఆరోపణ ఉన్నది. అభయ్ వర్మ 'గోలీ మారో...' అంటూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారనే ఆరోపణ ఉన్నది.

> **ఏదైనా వివాదాంశంపై భిన్నాభిప్రాయాలు ఉండటం సాధారణం. నిరసన ప్రదర్శనలు కూడా సాగుతుంటాయి. పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం గల రాజకీయ పక్షాలు ముందుకువచ్చి, భయాందోళనలతో ఉన్న వర్గాలకు భరోసా ఇవ్వాలి. పార్లమెంటరీ పద్ధతిలో పరిష్కారం లభిస్తుందనే నమ్మకం కలిగించాలి. ఆందోళనకారుల తరపున బాధ్యత తీసుకొని చర్చలు సాగించాలి. కానీ జాతీయపక్షమైన కాంగ్రెస్, స్థానికంగా బలంగా ఉన్న ఆప్ వ్యవహరించిన తీరు సంతృప్తికరంగా లేదు.**

ఢిల్లీ అల్లర్ల తీరును పరిశీలిస్తే రాజకీయవ్యవస్థ బాధ్యతారాహిత్యం స్పష్టంగా కనబడుతున్నది. ఢిల్లీ హైకోర్టు చర్యలకు ఆదేశించిన నలుగురు నాయకులు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి చెందినవారు. కపిల్ మిశ్రా గతంలో బీజేపీ ఎమ్మెల్యే, ఇప్పటికీ ఢిల్లీలో ప్రముఖ నాయకుడు. పర్వేశ్ వర్మ లోక్‌సభసభ్యుడు. అభయ్ వర్మ పార్టీ తరపున శాసనసభ్యుడి గా ఎన్నికయ్యారు. ఇక అనురాగ్‌ఠాకూర్ కేంద్ర మంత్రి. హిమాచల్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ప్రేమ్‌కుమార్ ధుమాల్ కుమారుడు. రాజకీయ కుటుంబం నుంచి ఎదిగివచ్చారు. ఎన్నికల ప్రచార సభల్లో, పార్లమెంటులో వాజపేయి ప్రసంగాలు విన్నవారికి వీరి ప్రవర్తన ఆశ్చర్యం కలిగిస్తుంది. ఒక బీజేపీ మాత్రమే కాదు, మిగతా రాజకీయపక్షాల నాయకత్వాలు కూడా పౌరసత్వ సవరణ చట్టంపై ఆందోళన విషయంలో ఆశించిన రీతిలో వ్యవహరించాయా అనేది ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఏదైనా వివాదాంశంపై భిన్నాభిప్రాయాలు ఉండటం సాధారణం. నిరసన ప్రదర్శనలు కూడా సాగుతుంటాయి. పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం గల రాజకీయ పక్షాలు ముందుకువచ్చి, భయాందోళనలతో ఉన్న వర్గాలకు భరోసా ఇవ్వాలి. పార్లమెంటరీ పద్ధతిలో పరిష్కారం లభిస్తుందనే నమ్మకం కలిగించాలి. ఆందోళనకారుల తరపున బాధ్యత తీసుకొని చర్చలు సాగించాలి. కానీ జాతీయపక్షమైన కాంగ్రెస్, స్థానికంగా బలంగా ఉన్న ఆప్ వ్యవహరించిన తీరు సంతృప్తికరంగా లేదు. రాజకీయపక్షాలు, శాంతిభద్రతల యంత్రాంగం విశ్వసనీయత కోల్పోయేరీతిలో వ్యవహరించడం దేశానికి, సమాజానికి ఎంత నష్టదాయకం!

## జనగళం

### అల్లర్లను అదుపు చేయాలి

గత మూడు రోజులుగా సీఏఏ వ్యతిరేక, అనుకూల నినాదాలతో దేశ రాజధాని ఢిల్లీ నగరం అట్టుడికిపోతున్నది. అల్లరి మూకలు చేస్తున్న దాడుల్లో ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతూనే ఉన్నది. ఢిల్లీ బీజేపీ నేతలు చేసిన విద్వేష ప్రకటనలే అలర్లకు కారణమని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తూనే ఉన్నాయి. ఏదేమైనా ఇలా దేశ రాజధానిలో ఘర్షణలు జరుగడం మంచిది కాదు. కాబట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా కలిసి ఈ అల్లర్లను అదుపు చేయాలి.

**- పంబ శివశంకర్, బల్మూర్ కొండారెడ్డిపల్లి, నాగర్‌కర్నూల్**

### ప్రజల భాగస్వామ్యం ఉండాలి

రాష్ట్రంలోని మున్సిపాలిటీలు స్వచ్ఛంగా ఉండాలంటే ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలే కాదు ప్రజల భాగస్వామ్యం కూడా కావాలి. ప్రభుత్వం చేపట్టిన పల్లెప్రగతి కార్యక్రమం ద్వారా చాలా గ్రామాల్లో మార్పు వచ్చింది. అట్లనే ప్రస్తుతం పట్టణ ప్రగతి కార్యక్రమం జరుగుతున్నది. ప్రజలు తమ మున్సిపాలిటీలు సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి. అప్పుడే పట్టణాల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు విజయవంతమవుతాయి.

**- బేగరి ప్రవీణ్‌కుమార్, చేవెళ్ల, అంతారం, రంగారెడ్డి జిల్లా**

### ఒత్తిడిని జయించాలి

పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు దగ్గర పడుతున్నాయి. పరీక్షలకు విద్యార్థులు ఎలా సన్నద్ధమవ్వాలో మెళకువలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా, ఆందోళన చెందకుండా పరీక్షలను విజయవంతంగా ఎదుర్కొనేలా తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు సలహా సూచనలు ఇవ్వాలి. కొందరు విద్యార్థులు మామూలు పరీక్షల్లో ఉత్తీర్ణత చెంది, తీరా వార్షిక పరీక్షలు వచ్చేసరికి భయపడుతుంటారు. సరిగ్గా భోజనం చేయకుండా, నిద్రపోకుండా ఎప్పుడూ పరీక్షల గురించే ఆలోచిస్తూ ఉంటారు. ఇలాంటి విద్యార్థులు ఫైనల్ పరీక్షల్లో తక్కువ మార్కులు పొందడమో, లేదా ఫెయిలవుతుంటారు. ఇలాంటి విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధకనబర్చాలి. ఒత్తిడిని జయించేలా మార్గనిర్దేశనం చేయాలి.

**- మొగుళ్ల సునీల్, బేగంపేట్, హైదరాబాద్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

ఆలోకన

# ఆర్య-ద్రవిడ యుద్ధమూ తెస్తారా?



**టంకశాల అశోక్**

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఇటీవల భైంసాను సందర్శించినప్పుడు రాష్ట్ర బీజేపీ ఎంపీ ఒకరు అక్కడ జరుగుతున్నది శివాజీ-ఔరంగజేబ్‌ల యుద్ధమన్నారు. ఇంత బాధ్యతారహితంగా మాట్లాడేవారు కొన్ని ఆలోచిస్తున్నట్లు లేరు. బీజేపీ దక్షిణాదికి వ్యాపించే ప్రయత్నాలను కొందరు ద్రవిడ భూమిపై ఆర్యుల దండయాత్రగా వ్యాఖ్యానిస్తున్నారు. ఒక వర్గం ఔరంగజేబు అంటూ మరొకవర్గం ఆర్యులంటూ చరిత్ర పొరలను తవ్వుతూపోతే దేశ ఐక్యత పటిష్ఠమవుతుందా లేక విచ్ఛిన్నమవుతుందా? అందరూ చేయవలసింది జాతి నిర్మాణమా లేక దేశ విచ్ఛిత్తికి దారులు వేయటమా?**

ఏ పార్టీకైనా, వర్గాలకైనా తమ సిద్ధాంతాలు, రాజకీయ ప్రయోజనాలు తమకుండవచ్చు. అందుకోసం ఎవరి ప్రయత్నాలు వారు చేయవచ్చు. కానీ అందుకు కొన్ని పరిమితులను పాటించకుండా యథేచ్ఛగా వ్యవహరించినట్లయితే అనుకోని ప్రమాదాలు ఎదురవుతాయి. బీజేపీ ఎంపీ ప్రస్తావించిన శివాజీ-ఔరంగజేబుల విషయం ముందుగా చూద్దాం. ఆ ఘటనలన్నీ వాస్తవాలు. మన చరిత్రలో ఒక భాగం. ఒక దేశపు వందలు, వేల ఏండ్ల చరిత్రలో ఇటువంటి పొరలు అనేకం ఉంటాయి. ఆ విధమైన పొరల్లో ఆర్యుల దండయాత్ర (లేదా వలసలు) పొర కూడా ఒకటి. మొదటిది వందల ఏండ్ల కిందటిది అయితే రెండవది వేల ఏండ్ల కిందటిది. ఇటువంటివి ఇంకా అనేక పొరలు ఇటీవలి బ్రిటిష్ ఆక్రమణ వరకు భారతదేశ సుదీర్ఘ చరిత్రలో కలగలిసి భాగమైపోయాయి. 1947తో ఒక సరికొత్త భారతదేశం ఆవిష్కారమైంది. ఒక ఆధునికమైన, ప్రజాస్వామికమైన దేశ నిర్మాణానికి యావత్ ప్రపంచంలోనే ఎక్కడాలేని ఇంతటి మహా వైవిధ్య భూమిలో ఒక ఐక్యజాతి నిర్మాణానికి 1947లో నాంది జరిగింది.

దేశ చరిత్ర ఈ విధంగా గతంలో ఎన్నడూ లేని ఒక కొత్త మలుపు తిరిగిన తర్వాత ఇక శివాజీ-ఔరంగజేబులు, ఆర్యులు, బ్రిటిష్ వలసపాలన వంటి పొరలకు గడిచిపోయిన చారిత్రక విలువ తప్ప సజీవమైన విలువ ఎంతమాత్రం ఉండదు. చారిత్రక విలువ అంటే అర్థం గతం నుంచి పాఠాలను నేర్చుకొని వర్తమానానికి పాజిటివ్ పద్ధతిలో అన్వయించుకోవటం. ఇక్కడ సజీవ విలువ అంటే లేదా సజీవ సంబంధం అంటే అర్థం గతాన్ని నెగెటివ్‌గా కెలుకుతూ వర్తమాన స్వార్థ ప్రయోజనాలను నెరవేర్చుకొనజూడటం. ఈ నెగెటివిజం ఆ పనిచేసే శక్తులకు ఎంత ఉపయోగపడేదీ తెలియదు గాని, ఆధునిక-ప్రజాస్వామిక దేశానికి, ఐక్యజాతి నిర్మాణానికి మాత్రం దోహదం చేయకపోగా హాని కలిగిస్తుంది. ఏ దేశ చరిత్రలోనైనా ఇటువంటి ప్రశ్నలు సుప్తభుజంగాలు. వాటిని కదిలిస్తే కాటు వేయగలవు. ఆయా విషయాలను అకడమిక్‌గా అధ్యయనం చేయటం వేరు, రాజకీయంగా ఉపయోగించుకొనచూడటం వేరు. అయితే ఒకటి చెప్పుకోవాలి. ఆర్య జాతి భావన ఆధిపత్య భావన కాగా, ద్రవిడ భావన అటువంటి ఆధిపత్య భావనపై ప్రతిఘటనగా, తమ అస్తిత్వంతో ఆత్మగౌరవంతో ముడిపడినదిగా వ్యక్తమవుతుంటుంది. వర్తమాన స్థితిలో తమ ఫెడరల్ హక్కులతో సంబంధం గలదిగా ప్రదర్శితమవుతుంటుంది. ఆ పరిమితులకు మించి తొలిదశ ద్రవిడ ఉద్యమం వలె స్వతంత్ర ద్రవిడనాడును కోరటం మాత్రం చరిత్ర పొరలను హానికరమైన రీతిలో తవ్వచూడటం అవుతుంది.

దక్షిణాదిన కొన్ని ప్రాంతాల్లో, తూర్పున కూడా ఆర్య-ద్రవిడ వైరుధ్యం ఒక భావజాలంగా నేటికీ ఉన్నమాట నిజం. భాష, సంస్కృతి, రాజకీయ ఆధిపత్యాల విషయాల్లో ఈ భావజాలం స్వాతంత్ర్యం తర్వాత కూడా ఏదో ఒక స్థాయిలో కొనసాగుతూ వస్తున్నదని తెలిసిందే. కేంద్రంలో బీజేపీ అధికారానికి వచ్చిన తర్వాత ఇది మరింత పెరిగింది. బీజేపీ ఆర్యశక్తుల ప్రతినిధి అని, భారతదేశాన్ని తమ వశం చేసుకునేందుకు క్రీస్తు పూర్వకాలం నుంచి ఈ శక్తులు సాగిస్తూ వస్తున్న ప్రయత్నాలలో భాగమే దక్షిణాదివైపు బీజేపీ విస్తరణ అని నమ్మి వాదించేవారు చాలామందే ఉన్నారు. ఈ నమ్మకాలను బలపరిచేందుకా అన్నట్లు రెండవ వైపు ఏమి జరుగుతున్నది? ఉదాహరణకు తమిళనాడులో జయలలిత ముఖ్యమంత్రి కావటాన్ని ద్రవిడ భావనల పరాజయంగా, ఆమె మరణాన్ని ద్రవిడశక్తుల విజయంగా సంఘ్‌పరివార్ సానుభూతిపరులు బాహాటంగా వ్యాఖ్యానించారు. కొత్తగా రజనీకాంత్ రాక తిరిగి తమకు ఆశాకిరణమని పరివార్ సానుభూతిపరులంటున్నారు. ప్రస్తుతం డీఎంకేకు, బీజేపీకి మధ్య రగులుతున్న వైరానికి ద్రవిడ-ఆర్య వైరుధ్యం ఒక కారణమనే భావన ఉన్నది. ఇటీవలికాలంలో పరివారీయులు రామస్వామి నాయకర్‌తో సహా కొందరు ద్రవిడ హీరోలపై వ్యాఖ్యలు చేయటం, వారి విగ్రహాలను మలినపరుచటం తెలిసిందే. హిందీ-ద్రవిడ భాషల నిరంతర వైరుధ్యం ఈ స్థితికి మరొక ఉదాహరణ.

ఇటువంటి ద్రవిడ భాషా-సంస్కృతీపరమైన ఉదంతాలే కర్ణాటక, కేరళలోనూ తరచూ జరుగుతున్నాయి. వాటినన్నింటిని ఇక్కడ పేర్కొనవలసిన అవసరం లేదు గాని రెండు విషయాలు చెప్పుకోవాలి. రెండేండ్ల కిందట పార్లమెంటులో వామనుడు-బలిచక్రవర్తి ప్రస్తావన రాగా, వెంటనే కేరళలో వామనుడు ఆర్యులకు ప్రతినిధి అని, స్థానిక ద్రవిడుడు అయిన బలిచక్రవర్తిని అణిచివేశాడని పెద్ద ఎత్తున చర్చ జరిగింది. తమ ఆదివాసీ రాజైన హిరణ్యకశిపుడిని ఆర్యులు అణిచివేశారని బెంగాల్, బీహార్, ఒడిషా, ఝార్ఖండ్ సంతాల్ జాతులు వాదించాయి. వారు హిరణ్యకశిపుడిని ఇప్పటికీ తమ ప్రాచీన రాజుగా కొలుస్తున్నారు. ఇదొకటి కాగా, ఆర్‌ఎస్‌ఎస్ అధికార పత్రిక 'పాంచజన్య' సంపాదకునిగా ఉండిన తరుణ్ విజయ్, మనలో జాతి వివక్ష ఉన్నట్లయితే నల్లవారైన దక్షిణ భారతీయులతో ఎట్లా సహజీవనం చేస్తున్నామంటూ కొంతకాలం కిందట బహిరంగంగా వ్యాఖ్యానించారు. ఇందులో మనం అంటే తెల్లవాళ్లం, ఆర్యులమని, దక్షిణాత్యులు నల్లవారంటే ద్రావిడులనే అర్థాన్ని వెంటనే అందరూ చెప్పుకున్నారు. దానిపై వివాదమైంది. తాజాగా మోదీ ప్రభుత్వం పౌరసత్వ చట్టం నుంచి శ్రీలంక తమిళులను మినహాయించటం ఎందుకని ఈ ద్రవిడ భావజాలవాదులు ప్రశ్నిస్తున్నారు. కొన్నేండ్ల కిందట ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన కొందరు అకడమీషియన్లు ఆర్య-ద్రవిడ అంశంపై చర్చ జరిపారు.

చరిత్ర గుర్తుండటం సహజం. గుర్తుండాలి కూడా. కాని పైన అనుకున్నట్లు చరిత్రలో అనేక పొరలుంటాయి. మంచిచెడులు గాని, వైరుధ్యాలు గాని ఆ పొరలలో నిక్షిప్తమవుతాయి. ఆ పొరలలో, అనుభవాలలో గల మంచిని మానవ సమాజం ఒకతరం నుంచి మరొక తరానికి వారసత్వంగా ఇచ్చుకుంటూ పోతుంది. చెడు క్రమంగా వెనుకబడుతుంది. అట్లాగే జరుగాలి కూడా. అదే మానవ సమాజపు విజ్ఞత, వికాసశీలత. ఆ క్రమంలో భారతీయులకు ఒక మహత్తరమైన మలుపు, అవకాశం 1947లో లభించింది. అంతవరకు వేల ఏండ్ల కాలంలో సంస్కృతి పరంగా ఒక భావనరూపంలో తప్ప రాజకీయంగా, భౌగోళికంగా ఒక స్థిరమైన భారతదేశం అంటూ లేదు. అశోక చక్రవర్తి, మొఘల్ చక్రవర్తులు ఇంచుమించు ఉపఖండాన్ని అంతా పాలించనైతే పాలించారు గాని ఫ్యూడల్ రాచరికాలు ఎప్పుడైనా తాత్కాలిక ప్రాతిపదికగలవే తప్ప ఆధునిక దేశాల వలె సుస్థిర ప్రాతిపదికలు గలవి కావు. జాతి ఐక్యతలు లేక, చరిత్రలో అనేక పొరలుగల సమాజాలకు దేశ స్వాతంత్ర్యాలు ఒక సరికొత్త మలుపు అయ్యాయి. రకరకాల అస్థిరతల నుంచి జాతి నిర్మాణం అన్నది వారి అజెండాపైకి కొత్తగా వచ్చి చేరింది. జాతి భావన వేరు, జాతీయతా భావన వేరు. జాతీయత అన్నది ప్రకోపించి కొమ్ములు మొలిచి ఫాసిజం, నాజీయిజంగా మారి ఒకే దేశంలోని ఇతర వర్గాలను నిర్మూలించబూనింది. ఇదంతా భారత స్వాతంత్ర్యోద్యమకాలంలోనే నాయకులు స్పష్టంగా అర్థం చేసుకున్న విషయం. అందుకే వారంతా దేశ భౌగోళిక ఐక్యత, రాజకీయ ఐక్యత, జాతి భావనల ఐక్యత, అభివృద్ధి ద్వారా ఐక్యత అనే లక్ష్యాల కోసం తమ కృషిని ఆరంభించారు. జాతి నిర్మాణం అన్నది 1940లు, 1950లు, 1960లలో ఇండియాలోనే గాక ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా మాజీ వలసదేశాల్లో సాగిన ఒక పెద్ద చర్చ. భారతదేశంలో జాతి నిర్మాణం మొదలైనా నేటికీ ఇంకా పూర్తికాలేదన్నది పలువురి అభిప్రాయం. ఢిల్లీలో జరుగుతున్న తాజా హింసపై రాష్ట్ర మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానిస్తూ ఇది 'ఒక జాతిగా మనమెంత సున్నితమైన స్థితిలో ఉన్నామో గుర్తుచేసే బాధాకర పరిణామం' అన్న మాట కూడా భారత జాతి నిర్మాణంలోని సంక్లిష్టతను, నాయకత్వం బాధ్యతాయుతంగా, జాగ్రత్తగా వ్యవహరించవలసిన అవసరాన్ని సూచిస్తున్నది.

> **భారతదేశ చరిత్ర పొరలలోని ఒకానొక పొరలో గల శివాజీ-ఔరంగజేబు అంశాన్ని బీజేపీ తన ప్రయోజనాల కోసం తవ్వి తీయదలచుకుంటే, మరొకరు అంతకన్న వెనుకటి పొరల్లోకి వెళ్లి ఆర్య-ద్రవిడ అంశాన్ని ముందుకుతేవటంలో ఆశ్చర్యపడదగింది ఉండదు. ఆర్యులు బయటివారన్న అనేకానేకుల్లో సాక్షాత్తూ బాలగంగాధర్ తిలక్ ఉన్నారు. ఇటీవలి సంవత్సరాల శాస్త్రీయమైన డీఎన్ఏ పరీక్షలు కూడా దాన్ని ధృవీకరించాయి. కానీ పైన అనుకున్నట్లు భారతీయ సమాజం ఈ దశలనన్నీ గడిచిపోయి ఆధునిక, ప్రజాస్వామిక జాతి నిర్మాణ దశలోకి అడుగుపెట్టింది.**

భారతదేశ చరిత్ర పొరలలోని ఒకానొక పొరలో గల శివాజీ-ఔరంగజేబు అంశాన్ని బీజేపీ తన ప్రయోజనాల కోసం తవ్వి తీయదలచుకుంటే, మరొకరు అంతకన్న వెనుకటి పొరల్లోకి వెళ్లి ఆర్య-ద్రవిడ అంశాన్ని ముందుకుతేవటంలో ఆశ్చర్యపడదగింది ఉండదు. ఆర్యులు బయటివారన్న అనేకానేకుల్లో సాక్షాత్తూ బాల గంగాధర్ తిలక్ ఉన్నారు. ఇటీవలి సంవత్సరాల శాస్త్రీయమైన డీఎన్ఏ పరీక్షలు కూడా దాన్ని ధృవీకరించాయి. కానీ పైన అనుకున్నట్లు భారతీయ సమాజం ఈ దశలనన్నీ గడిచిపోయి ఆధునిక, ప్రజాస్వామిక జాతి నిర్మాణ దశలోకి అడుగుపెట్టింది. దీనిని శివాజీ-ఔరంగజేబు వాదులు గాని, ఆర్య-ద్రవిడవాదులు గాని విస్మరించటాన్ని ఆమోదించలేం. ముఖ్యంగా శివాజీ-ఔరంగజేబు వాదులు తమ చర్యల ద్వారా ఆర్య-ద్రవిడ వివాదాన్ని రెచ్చగొట్టదలిచారా అన్నది సూటి ప్రశ్న. అందువల్ల తమ తాత్కాలిక ప్రయోజనాలు ఏమి నెరవేరుతాయోగాని, దేశానికి కలిగే దీర్ఘకాలిక హాని గురించి వారు తమను తాము హెచ్చరించుకోవటం మంచిది. తెలంగాణ బీజేపీ నాయకులు మొన్నటి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పాఠాలను ఎంతమాత్రం గ్రహించినట్లు లేరు. వారికి తమ సిద్ధాంతాలు ఉండవచ్చు. వాటి ఆధారంగా పార్టీని నిర్మించుకోవచ్చు. ఆ పని చేయగల సమర్థత లేనివారే వక్రచర్యలకు పాల్పడుతుంటారు. అది దేశభక్తి కాదు గదా అందుకు పూర్తి విరుద్ధమైన ధోరణిగా తేలుతుంది.

# ఆరోగ్య తెలంగాణకు మార్గదర్శి

తెలంగాణం



**డాక్టర్ కడియం కావ్య**

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న హెల్త్ ప్రొఫైలింగ్ విధానం ఆరోగ్య సమస్యల నిర్ధారణలో దిక్సూచిగా నిలుస్తున్నది. సాధారణ వ్యాధుల నిర్ధారణకు తోడు, సమస్యాత్మక, అంటువ్యాధుల, దీర్ఘకాలిక వ్యాధుల నిర్ధారణ, చికిత్సాంశాలను రికార్డు చేసేందుకు, వాటికి తగురీతిలో నివారణ విధానాలను సూచించడానికి ఈ హెల్త్ ప్రొఫైలింగ్ ఎంతగానో ఉపకరిస్తుంది. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అమలుచేస్తున్న పథకాల్లో 'హెల్త్ ప్రొఫైలింగ్' కూడా ముఖ్యమైనది.

తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత, కేసీఆర్ ప్రభుత్వం ఒక్కో అంశాన్ని ఆకళింపు చేసుకుంటూ ప్రజలకు సమగ్ర పాలన అందిస్తున్నది. ఆరోగ్య సంబంధిత అంశాల పట్ల ప్రజలను చైతన్యవంతులను చేయడం కోసం ఒక సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ భావించారు. 'సమగ్ర కుటుంబ సర్వే' ద్వారా ఎలాగైతే ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని సాధించుకునేరీతిలో ప్రయత్నం జరిగిందో అదే తరహాలో ఆరోగ్యం విషయంలో కూడా అలాంటి ప్రయత్నమే జరుగుతున్నది.

మన రాష్ట్రంలో గ్రామాలే ప్రధానంగా ప్రాంతాలవారీగా పలు ఆరోగ్య సమస్యలున్నాయి. వివిధ వృత్తుల్లో ఉన్న ఉద్యోగ, కార్మికవర్గాల్లో కొన్ని ప్రత్యేక వ్యాధి లక్షణాలు పొడసూపుతాయి. ప్రాంతాల వారీగా చూసుకున్నప్పుడు నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిస్ పీడిత గ్రామాల్లో ఉన్న ప్రజానీకానికి సంబంధించిన వివరాలను సేకరించి ఒక ప్రణాళికాబద్ధమైన చికిత్స విధానాలను అమలుపరుచగలిగే కార్యక్రమాన్ని రూపొందించుకోవచ్చు. అలాగే కొన్ని ప్రత్యేక వృత్తుల్లో నిమగ్నమైన ఉద్యోగ కార్మికవర్గాలకు శ్వాసకోశ సంబంధించిన వ్యాధులు విస్తరించే అవకాశాలున్నాయి. అవి ఒక సమూహానికో, కొందరు వ్యక్తులకో విస్తరించినప్పుడు చికిత్సపరంగా జాగ్రత్తలు సూచించగలిగే సామర్థ్యం 'హెల్త్ ప్రొఫైలింగ్' సమగ్రం గా చేపట్టినప్పుడు సాధ్యమవుతుంది.

ఫ్లోరోసిస్ పీడిత గ్రామాల్లో నీటిలోని వివిధ లవణాలను బేరీజు వేసే పరీక్షలు చేసినట్టే, అక్కడున్న ప్రజానీకం పలు వ్యాధుల బారిన పడినప్పుడు వారి శారీరక లక్షణాలకు సంబంధించిన వివరాలను కూడా పొందుపర్చగలిగే అవకాశం 'హెల్త్ ప్రొఫైలింగ్' పథకం ద్వారా సాధ్యమవుతుంది. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని కొన్ని గ్రామాల్లో బోధకాలు లాంటి వ్యాధుల విస్తరణ ఇప్పటికీ కొనసాగుతున్నది. ఆ వ్యాధిగ్రస్థుల ఆరోగ్య వివరాలను పొందుపరిచేందుకు కూడా 'హెల్త్ ప్రొఫైలింగ్' ఉపకరిస్తుంది. పోషకాహార లోపం వల్ల సంక్రమించే సాధారణ వ్యాధులను గురించి కూడా సమగ్ర ఆరోగ్య పట్టికలను తయారుచేసుకున్నప్పుడు సేకరించుకోగలుగుతాం. కొన్ని వృత్తుల్లో నిమగ్నమైన సందర్భాల్లో శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారినపడిన వారి వివరాలు కూడా 'హెల్త్ ప్రొఫైలింగ్'లో పొందుపర్చుకోగలుగుతాం. ముఖ్యంగా బీడీ, చేనేత కార్మికులు తాము నిమగ్నమైన పనిలోని అవశేషాలను శ్వాసద్వారా స్వీకరించినప్పుడు శ్వాసకోశ సంబంధ అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటికితోడు కొన్ని ప్రాంతాల్లో పారిశ్రామికీకరణ పర్యవసానంగా కూడా సిలికోసిస్, అస్బెస్టోసిస్ లాంటి వ్యాధులు సంక్రమించిన ఆరోగ్య చరిత్ర మన ముందున్నది.

సామాజిక హెల్త్‌ప్రొఫైల్ ప్రక్రియ సోషియోడెమోగ్రాఫిక్ లక్షణాలు, ఆరోగ్యస్థితి, జీవన నాణ్యత, ఆరోగ్య ప్రమాద కారకాలు మొదలైన విషయాలను బేరీజు వేసుకొని ఆరోగ్య వనరుల సూచికలతో రూపొందించబడింది. ఈ సూచికలు ప్రాథమికంగా వివరణాత్మక సమాచారాన్ని సేకరిస్తాయి. అలాగే ఇదొక వ్యక్తి గురించిన కొన్ని ఆరోగ్య లక్షణాలను సంగ్రహించడానికి ఉపయోగపడుతుంది. వినియోగదారు ప్రొఫైల్ పొందే ప్రక్రియను వ్యక్తిగత ప్రొఫైలింగ్ అంటారు. ఒక వ్యక్తి లక్షణాల వివరాలను నిల్వ చేయడానికి ఈ ప్రొఫైల్ ఉపయోగిస్తాం. కమ్యూనిటీ ప్రొఫైలింగ్ అనేది ఒక ప్రాంత పర్యావరణ లక్షణాలను ఆకళింపు చేసుకుంటూ ఆరోగ్య లక్షణాలను నమోదు చేస్తుంది. హెల్త్ ప్రొఫైలింగ్ విధానం ఒక ప్రాంత ఆరోగ్య సమస్యల్లో సాధారణ అంశాలను తెలుసుకునేందుకు కూడా ఉపకరిస్తుంది. వ్యక్తులకు సంబంధించిన సమగ్ర ఆరోగ్య చరిత్రను ఆమూలాగ్రం అందించగలిగే ఈ ప్రక్రియ మన లాంటి అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో ఒక సంజీవనిగా ఉపకరిస్తుంది. సాధారణ ఆరోగ్య సమస్యలను గురిం చి నమోదుచేయగలిగే రక్త నమూనాలు, బీపీ, ఈసీజీ, మధుమేహ సంబంధిత వివరాల సేకరణ, ఇలా సుమారు యాభై పైచిలుకు సాధారణ ఆరోగ్య వివరాలు 'హెల్త్ ప్రొఫైలింగ్'లో ఉంటాయి.

ముఖ్యమంత్రి కేసీఆర్ స్వగ్రామం 'చింతమడక'తో పాటు ఆ గ్రామం చుట్టూ ఉన్న సుమారు ఆరు గ్రామాల్లో పదివేల పైచిలుకు ప్రజారోగ్య సంబంధిత వివరాల నమోదు ప్రక్రియ ద్వారా మొదలైన 'హెల్త్ ప్రొఫైలింగ్' రాష్ట్రం లో రానున్న రోజుల్లో ఒక ప్రధాన ఆరోగ్య సంబంధిత నిర్ధారణాంశం. చింతమడకలో ఆరంభమైన ఈ వినూత్న ఆరోగ్య వివరాల సేకరణ ప్రక్రియ రానున్నరోజుల్లో ఆరోగ్య తెలంగాణ రూపకల్పనకు దిక్సూచి. సాధారణ ఆరోగ్య సమస్యల పట్ల గతంలో ఉన్న సూచికలకు, ఇప్పుడు నమో దయ్యే వివరాలు అనుసంధానంగా వ్యవహరించడమే కాకుండా ప్రభుత్వరం గంలో ఉన్న వైద్య సేవా వనరులకు ఇవి సరైన సమాచారం అందించడంలో మార్గనిర్దేశకాలుగా నిలుస్తాయి. ఈ హెల్త్ ప్రొఫైలింగ్ ఆదివాసీ ప్రజానీకం అధికంగా నివసించే ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లోని గిరిజనులకు, కార్మికులు అధికంగా ఉండే కరీంనగర్, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల ప్రజానీకానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

> **ముఖ్యమంత్రి కేసీఆర్ స్వగ్రామం 'చింతమడక'తో పాటు ఆ గ్రామం చుట్టూ ఉన్న సుమారు ఆరు గ్రామాల్లో పదివేల పైచిలుకు ప్రజారోగ్య సంబంధిత వివరాల నమోదు ప్రక్రియ ద్వారా మొదలైన 'హెల్త్ ప్రొఫైలింగ్' రాష్ట్రంలో రానున్న రోజుల్లో ఒక ప్రధాన ఆరోగ్య సం బంధిత నిర్ధారణాంశం. చింతమడకలో ఆరంభమైన ఈ వినూత్న ఆరోగ్య వివరాల సేకరణ ప్రక్రియ రానున్నరోజుల్లో ఆరోగ్య తెలంగాణ రూపకల్పనకు దిక్సూచి.**

ఆరోగ్యమే మహాభాగ్యమనే అంశాన్ని వాస్తవరూపంలోకి తేగలిగే ప్రధాన వనరుగా 'హెల్త్ ప్రొఫైలింగ్'లో నమోదయ్యే వివరాలు ఉపకరిస్తాయి. భౌగోళిక, సామాజిక పరిస్థితుల కారణంగా ఎదురయ్యే వ్యాధులను గురించి తెలుసుకోవచ్చు. అంతేకాకుండా తగు తరుణోపాయాలను 'హెల్త్ ప్రొఫైలింగ్' ద్వారా ఆచరణాత్మకం చేయవచ్చు. రాష్ట్ర ప్రగతిని వినూత్న ఒరవడితో దిశానిర్దేశనం చేస్తూ పలు విలక్షణమైన కార్యక్రమాల రూపకల్పన చేస్తున్న సీఎం కేసీఆర్ ఆలోచనల్లోంచి పుట్టుకొచ్చిన 'హెల్త్ ప్రొఫైలింగ్' ఆరోగ్య తెలంగాణకు మార్గదర్శిగా నిలుస్తుందని చెప్పుకోవచ్చు. పాథాలజీ పరంగా వివిధ పరీక్షల నిర్వహణ ద్వారా వ్యక్తి ఆరోగ్యస్థితి బేరీజు వేసే ప్రక్రియ ఈ హెల్త్ ప్రొఫైల్ విధానంలో వాస్తవరూపం దాలుస్తుంది. అలాగే ప్రపంచ ఆరోగ్య సంస్థ పేద దేశాలలోని వివిధ వ్యాధుల వివరాలను సేకరించడానికి ప్రధాన వనరుగా ఈ ప్రక్రియ ఉపకరిస్తుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com


మహబూబ్‌నగర్ హౌసింగ్‌బోర్డు కాలనీలో రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్


పట్టణ ప్రగతిలో భాగంగా సిద్దిపేటలోని ఓ కాలనీలో స్థానిక సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి హరీశ్‌రావు


నల్లగొండ జిల్లా నందికొండలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

# ప్రజలతో మమేకమై..

## రాష్ట్రంలో జోరుగా 'పట్టణ ప్రగతి'

- వార్డుల్లో మంత్రుల విస్తృత పర్యటన
- తొలుగుతున్న మురుగు.. స్వచ్ఛబాటలో పట్టణాలు


బుధవారం భూపాలపల్లిలోని ఆరో వార్డులో ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. చిత్రంలో ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్**

రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రగతి కార్యక్రమం జోరందుకున్నది. పల్లె ప్రగతి స్ఫూర్తితో చేపట్టిన ఈ కార్యక్రమంలో పట్టణాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడుతున్నది. కాలనీల్లో అంతర్గత రోడ్లతోపాటు డంపింగ్‌యార్డులు, వైకుంఠధామాల నిర్మాణం వేగవంతమవుతున్నది. కౌన్సిలర్ నుంచి మంత్రి వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలతో మమేకమవుతూ శ్రమదానం చేస్తుండటంతో పట్టణాలు మెరుస్తున్నాయి. బుధవారం జనగామ మున్సిపాలిటీ పరిధిలోని 13, 30వ వార్డుల్లోని దళితవాడల్లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ కాలి నడకన పర్యటించారు. పలు జిల్లాల్లో మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, వీ శ్రీనివాస్‌గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి పట్టణ ప్రగతి కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.

**నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం: ఎర్రబెల్లి**

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా భావించి అమలుచేస్తున్న పట్టణ ప్రగతి కార్యక్రమంలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలో బుధవారం నిర్వహించిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణితో కలిసి మంత్రి పాల్గొన్నారు. అధికారులు, నాయకులతో కలిసి కాలనీలో కలియతిరిగారు. పట్టణాభివృద్ధి జరుగుతుందా?, సంక్షేమ పథకాలు అందుతున్నాయా? అని స్థానికులను అడిగారు. అనంతరం అంబేద్కర్ మైదానంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డితో కలిసి మాట్లాడారు. ప్రజలకు సక్రమంగా సేవలందేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. 75 గజాల్లోపు ఇండ్లు నిర్మించుకుంటే అనుమతులు అవసరం లేదన్నారు. భూపాలపల్లి పట్టణ ప్రగతికి హాజరుకాని విద్యుత్‌శాఖ అధికారులతోపాటు కౌన్సిలర్లకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

**ప్రతిపక్షాలు పాల్గొనడం శుభసూచకం: గంగుల**

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పట్టణ ప్రగతి కార్యక్రమానికి ప్రజల్లో విశేష స్పందన వస్తున్నదని, ప్రతిపక్ష నాయకులు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొనడం శుభసూచకమని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 11, 12, 42వ డివిజన్లతోపాటు కొత్తపల్లి మున్సిపాలిటీలో బుధవారం మంత్రి విస్తృతంగా పర్యటించారు. పలు కాలనీల్లో కాలినడకన తిరుగుతూ ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇక అభివృద్ధి తప్ప.. రాజకీయాలకు తావుండకూడదన్నారు. అంతిమంగా ప్రజలకు మేలు చేయడమే తమ ముందున్న కర్తవ్యమని చెప్పారు. పారిశుద్ధ్యం మెరుగు కోసం ప్రభుత్వం ఎన్ని కోట్లు అయినా వెచ్చించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. 42వ డివిజన్‌లోని ఇందిరానగర్‌లో పర్యటించిన మంత్రి ఒడ్డెరకాలనీలో ఇండ్ల చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోవడంపై అసహనం వ్యక్తంచేశారు. ఇందిరానగర్‌లో ఇండ్ల పైనుంచి వెళ్తున్న విద్యుత్ తీగలను తొలిగించే పనులకు శ్రీకారం చుట్టారు. ఆయన వెంట ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మున్సిపల్ కమిషనర్ క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

**సుందర పట్టణంగా తీర్చిదిద్దుతా: శ్రీనివాస్‌గౌడ్**

పాలమూరు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతానని ఎక్సైజ్‌శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. బుధవారం మహబూబ్‌నగర్‌లోని హౌసింగ్‌బోర్డు కాలనీలో కలెక్టర్ వెంకట్రావుతో కలిసి మంత్రి పర్యటించారు. వార్డులో కలియతిరిగి పారిశుద్ధ్య పనులు, డ్రైనేజీలను, పైపులైన్ లీకేజీలను పరిశీలించారు. అనంతరం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గత పాలకులు పట్టణ అభివృద్ధిపై నిర్లక్ష్యం వహించారని, తెలంగాణ వచ్చాకే ప్రతి సమస్య పరిష్కారానికి నోచుకుంటున్నదని తెలిపారు. 2014 కంటే ముందు పట్టణ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడ్డారనీ, ప్రస్తుతం ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు వస్తుందన్నారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సిములు, సింగిల్ విండో చైర్మన్ కోరమోని వెంకటయ్య, మున్సిపల్ కమిషనర్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

**వందశాతం వసతులు కల్పిస్తాం: మల్లారెడ్డి**

మేడ్చల్ జిల్లాలో కొత్తగా ఏర్పడిన పట్టణాల్లో వందశాతం మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని పోచారం, నాగారం మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రగతి కార్యక్రమాల్లో కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లుతో కలిసి పాల్గొన్న మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, అధికారులు అంకితభావంతో పని చేయాలని మంత్రి సూచించారు.

**కొత్తచట్టంతో మంచి సేవలు: సబితారెడ్డి**

మున్సిపాలిటీల్లో అవినీతిని తగ్గించడంతోపాటు పౌరసేవలు మరింత సమర్థవంతంగా అందించేందుకు ప్రభుత్వం నూతన మున్సిపల్ చట్టాన్ని తెచ్చిందని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం పట్టణ ప్రగతిలో భాగంగా రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్, ఆమనగల్లు మున్సిపాలిటీల పరిధిలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆమనగల్లులో కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ప్రజలకు సుస్థిర పాలన అందించేందుకు సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపాలిటీలో మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి సురక్షిత మంచినీటి సరఫరాతో నీటి సమస్య తీరుతుందని చెప్పారు.

### నంబర్‌వన్ రాష్ట్రంగా తెలంగాణ

- మంత్రి జగదీశ్‌రెడ్డి

అన్ని రంగాల్లో తెలంగాణను నంబర్ వన్‌గా నిలిపేందుకు సీఎం కేసీఆర్ ప్రణాళికలను అమలుచేస్తున్నారని, అభివృద్ధి పథంలో తెలంగాణ తనకు తానే పోటీ పడుతున్నదని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా నందికొండ మున్సిపాలిటీలో పట్టణ ప్రగతి కార్యక్రమంలో ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కర్న అనూషాశరత్‌రెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం పైలాన్‌కాలనీలోని 7వ వార్డులో పర్యటించి పనులను పరిశీలించారు. వార్డుల వారీగా కమిటీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలంతా సమష్టిగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. పర్యావరణ సమస్యను అధిగమించడానికి ప్రతిఒక్కరూ ఆరు మొక్కలు నాటి, సంరక్షించాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే రానున్న రోజుల్లో గాలిని కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రపంచ పర్యాటక ప్రాంతం నాగార్జునసాగర్ అభివృద్ధిని గత పాలకులు విస్మరించారని, స్వరాష్ట్రంలో మున్సిపాలిటీగా ఎదిగిన తీరును మంత్రి గుర్తు చేశారు.


రంగారెడ్డి జిల్లా ఆమనగల్‌లో మొక్కనాటుతున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


కరీంనగర్‌లోని ఓ డివిజన్‌లో మురికి కాల్వను పరిశీలిస్తున్న మంత్రి గంగుల కమలాకర్


మేడ్చల్ జిల్లా పోచారంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి. చిత్రంలో కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు

## మౌలిక సదుపాయాల కల్పనకే 'పట్టణ ప్రగతి'

ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

**పట్టణాలకు** కావాల్సిన మౌలిక వసతులను కల్పించి, ప్రజల భాగస్వామ్యంతో వాటిని అభివృద్ధి పథంలో నిలుపాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టారని ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేటలో అదనపు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లతో కలిసి సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని 20, 30వ వార్డుల్లో కలియతిరిగారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఎవరికి వారు తమ ఇండ్లల్లోనే తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని కోరారు. ఇందుకోసం ఇంటింటికీ వేర్వేరు చెత్తబుట్టలు ఇస్తున్నామని చెప్పారు. వీధుల్లో, ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే జరిమానా విధిస్తామన్నారు. చెత్త దేశానికి పెద్ద సమస్యగా మారిందని, దేశంలో రోజూ 20 వేల టన్నుల చెత్త సేకరిస్తున్నామని, దానిని అరికట్టే బాధ్యత మనందరిపై ఉందన్నారు. త్వరలో 57 ఏండ్ల వారికి పింఛన్లు అందిస్తామని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. భవిష్యత్‌లో తమ సొంత ప్లాట్లలో ఇండ్లు కట్టుకునే వారికి ప్రభుత్వం నుంచి డబ్బులు ఇప్పిస్తామని పేర్కొన్నారు.

## అన్ని నియోజకవర్గాల్లో అర్బన్ పార్కులు

అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి


బుధవారం నిజామాబాద్ జిల్లా సారంగాపూర్ వద్ద అటవీ అర్బన్ పార్కును ప్రారంభిస్తున్న మంత్రులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, ఎమ్మెల్సీ ఆకుల కవిత తదితరులు

**ఇందూరు:** ఆహ్లాద వాతావరణం కోసం అడవులు దగ్గరగా ఉన్న అన్ని నియోజకవర్గాల్లో అర్బన్ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లా సారంగాపూర్ వద్ద అటవీ అర్బన్ పార్కును ఆర్‌అండ్‌బీశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి అల్లోల మాట్లాడుతూ.. ఇప్పటివరకు రాష్ట్రంలో 92 పార్కులు ఏర్పాటు చేశామని..ఒక్కో పార్కు నిర్మాణానికి రూ.3 కోట్ల నుంచి రూ.5 కోట్ల వ్యయం చేస్తున్నామని తెలిపారు. సారంగాపూర్ అర్బన్ పార్కులో 2.8 కిలోమీటర్ల మేర వాకింగ్ ట్రాక్ సిద్ధం చేసినట్టు వివరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన హరితహారంలో భాగంగా రాష్ట్రంలో 230 కోట్ల మొక్క లు నాటడం లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే పెద్దఎత్తున మొక్కలు నాటామన్నారు. అనంతరం పార్కులో మంత్రులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, ఎమ్మెల్సీ ఆకుల లలిత, కలెక్టర్ నారాయణరెడ్డి, నగర మేయర్ నీతూ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జీయూకేటీ ఇంచార్జి వీసీగా రాహుల్ బొజ్జా

**బాసర:** బాసర రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ(ఆర్జీయూకేటీ) ఇంచార్జి వైస్ చాన్స్‌లర్‌గా రాహుల్ బొజ్జాను నియమిస్తూ ఉన్నత విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి చిత్రారామచంద్రన్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం రాహుల్‌బొజ్జా సాంఘిక, సంక్షేమ అభివృద్ధి శాఖ కార్యదర్శిగా పని చేస్తున్నారు. రెండున్నరేండ్ల పాటు ఇక్కడ వీసీగా కొనసాగిన అశోక్‌కుమార్ ఎన్‌పీహెచ్‌ఆర్‌డీ అదనపు డీజీగా నెలరోజుల క్రితమే బాధ్యతలు స్వీకరించారు.



# జలశోభితం

## 'కాళేశ్వరం'లో గోదావరి పరుగులు
## లింక్-1,2లో దిగ్విజయంగా ఎత్తిపోతలు

**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** 'కాళేశ్వర జలాలు దిగువ నుంచి ఎగువకు పరుగులు తీస్తున్నాయి. దిగువన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని లక్ష్మి పంప్‌హౌజ్‌లో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. బుధవారం పెద్దపల్లి జిల్లా మంథని మండలం కాసిపేటలోని సరస్వతి పంప్‌హౌజ్‌లో 1, 2, 7వ మోటర్లు నడిపారు. ఒక్కో మోటర్ 2,900 క్యూసెక్కుల చొప్పున మొత్తం 8,700 క్యూసెక్కుల నీరు మంథని మండలం సిరిపురంలోని పార్వతి బరాజ్‌లోకి చేరుతున్నది. ఇక్కడి నుంచి నీటిని అంతర్గాం మండలం గోలివాడలోని పార్వతి పంప్‌హౌజ్ ద్వారా ఎగువన ఎల్లంపల్లి బరాజ్‌లోకి ఎత్తిపోస్తున్నారు. ఇక్కడ 3, 4, 5, 6వ మోటర్లు నడిపిస్తుండగా, ఒక్కో మోటర్ ద్వారా 2,610 క్యూసెక్కుల చొప్పున 10,440 క్యూసెక్కుల నీరు ఎల్లంపల్లి బరాజ్‌లోకి చేరుతున్నది. ఇక లింక్-2లో భాగంగా పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారంలోని నందిపంప్‌హౌజ్‌లో 3, 4వ మోటర్లు నిరంతరాయంగా నడుస్తున్నాయి. ఒక్కో మోటర్ ద్వారా 3,150 క్యూసెక్కుల చొప్పున 6,300 క్యూసెక్కులు నంది రిజర్వాయర్‌లోకి తరలుతున్నది. ఇక్కడి నుంచి 7వ ప్యాకేజీలోని జంట సొరంగాల ద్వారా 8 ప్యాకేజీలోని కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌజ్‌కు తరలుతున్నాయి. ఇక్కడా 2, 3వ పంపుల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, బుధవారం కూడా వాటినే నడిపించారు. ఇక్కడి నుంచి ఓవైపు ఎస్సారార్ జలాశయానికి, అలాగే పునర్జీవ పథకంలో భాగంగా వరద కాల్వపై నిర్మించిన రాంపూర్ పంప్‌హౌజ్‌కు నీటిని తరలిస్తున్నారు. కాగా, గాయత్రి పంప్‌హౌజ్ ద్వారా బుధవారం సాయంత్రం వరకు 10.12 టీఎంసీల నీటిని ఎత్తిపోసినట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.


భూపాలపల్లి జిల్లాలోని లక్ష్మి పంప్‌హౌజ్ డెలివరీ స్సిస్టర్నుల వద్ద పైపుల నుంచి పోస్తున్న నీరు

**ఎల్‌ఎండీకి 5,654 క్యూసెక్కులు**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి ఎల్‌ఎండీకి బుధవారం 5,654 క్యూసెక్కుల నీటిని పంపించారు. ఎస్సారార్ జలాశయం నాలుగు రివర్స్ స్లూయిస్ ద్వారా దిగువకు నీటిని పంపుతున్నారు. జలాశయంలో 25.22 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. కాగా, లక్ష్మీపూర్ పంపుహౌజ్ నుంచి బుధవారం 8,806 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చినట్టు అధికారులు తెలిపారు. కాగా ఎల్‌ఎండీలో ప్రస్తుతం 10.926 టీఎంసీలు నిల్వ ఉన్నట్టు వారు పేర్కొన్నారు.

## విందు ఆరగిస్తూ.. కుప్పకూలాడు

- శ్వాసనాళంలోకి మెతుకులు
- దవాఖానకు తీసుకెళ్తుండగా మృతి

**కోదాడ రూరల్:** వివాహ వేడుకలో ఓ వ్యక్తి విందు ఆరగిస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలాడు. భోజనం చేస్తున్న క్రమంలో మొదటి ముద్దకే ఇబ్బంది పడ్డాడు. అన్నం మెతుకులు శ్వాసనాళంలోకి వెళ్లడంతో స్పృహకోల్పోయాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని కూచిపూడి గ్రామంలో బుధవారం చోటుచేసుకున్నది. అదే గ్రామానికి చెందిన మలిశెట్టి సీతయ్య(46) అందరితో కలిసి భోజనానికి కూర్చున్నాడు. మొదటి ముద్ద నోట్లో పెట్టుకోగానే గొంతులో ఇరుక్కున్నట్టు అనిపించింది. ఇంతలోనే స్పృహతప్పి పడిపోవడంతో బంధువులు వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడు. సీతయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



**బుధవారం వనపర్తి మండలం రాజనగరం సింగిల్‌విండో పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి హాజరైన వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నూతన చైర్మన్ విజయకుమార్, వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డిలను సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికైన సింగిల్ విండో డైరెక్టర్లు రైతుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు.**

**- వనపర్తి రూరల్**

### వలకు చిక్కిన మొసలి



**ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్ పరిధిలోని సూర్యాపేట జిల్లా మోతె మండలం నర్సింహాపురంలో ఓ మత్స్యకారుడి వలకు బుధవారం మొసలి చిక్కింది. సమాచారం అందుకున్న ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ రాజు నాయక్ వచ్చి మొసలిని పక్కనే ఉన్న పాలేరు రిజర్వాయర్‌లో వదిలారు. రిజర్వాయర్‌లో మొసలిని వదలొద్దని మత్స్యకారులు అటవీ అధికారులతో వాగ్వాదానికి దిగారు.**

**- కూసుమంచి**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 39,889 | 11,679 |
| ↘ 392 | ↘ 119 |

ముడి చమురు (బ్రెంట్) ↘ 53.78 డాలర్లు

## ఏటీఎంల్లో 2 వేల నోటు బంద్!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** చలామణిలో నుంచి రూ.2 వేల నోట్లను దశలవారీగా తగ్గించే చర్యలు మొదలైయ్యాయి. రూ.2 వేల నోట్లకు బదులుగా మరిన్ని రూ.500 నోట్లను ఏటీఎంల ద్వారా వ్యవస్థలోకి పంపించేందుకు బ్యాంకులు సిద్ధమవుతున్నాయి. రూ.2 వేల నోట్ల ముద్రణను ఆపేశామని గతేడాది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద వచ్చిన ప్రశ్నకు బదులిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బ్యాంకర్లు ఆ దిశగా ముందుకెళ్తున్నారు. తమ ఏటీఎంల్లో రూ.2 వేల నోట్ల వినియోగాన్ని ఆపాలని నిర్ణయించినట్లు ఇప్పటికే ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ ఇండియన్ బ్యాంక్ ప్రకటించిన సంగతి విదితమే. ఈ క్రమంలో మిగతా బ్యాంకులూ రూ.2 వేల నోట్ల చలామణిని తగ్గించాలని చూస్తున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. ఇందులో భాగంగానే కొన్ని బ్యాంకులు ఏటీఎంలలో మార్పులు చేసేస్తున్నాయి. నిజానికి ఈ విషయంలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి కూడా ఎలాంటి ఆదేశాలు లేవని, బ్యాంకులే నిర్ణయం తీసుకుంటున్నాయని చెబుతున్నారు. కస్టమర్ల సౌకర్యార్థం ఏటీఎంల్లో చిన్న నోట్లను నింపాలనే బ్యాంకులు రూ.2 వేల నోట్లను తగ్గిస్తున్నాయని పేర్కొంటున్నారు.



# జర జాగ్రత్త!

## ప్రపంచ ఆర్థికవ్యవస్థకు ముప్పే

### కరోనా వైరస్‌పై మూడీస్ భయాందోళన

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:**

ప్రాణాంతక వైరస్ కరోనా.. మహమ్మారిగా ముదిరితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే వీలుందని, మాంద్యానికి అవకాశాలున్నాయని గ్లోబల్ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ బుధవారం హెచ్చరించింది. చైనాలో పుట్టుకొచ్చిన కరోనా వైరస్.. క్రమక్రమంగా ఇతర దేశాలకూ పాకుతుండటం ఇప్పుడు అందరినీ కలవరపెడుతున్నది. మనుషుల ప్రాణాలను మింగేస్తున్న ఈ వైరస్.. ఆర్థిక వ్యవస్థలనూ బలిగొంటుండటంతో దీన్ని అంతమొందించకపోతే అనర్థాలు తప్పవని మూడీస్ ఆందోళన వ్యక్తం చేసింది. 'చైనా ఆర్థిక వ్యవస్థను కరోనా వైరస్ (కోవిడ్-19) ఇప్పటికే దెబ్బ తీసింది. ఇప్పుడిది ప్రపంచ ఆర్థిక వ్యవస్థనే ప్రమాదంలో పడేస్తున్నది' అని మూడీస్ అనలిటిక్స్ చీఫ్ ఎకనామిస్ట్ మార్క్ జండి అన్నారు. 'ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై అనేక మార్గాల్లో కోవిడ్-19 దాడి చేస్తున్నది. చైనాకు ప్రయాణాలు తగ్గి పర్యాటక రంగం దెబ్బతిన్నది. విమానాల రాకపోకలు మందగించాయి. జల రవాణా కూడా స్తంభించిపోయింది. దీని వల్ల అమెరికా వంటి ఇతర దేశాలూ ప్రభావితమవుతున్నాయి. ఏటా చైనాకు చెందిన దాదాపు 30 లక్షల పర్యాటకులు అమెరికాకు వెళ్తున్నారు. ఇప్పుడిది ఆగిపోయినట్లైంది' అని జండి తెలిపారు. ఇక మిలాన్, ఇటలీల్లోనూ కరోనా వ్యాపిస్తుండటంతో మొత్తం ఐరోపా సమాజంపైనే ప్రభావం పడుతున్నదని మూడీస్ చెప్పింది. ఐరోపా దేశాల్లో ప్రధాన పర్యాటక కేంద్రంగా విలసిల్లుతున్న ఇటలీలో కరోనా కేసులు పెరుగుతున్న విషయం తెలిసిందే. దీంతో ఆదాయం పడిపోయి ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టి మొత్తం వ్యవస్థలే నీరుగారిపోయే ప్రమాదం ఉందని మూడీస్ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. దక్షిణ కొరియాలోనూ కరోనా ప్రకంపనలు సృష్టిస్తుండటంతో ప్రపంచ తయారీ రంగంపై మరింత ప్రభావం పడుతున్నదని, జీడీపీ దెబ్బతింటున్నదని చెబుతున్నారు.

#### కోలుకోని చైనా ఉత్పత్తి

కరోనా వైరస్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఇంతలా ప్రభావితం చేయడానికి కారణం.. చైనా గ్లోబల్ తయారీ కేంద్రంగా ఉండటమే. హెయిర్ పిన్ను నుంచి ఏరోప్లేన్ వరకు చైనాలో తయారవుతున్నాయి. దాదాపు ప్రపంచంలోని వివిధ రంగాలకు చెందిన సంస్థలన్నింటికీ చైనాలో ఉత్పాదక కేంద్రాలున్నాయి. కరోనా వైరస్ కారణంగా ఇప్పుడవన్నీ మూతబడ్డాయి. ఈ అంటువ్యాధి భయాలతో ఎవరూ బయటకు రాలేని పరిస్థితి ఉండటంతో అన్ని రకాల తయారీ నిలిచిపోయింది. దీంతో చైనా నుంచి వివిధ దేశాల్లోని ఉత్పాదక కేంద్రాలకు చేరాల్సిన ముడి సరుకుకు బ్రేకులు పడ్డాయి. ఫలితంగా ఆయా దేశాల ఉత్పాదక సామర్థ్యం కూడా ఒక్కసారిగా ప్రభావితమవుతున్నది. ఇప్పటికే భారత్‌లో ఆటో, మొబైల్, టెలివిజన్ తదితర ఎలక్ట్రానిక్స్ రంగాలు ఇబ్బందులను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. స్మార్ట్‌ఫోన్లు, టెలివిజన్లు, వాహన విడిభాగాల తయారీ చైనాలోనే ఎక్కువగా జరుగుతున్నాయి మరి. ఇప్పటికీ వేలాది పరిశ్రమలు మూతబడే ఉన్నాయి. వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు చైనా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కూడా ఉత్పత్తికి అంతరాయం కలిగిస్తున్నాయి. స్తంభించిన రవాణా వ్యవస్థ.. కార్మికులను ఇండ్లకే పరిమితం చేస్తున్నది. చైనా పరిస్థితులు యాపిల్, నైక్, జనరల్ మోటార్స్, హ్యూందాయ్ వంటి దిగ్గజ సంస్థలకు పెద్ద ఎత్తున నష్టం చేకూరుస్తుండగా, ఇతర దేశాల్లోని వ్యాపార అవకాశాలనూ మింగేస్తున్నాయి.

### పరిస్థితులను గమనిస్తున్నాం

**నిర్మలా సీతారామన్**



**భారత** ఆర్థిక వ్యవస్థపై కరోనా వైరస్ ప్రభావాన్ని దగ్గరగా గమనిస్తున్నామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఏయే రంగాలపై ఎంతెంత ప్రభావం ఉందన్నదాన్ని సమీక్షిస్తున్నట్లు తెలిపారు. 'మేము కరోనా పరిస్థితుల్ని చాలా దగ్గరగా పరిశీలిస్తున్నాం. ఆయా రంగాలవారీగా పరిశ్రమలపై వైరస్ ప్రభావాన్ని కార్యదర్శుల స్థాయి అధికారులు అంచనా వేస్తున్నారు. చైనాకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాం. ఇతర దేశాల నుంచి ముడి సరుకును దిగుమతి చేసుకోవడానికి ఉన్న అవకాశాలనూ పరిశీలిస్తున్నాం' అని బుధవారం ఇక్కడ నిర్మలా సీతారామన్ చెప్పారు. ఇదిలావుంటే ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీన ప్రక్రియ కొనసాగుతున్నదన్నారు. గతేడాది ఆగస్టులో 10 ప్రభుత్వ రంగ బ్యాంకులను.. నాలుగు బ్యాంకులుగా ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఎస్బీఐలో దాని అనుబంధ బ్యాంకులను, బ్యాంక్ ఆఫ్ బరోడాలో విజయా, దేనా బ్యాంక్‌లను కలిపేసిన సంగతి విదితమే.

### ప్రపంచ జీడీపీపై ప్రభావం ఇలా..

- కరోనా వైరస్‌తో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మునుపెన్నడూ లేని విపత్తు సంభవించే వీలుందని ఆర్థిక నిపుణులు భయపడుతున్నారు. చైనా ఉత్పాదక రంగం కుదేలవడంతో ప్రపంచ జీడీపీ 1 శాతం వరకు తగ్గిపోవచ్చని అంచనా వేస్తున్నారు.
- అమెరికా తర్వాత రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ చైనానే. ఈ దేశంపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థలెన్నో ఉన్నాయి. భారత్ కూడా ఫార్మా, కెమికల్, ఆటో కంపోనెంట్, సోలార్, స్టీల్, టెలికం, వైట్ గూడ్స్, ఎలక్ట్రానిక్ కంపోనెంట్స్, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, పాదరక్షలు, దుస్తులు తదితర రంగాల్లో దిగుమతులు చేసుకుంటున్నది. దీంతో కరోనా దెబ్బకు భారత ఆర్థిక వ్యవస్థ కూడా సహజంగా ప్రభావితం అవుతున్నదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

  పెట్రో ఉత్పత్తుల వినియోగంలో చైనాదే అగ్రస్థానం. కానీ ఇప్పుడు తయారీ, రవాణా వ్యవస్థలు స్తంభించిపోవడం, చైనాకు ఇతర దేశాల నుంచి రాకపోకలు కూడా తగ్గడంతో ప్రపంచ ముడి చమురు ఉత్పత్తిని ప్రభావితం చేస్తున్నది. దీంతో చమురు ఉత్పాదక దేశాల ఆర్థిక పరిస్థితులు తలకిందులవుతున్నాయి. అమెరికాసహా ఇతర దేశాల ఎగుమతులూ చైనాకు పడిపోతుండటంతో మొత్తం ప్రపంచ జీడీపీకి ఎసరు వస్తున్నదని నిపుణులు అంటున్నారు.
- చమురుతోపాటు కాపర్, సోయాబీన్స్, పంది మాంసం చైనాకు ఎక్కువగా వెళ్తున్నది. మరోవైపు మొబైల్స్, టెలివిజన్లు, ఆటో రంగాల విడిభాగాల తయారీ నిలిచిపోవడంతో ఇతర దేశాల్లో వాటి తయారీ మందగించి ధరలు పెరిగే వీలుందని, ఎరువులు, వ్యవసాయోత్పత్తుల దిగుమతులు తగ్గి ద్రవ్యోల్బణానికి దారితీయవచ్చని చెబుతున్నారు.
- ఆర్బీఐ సైతం చైనాపై కరోనా ప్రభావాన్ని గమనిస్తున్నామని చెప్పడం.. ద్రవ్యసమీక్షపై దాని ప్రాధాన్యాన్ని గుర్తు చేస్తున్నది. లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాలూ చైనా పరిస్థితులకు ప్రభావితమవుతున్నాయని అంటున్నారు. మొత్తానికి చైనా కరోనా.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థనే షేక్ చేస్తున్నది.

దేశీయ మార్కెట్లోకి ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ గ్రాండ్ఐ10 నియోస్ సరికొత్త వెర్షన్‌ను విడుదల చేసింది హ్యుందాయ్ మోటర్. ఢిల్లీ షోరూంలో ఈ కారు రూ.7.68 లక్షలకు లభించనున్నది. మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ కలిగిన స్పోర్ట్ రకం కారు ధర రూ.7.68 లక్షలు.



# ఆరు లక్షల కోట్లు ఆవిరి

## నాలుగు రోజుల్లో 1,300 పాయింట్లు మటాష్

### కల్లోలం సృష్టించిన కరోనా..40 వేల దిగువకు సూచీ

**ముంబై, ఫిబ్రవరి 26:** కరోనా వైరస్ దెబ్బకు స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఈ వైరస్ ప్రభావం అధికంగా ఉంటుందన్న సంకేతాలు మదుపరుల్లో ఆందోళనను పెంచింది. ఫలితంగా అమ్మకాలకు మొగ్గుచూపడంతో వరుసగా నాలుగోరోజు కూడా భారీ నష్టాల్లో ముగిశాయి. ప్రారంభం నుంచి నష్టాల బాట పట్టిన సూచీలకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు ఈ పతనానికి ఆజ్యంపోశాయి. తీవ్ర ఒత్తిడిలో ఉన్న దేశీయ స్టాక్ మార్కెట్లు 40 వేల పాయింట్ల దిగువకు పడిపోయాయి. ఒక దశలో 521 పాయింట్లకు పైగా పతనం చెందిన బీఎస్ఈ సెన్సెక్స్ చివరకు 392.24 పాయింట్లు పతనం చెంది 39,888.96 వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 119.40 పాయింట్లు లేదా 1.01 శాతం కోల్పోయి 11,678.50 వద్ద పరిమితమైంది. ఈ నెల మూడు తర్వాత సూచీలకు ఇదే కనిష్ఠ స్థాయి. గత నాలుగు రోజుల్లో సెన్సెక్స్ 1,281.6 పాయింట్లు లేదా 3.11 శాతం, నిఫ్టీ 402.35 పాయింట్లు లేదా 3.33 శాతం చొప్పున పతనం చెందాయి. దీంతో మదుపరుల సంపద హారతి కర్పూరంలా కరిగిపోయింది. గత నాలుగు రోజుల్లో వీరు రూ.6 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. బీఎస్ఈలో లిస్టైన కార్పొరేట్ సంస్థల మార్కెట్ విలువ అంతకంతకు పడిపోతున్నది. చైనాలో తగ్గుముఖం పట్టిన కరోనా వైరస్ ఇతర పొరుగు దేశాలకు పాకుతుండటంతో విదేశీ పెట్టుబడిదారుల్లో ఆందోళన నెలకొన్నది. దీంతో మంగళవారం ఒకేరోజు దేశీయ ఈక్విటీ, డెబిట్ మార్కెట్ల నుంచి రూ.2,315 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. వరుసగా ఐదు నెలలుగా పెట్టుబడులు పెట్టిన ఎఫ్పీఐలు..ఈ నెల మొదట్లో కూడా రూ.21 వేల కోట్లకు పైగా నిధులు కుమ్మరించారు. కానీ, కరోనా వైరస్‌తో అంతర్జాతీయంగా పరిస్థితులు తారుమారయ్యాయి. బుధవారం మార్కెట్లో సన్‌ఫార్మా భారీగా పతనం చెంది టాప్ లూజర్‌గా నిలిచింది. వీటితోపాటు మారుతి, ఎల్అండ్‌టీ, హీరో మోటోకార్ప్, ఇన్ఫోసిస్, ఓఎన్‌జీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్‌ల షేర్లు పతనం చెందగా..మరోవైపు ఎస్బీఐ, హెచ్‌యూఎల్, హెచ్‌సీఎల్ టెక్, ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్‌లు మాత్రం మదుపరులను ఆకట్టుకున్నాయి.

# బిలియనీర్ల భారతం

## చైనా, అమెరికా తర్వాత మనమే

### దేశంలో గతేడాది నెలకు ముగ్గురు చొప్పున పెరిగిన బిలియనీర్లు

### 138కి చేరిన అపర కుబేరులు -హురున్ సంపన్నుల జాబితా

**ముంబై, ఫిబ్రవరి 26:** చైనా, అమెరికా తర్వాత ప్రపంచంలో అత్యధిక మంది బిలియనీర్లు భారత్‌లోనే ఉన్నారు. దేశంలో 138 మంది డాలర్ బిలియనీర్లున్నట్లు తాజాగా విడుదలైన హురున్ నివేదిక స్పష్టం చేసింది. గతేడాది నెలకు దాదాపు ముగ్గురు చొప్పున డాలర్ బిలియనీర్లు పెరిగినట్లు 2019కిగాను బుధవారం విడుదలైన హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్-2020 తెలిపింది. నిరుడు కొత్తగా 34 మంది అవతరించినట్లు వెల్లడించింది. బిలియనీర్ల దేశాల్లో 799 మందితో చైనా మొదటి స్థానంలో ఉంటే, 626 మందితో అమెరికా రెండో స్థానంలో ఉన్నది. 138 మందితో భారత్ మూడో స్థానంలో నిలిచింది. విదేశాల్లో ఉన్న భారతీయులనూ కలిపితే ఈ సంఖ్య 170కి పెరుగుతుండటం గమనార్హం. ఇక ఈ జాబితా బిలియన్ డాలర్లు అంతకంటే ఎక్కువ సంపద కలిగిన ప్రపంచంలోని 2,817 మందితో రూపొందింది.

#### ఏడుగురు హైదరాబాదీలు

జాబితాలో హైదరాబాద్‌కు చెందిన ఏడుగురు సంపన్నులకు స్థానం లభించింది. వీరి సంపద విలువ 13 బిలియన్ డాలర్లుగా ఉన్నది. 50 మంది బిలియనీర్లతో ముంబై అగ్ర స్థానంలో ఉండగా, వీరి వద్దనున్న సంపద విలువ దాదాపు 218 బిలియన్ డాలర్లు. ఢిల్లీలో 30 మంది, బెంగళూరులో 17 మంది, అహ్మదాబాద్‌లో 12 మంది ఉన్నారు.

#### గంటకు 7 కోట్లు పెరిగిన ముకేశ్ సంపద

రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ 67 బిలియన్ డాలర్లతో టాప్-10లో ఉన్నారు. గంటకు రూ. 7 కోట్ల సంపద పెరిగింది. ఆసియాలోనే ధనవంతుడిగా మరోసారి నిలిచిన ముకేశ్.. గ్లోబల్ టాప్-10 బిలియనీర్లలో ఉన్న ఏకైక ఆసియా దేశస్తుడు కావడం గమనార్హం. ఇక గౌతమ్ అదానీ సంపద 7.1 బిలియన్ డాలర్లు ఎగిసి 17 బిలియన్ డాలర్లకు చేరగా, ఈసారి 15 బిలియన్ డాలర్లతో టాప్-100 లిస్టులోకి ఉదయ్ కొటక్ చేరడం విశేషం. అలాగే 10.6 బిలియన్ డాలర్లకు డీ-మార్ట్ దమానీ సంపద ఎగబాకింది.

#### మెరిసిన ఓయో రితేశ్ అగర్వాల్

ఓయో వ్యవస్థాపకుడు రితేశ్ అగర్వాల్ ఈ జాబితాలో చోటు దక్కించుకున్న భారతీయ బిలియనీర్లలో అతి పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. ఈయన వయసు 24 ఏండ్లు. సంపద విలువ 1.1 బిలియన్ డాలర్లు. కాగా, గోద్రేజ్ గ్రూప్‌నకు చెందిన స్మిత వీ కృష్ణ భారతీయ సంపన్న మహిళగా నిలిచారు. ఈమె సంపద విలువ 4.5 బిలియన్ డాలర్లు.

భారతీయ కుబేరుల జాబితా



1 ముకేశ్ అంబానీ, రిలయన్స్ – 67 బిలియన్ డాలర్లు



2 హిందుజా బ్రదర్స్, హిందుజా గ్రూప్ – 27 బిలియన్ డాలర్లు



3 గౌతమ్ అదానీ, అదానీ ఎంటర్‌ప్రైజెస్ – 17 బిలియన్ డాలర్లు



4 శివ్ నాడర్ & కుటుంబం, హెచ్‌సీఎల్ – 17 బిలియన్ డాలర్లు



5 లక్ష్మీ ఎన్ మిట్టల్, అర్సెలార్ మిట్టల్ – 15 బిలియన్ డాలర్లు



6 ఉదయ్ కొటక్, కొటక్ మహీంద్రా – 15 బిలియన్ డాలర్లు



7 అజీం ప్రేమ్‌జీ, విప్రో – 14 బిలియన్ డాలర్లు



8 సైరస్ పూనావాలా, సెరమ్ – 12 బిలియన్ డాలర్లు



9 సైరస్ పల్లోంజి మిస్త్రీ, టాటా సన్స్ – 11 బిలియన్ డాలర్లు

# హైదరాబాద్ భళా

- ప్రాజెక్టుల నిర్మాణంలో దూకుడు
- చిన్న ప్రాజెక్టులు 4.4 ఏండ్లలోనే పూర్తి
- పెద్ద ప్రాజెక్టులకు 5.4 ఏండ్లు
- అనరాక్ ప్రాపర్టీ కన్సల్టెంట్ చైర్మన్ అనూజ్ పూరి వెల్లడి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశీయ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో ఐటీ, వాణిజ్య సముదాయాల గిరాకీలో దూసుకెళ్తున్న హైదరాబాద్ మరో ఘనతను సొంతం చేసుకున్నది. చిన్న ప్రాజెక్టులైనా, పెద్ద నిర్మాణాలైనా.. దేశంలోకెల్లా హైదరాబాద్‌లోనే త్వరగా పూర్తవుతాయని తేలింది. గత దశాబ్దకాలం నుంచి ఇదో ఘనమైన రికార్డు అని అనరాక్ సంస్థ తాజాగా విశ్లేషించింది. 2000 నుంచి 2019 దాకా హైదరాబాద్ నిర్మాణ రంగంలో చిన్న ప్రాజెక్టులు 4.4 ఏండ్లలో పూర్తయితే, బడా నిర్మాణాలు 5.4 ఏండ్లలో పూర్తయ్యాయి. ఇదే సమయంలో చెన్నైలో చిన్నవి 5.5 ఏండ్లలో పూర్తయితే, బడా ప్రాజెక్టులు 5.6 ఏండ్లు పట్టడం గమనార్హం. ఎన్సీఆర్ రీజియన్‌లో బడా ప్రాజెక్టులు పూర్తి చేయడానికి బిల్డర్లు దాదాపు 7.2 ఏండ్లు తీసుకున్నారు. మొత్తానికి దేశంలోని ఏడు నగరాల్లో 100 నుంచి 500 ఫ్లాట్లు గల చిన్న ప్రాజెక్టులు పూర్తి చేయడానికి 5.2 ఏండ్లు పడితే, పెద్ద ప్రాజెక్టుల పూర్తికి 6.5 ఏండ్లు పట్టింది. 'హైదరాబాద్‌లో డెవలపర్లు ఎక్కువగా జాయింట్ డెవలప్‌మెంట్ మీద నిర్మాణాల్ని చేపడతారు. దీంతో స్థల యజమానులకు ఆయా భూమిపై ఎంత షేరు వస్తుందనే విషయం అర్థమవుతుంది' అని అనరాక్ ప్రాపర్టీ కన్సల్టెంట్స్ చైర్మన్ అనూజ్ పూరి తెలిపారు. ఇలాంటి విధానం వల్ల బిల్డర్లకు ఆర్థిక భారం తగ్గుతుందని, ఢిల్లీ-ఎన్సీఆర్ రీజియన్‌లో భూమిని కొనుగోలు చేసి అపార్టుమెంట్లను నిర్మించడం భారమవుతుందని విశ్లేషించారు. ఇక హైదరాబాద్‌లో కొత్తగా ప్రారంభమైన ప్రాజెక్టులను వేళ్ల మీద లెక్కపెట్టవచ్చన్నారు. దీనివల్ల అధిక ఫ్లాట్ల సరఫరా సమస్య భాగ్యనగరంలో లేదని తెలిపారు.

**అపార్టుమెంట్లు ఎప్పుడు పూర్తి?**

| నగరం | చిన్న ప్రాజెక్టులు | పెద్ద ప్రాజెక్టులు |
|---|---|---|
| హైదరాబాద్ | 4.4 ఏండ్లు | 5.4 ఏండ్లు |
| బెంగళూరు | 4.4 ఏండ్లు | 5.5 ఏండ్లు |
| చెన్నై | 5.5 ఏండ్లు | 5.6 ఏండ్లు |
| ఢిల్లీ-ఎన్సీఆర్ | 5.2 ఏండ్లు | 7.2 ఏండ్లు |

#### అనుమతులు వేగంగా..

అనుమతులు వేగంగా మంజూరు చేస్తే నిర్మాణ సంస్థల నిర్మాణ వ్యయం గణనీయంగా తగ్గుతుంది. రాష్ట్రంలో ఏప్రిల్ 2 నుంచి ప్రారంభమయ్యే టీఎస్ బీపాస్ దేశవ్యాప్తంగా అమల్లోకి వస్తే.. ప్రాజెక్టులు సకాలంలో పూర్తవుతాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. 'దక్షిణాది రాష్ర్టాలకు చెందిన డెవలపర్లు ఉత్తమ ప్రమాణాల్ని పాటిస్తారు. సకాలంలో కొనుగోలుదారులకు ఫ్లాట్లను అప్పగిస్తారు' అని అనూజ్ పురి అన్నారు. ప్రస్తుతం ఆఫీసు సముదాయాలకు గిరాకీని విశ్లేషిస్తే.. బెంగళూరును హైదరాబాద్ రెండేండ్లలోపు అధిగమించే అవకాశమున్నది. గతేడాది హైదరాబాద్‌లో కొత్తగా 15,785 ఫ్లాట్లు ప్రారంభమయ్యాయి. ఇది 2018తో పోల్చితే నాలుగు శాతం అధికం.

# లగ్జరీ మార్కెట్లోకి టయోటా




హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనం 'వెల్ఫైర్' విడుదల - ధర రూ.79.50 లక్షలు

'వెల్ఫైర్' కారును మార్కెట్లోకి విడుదల చేస్తున్న టయోటా కిర్లోస్కర్ ప్రతినిధులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** టయోటా కిర్లోస్కర్ కూడా విలాసవంతమైన కార్ల మార్కెట్లోకి ప్రవేశించింది. హైదరాబాద్ వేదికగా తన 'నూతన వెల్ఫైర్' నూతన లగ్జరీ కారైన సెల్ఫ్-చార్జింగ్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనాన్ని దేశీయ మార్కెట్లోకి పరిచయం చేసింది. శక్తివంతమైన డ్రైవింగ్ అనుభవం కలిగిన ఈ కారు తక్కువ ఫ్యూయల్‌తో ఎక్కువ మైలేజీ, తక్కువ కాలుష్యాన్ని వదలనున్న ఈ కారు 2.5 లీటర్ల ఫోర్-సిలిండర్ గ్యాసోలైన్ హైబ్రిడ్ ఇంజిన్‌తో తయారు చేసింది. 86కిలోవాట్ల శక్తిని ఇవ్వనున్న ఈ కారు ధరను రూ.79.50 లక్షలుగా నిర్ణయించింది. ఈ ధర కొన్ని నెలలు మాత్రమే ఉండనున్నదని, ఎప్పటి నుంచి పెంచేది మాత్రం కంపెనీ వర్గాలు వెల్లడించడానికి నిరాకరించాయి.

#### ఈ కారు ప్రత్యేకతలు..

ఏడుగురు కూర్చోవడానికి వీలుండే ఈ లగ్జరీ కారులో ఉండే అన్ని రకాల ఫీచర్స్ ఉన్నాయి. ముఖ్యంగా రెండోపొడువైన సీటు, వన్-టచ్ పవర్ సైడ్ డోర్లు, రెండు సన్‌రూఫ్, ఏడు ఎయిర్‌బ్యాగులు, 3-జోన్ల ఏసీలు, హిల్-స్టార్ట్ అసిస్ట్ కంట్రోల్, 17 జేబీఎల్ స్పీకర్లు, సులువుగా వాహనాన్ని నియంత్రించే వీలుంటుంది. ఈ నూతన మోడల్ లీటర్‌కు 16.35 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది.

#### హైదరాబాద్‌లో అత్యధిక డిమాండ్

ఇప్పటికే ఈ కారుకు 180 బుకింగ్‌లు వచ్చాయని, వీటిలో ఒక హైదరాబాద్ నుంచే 20 శాతం రావడంతో ఈ కారును ఇక్కడి మార్కెట్ నుంచి దేశీయ విపణిలోకి విడుదల చేయాలని నిర్ణయించినట్లు టయోటా కిర్లోస్కర్ మోటార్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నవీన్ సోని తెలిపారు.


**PUBLIC NOTICE**
**DEBTS RECOVERY TRIBUNAL-1**
3rd Floor, Triveni Complex, Abids, Hyderabad- 500 001.

**O.A.No.714 of 2019**

Between
State Bank of India,
Jallaram Branch, Godhavari Khani, Karimnagar District through State Bank of India, SARB-2 Branch, represented by its Chief Manager ... Applicant
And
M/s. Padmavathi Industries rep.by its Managing Director
Erukulla Ramesh, 11-1-188/5A, Incline Colony, Godavari Khani, Karimnagar District and 6 others ...Defendants
To,
Samala Srinivas, S/o Late Kishtaiah
aged 53 yrs, Occ. Business
R/o.Q.No.B/92, 8 Incline Colony, Godavarikhani, Ramagundam Mandalam, Karimnagar district. ...Defendant No.7

Please take Notice that, the Applicant has filed the above O.A.No.714/2019 against defendants 1-7 herein for recovery of Rs.3,60,25,802/- along with future interest and other reliefs. Hence, you are i.e Defendant No.7 hereby summoned to appear before the above said Hon'ble Tribunal in person or through your Advocate on the 04-03-2020 at 10.30 A.M., in default of your appearance on the day afore mentioned, the above case will be heard and determined in your absence.

// BY ORDER OF The HON'BLE TRIBUNAL//

Sd/ A.V.S.RAMAKRISHNA
Counsel for Applicant,
5-34, Durga Nagar,
Dilsukh Nagar, Hyderabad.

**Telangana State Co-operative Marketing Federation Ltd.,**
Email: proc.tsmarkfed2018@gmail.com
Ph.No: 040-2460 7108, Fax: 040-2460 7100.
**TENDER FOR SALE OF AGRICULTURAL COMMODITIES PROCURED BY TS MARKFED & HACA DURING 2018-19**
Tender notification for Online sealed e-tendering in two bid systems (i.e Technical and Financial Bid) for Disposal of Agricultural Commodities (Redgram, Bengal Gram, Jowar, Sun Flower and Black Gram) procured by TS MARKFED & HACA 2018-19 on tender platform http://tender.telangana.gov.in. a) Bid Submission Start date 27.02.2020 from 02:00 PM. b) Bid Submission end date 05.03.2020 up to 02:00 PM. c) Opening of Technical Bid on date 05.03.2020 from 04:00 PM. d) Opening of Financial Bid on date 06.03.2020 at 03:00 PM. For further details please contact. Ph: 7288879806 and 7288879829.
Date: 26.02.2020 Sd/- MANAGING DIRECTOR

తెలంగాణ ప్రభుత్వం
**సాగునీటి పారుదల వలయము, నిజామాబాద్ జిల్లా**
టెండర్ ప్రకటన
టెండర్ నోటీసు నంబర్ 11&12/2019-20 తేది: 22-02-2020 చెక్ డ్యామ్ నిర్మాణ పనులకు గాను **రూ. 3814.26** లక్షలకు లభ్యమగు తేది: 25-02-2020 నుండి 03-03-2020 వరకు టెండర్ ఆహ్వానించనైనది. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.in లో చూడగలరు.
సం/- పర్యవేక్షక అభియంత, సాగునీటి పారుదల వలయము, నిజామాబాద్ జిల్లా
DIPR RO. No. 714-PP/CL/Advt/1/2019-20, Dt: 26/02/2020

తెలంగాణ ప్రభుత్వం
**ఇంజినీర్ ఇన్ చీఫ్ కార్యాలయం, మిషన్ భగీరథ, ఎర్రమంజిల్ కాలనీ, హైదరాబాద్**
T.N. No. AE/DEE/MB-Hyd/Tenders/01/2019-2020, టెండరు ప్రకటన తేది: 25-02-2020
**పని పేరు:** దిగువ సంతకందారు పరిధిలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ (IMT) కాలేజ్‌కు బల్క్ సరఫరా కనెక్షన్ ఏర్పాటు చేయుటకు పైపులైన్ వేయుట. ECV: **రూ. 2.00 కోట్లు**. టెండరు డాక్యుమెంట్ల లభ్యత: 10-03-2020 నుండి 26-03-2020న మ|| 3.00 గం. వరకు. టెండర్ల స్వీకరణ: 26-03-2020న మ|| 3.30 గం. సాంకేతిక బిడ్ తెరచు తేది: 26-03-2020న సా|| 4.00 గం. ఆర్థిక బిడ్ తెరచు తేది:30-03-2020న ఉ|| 11.30 గం. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్: www.telangana.eprocurement.gov.inలో చూడవచ్చును. ఫోన్ నెం: 9100122249, 9100122028.
DIPR RO.No. 2525-DP/CL/ADVT/1/2019-20, Dt: 26-02-2020 సం/- చీఫ్ ఇంజినీర్-VI

తెలంగాణ ప్రభుత్వము
**అటవీ శాఖ-జిల్లా వరంగల్ (పట్టణము)**
ఆర్.సి. నం. 533/2020/ఎస్-3 టెండర్ మరియు వేలం ప్రకటన తేది: 25-02-2020
'ఏది ఎక్కడ ఎలా ఉందో అదే విధంగా' ప్రాతిపదికన సంపూర్ణంగా స్వాధీనం చేసుకొన్న (34) వాహనముల యొక్క విక్రయం కొరకు బిడ్డర్ల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానించనైనది. (34) వాహనముల మరియు వాటి యొక్క ఇనుప తుక్కు వివరాలు: టాటా ఆర్.ఎక్స్ పికప్ 4 నం., మారుతి సుజుకి 800 కార్-1, మహీంద్ర బొలెరో ట్రాలీ-1, డిసియం వ్యాన్లు-2, టాటా సుమో-3, మారుతి ఎస్టీమ్ కారు-1, టాటా ఏస్-4, హోండా షైన్ బైక్-1, మారుతి వ్యాన్-1, లారీ-2, ఆటో ట్రాలీ-1, జీపులు-6, టాటా మ్యాజిక్-2, సుజుకి సమురాయ్ బైక్-1, టాటా కృ కాబ్-1, టాటా గూడ్స్ కారియర్-2, ట్రాక్టర్ విత్ ట్రాలీ-1 నం. పైన తెలిపిన (34) వాహనముల మరియు వాటి యొక్క విక్రయం కొరకు, ఎస్‌బిఐ శాఖ, హన్మకొండ వద్ద చెల్లుబాటయ్యే విధంగా డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్, వరంగల్ (అర్బన్) & జనగాం పేరున డిడి ద్వారా రూ. 500/- (అమ్మకం పన్ను కలిపి) చెల్లింపుపై **తేది: 17-03-2020 సా. 4.00 గం.** వరకు. ఇతర వివరాలు, నిబంధనలు మరియు షరతులు పొందవచ్చును. డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్, వరంగల్ (అర్బన్) & జనగాం పేరున రూ. 5,000/- డిడి రూపంలో బయానాగా ప్రతి టెండర్ ఫారంతో జతపర్చబడి ఉండవలెను. టెండర్ ఫారాలు పొందుటకు ఆఖరు తేది: **17-03-2020 సా. 4.00 గం.కు.** సీల్డ్ టెండర్ ఫారంల స్వీకరణకు **ఆఖరు తేది: 17-03-2020 సా. 5.00 గం.కు**, సీల్డ్ టెండర్లు తెరువబడే **తేది: 18-03-2020 ఉ. 11.00 గం.కు.** ఇతర వివరాలకు పై కార్యాలయంలో సంప్రదించగలరు.
DIPR R.O.No. 2532 DP/CL/Advt/1/2019-20 తేది: 26-02-2020 సం/-జిల్లా అటవీ అధికారి, వరంగల్

**తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్**
(తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ)
**ఇ-ప్రొక్యూర్‌మెంట్-టెండరు ప్రకటన-42**
08 పనుల కొరకు టెండరు నం.లు T222 నుండి 229/2019-20, తేది: 24-02-2020 కొరకు సివిల్ పనులకు టెండర్లు కోరబడుతున్నవి. ''వరుసగా టెండరు నం.లు, జిల్లాలలో గల పనులు & మొత్తం ECV (రూ.లక్షలలో)'' దిగువ విధంగా ఉన్నవి. T223, T224, T225, T226, T227, T228 & T229 -రంగారెడ్డి-7-323.55, T222-హైదరాబాద్-1-171.58: **ఆన్‌లైన్‌లో షెడ్యూల్ లభ్యత: 27-02-2020 నుండి. టెండరు నం.లు** T222, T223, T224, T225, T226, T227, T228 & T229 **కొరకు బిడ్ దాఖలుకు చివరి తేది/సమయం:** 05-03-2020న సా. 5.00 గం (STN). తదుపరి వివరాలను వెబ్‌సైట్: www.tender.telangana.gov.inలో చూడవచ్చును.
DIPR R.O.No. 708 PP/CL/Advt/1/2019-20 తేది: 26-02-2020 సం/- మేనేజింగ్ డైరెక్టర్

నమస్తే తెలంగాణ
WWW.NTNEWS.COM
# జిందగీ
గురువారం 27 ఫిబ్రవరి 2020 /nt.zindagi

ప్రతిరోజూ ఒక స్పెషల్ డేనే.. మనుషులు, జంతువులకే కాదు..
వంటల్లో వాడే ఇంగ్రీడియంట్స్‌కూ రోజులున్నాయి.. వంటల్లో ముఖ్యపాత్ర వహించే పచ్చిమిర్చి కారానికీ ఓ రోజు ఉంది.
అది ఈ రోజే.. 'నేషనల్ చిల్లీ డే'. బాగా కారం తినేవారు వెజ్‌కంటే నాన్‌వెజ్‌కే సై అంటారు..
దీంట్లో మసాలా తక్కువ పడ్డా కారం కవర్ చేస్తుంది.. మామూలు రోజుల్లోనే నాన్‌వెజ్ అంతుచూసే ఆహారప్రియులు..
చిల్లీ డే రోజు మాత్రం ఆగుతారా? ఈ సందర్భంగా ఆ కారపు వంటకాలను మీరే వండేయండి..

# కొంచెం కారంగా..

## చికెన్ మెజిస్టిక్



**కావాల్సినవి :**

**చికెన్ :** 250 గ్రా., **పెరుగు :** 3 టేబుల్ స్పూన్స్, **కొత్తిమీర పొడి :** అర టీస్పూన్, **జీలకర్రపొడి :** అర టీస్పూన్, **పుదీనా :** సరిపడా, **కరివేపాకు :** 2 రెమ్మలు, **పచ్చిమిర్చి :** 4, **అల్లంవెల్లుల్లి పేస్ట్ :** ఒక టీస్పూన్, **గుడ్డు :** ఒకటి, **కార్న్‌ఫ్లోర్ :** ఒక టేబుల్‌స్పూన్ **సోయాసాస్ :** అర టీస్పూన్, **మజ్జిగ :** ఒక కప్పు, **వెల్లుల్లి :** ఒక టేబుల్‌స్పూన్, **పసుపు:** పావు టీస్పూన్, **కారం :** ఒక టీస్పూన్, **కొత్తిమీర :** ఒక టేబుల్‌స్పూన్, **నిమ్మరసం :** ఒక టీస్పూన్, **నూనె :** సరిపడా, **ఉప్పు :** తగినంత.

**తయారీ :**

చికెన్ ముక్కలను శుభ్రం చేసుకోవాలి. మజ్జిగ, ఉప్పు కలిపిన మిశ్రమంలో మూడు గంటలపాటు చికెన్‌ముక్కలను ఉంచాలి. తర్వాత ఒక గిన్నె తీసుకొని అందులో మారినెట్ చేసిన చికెన్ ముక్కలు, కార్న్‌ఫ్లోర్, ఉప్పు, కోడిగుడ్డు సొన, అల్లంవెల్లుల్లి పేస్ట్, కొంచెం నూనె కలిపి రెండు గంటలపాటు ఫ్రిజ్‌లో ఉంచాలి. బయటకు తీసిన తర్వాత ముక్కలు ఉడికే వరకు డీప్‌ఫ్రై చేయాలి. తర్వాత కడాయిలో నూనె వేడిచేసి వెల్లుల్లి ముక్కలు, పచ్చిమిర్చి చీలికలు, తరిగిన కరివేపాకు, పుదీనా, పసుపు, కారం, జీలకర్ర పొడి, కొత్తిమీర పొడి, పెరుగు, ఉప్పు వేసి వేయించాలి. దీనికి సోయాసాస్, ఫ్రై చేసిన చికెన్ స్ట్రిప్స్ వేసి మిక్స్ చేయాలి. చివరిగా కొత్తిమీర, నిమ్మరసంతో గార్నిష్ చేసుకుంటే టేస్టీగా ఉంటుంది.

## రొయ్యల ఫ్రై



**కావాల్సినవి :**

**రొయ్యలు :** 6
**చక్కెర :** ఒక టేబుల్‌స్పూన్
**చిల్లీ సాస్ :** ఒక టేబుల్‌స్పూన్
**కార్న్‌ఫ్లోర్ :** 2 టేబుల్‌స్పూన్స్
**పచ్చిమిర్చి పేస్ట్:** అర టీస్పూన్
**గుడ్డు :** ఒకటి
**మైదాపిండి :** 3 టేబుల్‌స్పూన్స్
**బేకింగ్ పౌడర్ :** ఒక టీస్పూన్
**నూనె :** సరిపడా
**ఉప్పు :** తగినంత.

**తయారీ :**

ముందుగా ఒక గిన్నెలో కోడిగుడ్డు, చక్కెర, ఉప్పు, చిల్లీ సాస్‌తో చల్లని నీరు పోసి బాగా కలుపాలి. ఇందులో కొంచెం నూనె, కార్న్‌ఫ్లోర్, బేకింగ్ పౌడర్, పచ్చిమిర్చి పేస్ట్, మైదాపిండి వేసి పలుచగా కాకుండా కొంచెం గట్టిగా కలిపి 15 నిమిషాలపాటు పక్కన పెట్టేయాలి. తర్వాత రొయ్యలను శుభ్రంగా కడిగి పెట్టుకోవాలి. రొయ్యల తోకలు పట్టుకొని మిశ్రమంలో ముంచి గోల్డెన్‌కలర్ వచ్చేవరకు డీప్‌ఫ్రై చేసుకోవాలి. ఇక అంతే వేడి వేడి ప్రాన్స్‌లోకి గార్లిక్ సాస్ గానీ నచ్చిన సాస్‌తో సర్వ్ చేసుకొని తింటూ ఎంజాయ్ చేయొచ్చు.

## చికెన్ 555



**కావాల్సినవి :**

**చికెన్ :** అర కిలో, **బియ్యంపిండి :** 2 టేబుల్‌స్పూన్స్, **కార్న్‌ఫ్లోర్ :** 2 టేబుల్‌స్పూన్స్, **పచ్చిమిర్చి:** 2, **కారం :** ఒక టేబుల్‌స్పూన్, **కొత్తిమీరపొడి :** ఒక టేబుల్‌స్పూన్, **మిరియాల పొడి :** అర టీస్పూన్, **పసుపు :** ఒక టీస్పూన్, **అల్లం,వెల్లుల్లి పేస్ట్ :** 2 టీస్పూన్స్, **నిమ్మరసం :** ఒక టేబుల్‌స్పూన్, **రెడ్‌కలర్ :** సరిపడా, **నూనె :** సరిపడా, **ఉప్పు :** తగినంత.

**తయారీ :**

ఒక గిన్నె తీసుకొని అందులో బియ్యంపిండి, కార్న్‌ఫ్లోర్, మిరియాల పొడి, పచ్చిమిర్చి ముక్కలు, కారం, కొత్తిమీరపొడి, పసుపు, అల్లంవెల్లుల్లి పేస్ట్, నిమ్మరసం, ఉప్పు వేసి బాగా కలుపాలి. ఈ మిశ్రమం గట్టిగా ఉంటే కొంచెం నీరు పోసి కలుపుకోవాలి. శుభ్రం చేసుకున్న చికెన్ ముక్కలను ఈ మిశ్రమంతో కలిపి 20 నిమిషాల పాటు పక్కన పెట్టుకోవాలి. కావాలంటే కలర్ కలుపుకోవచ్చు. తర్వాత పాన్‌లో నూనె వేడి చేసి చికెన్ డీప్‌ఫ్రై చేసుకోవాలి. ఇక అంతే ఘుమఘుమలాడే చికెన్ 555 రెడీ!

## ఫింగర్ ఫిష్‌ఫ్రై



**కావాల్సినవి :**

**చేపలు :** 50 గ్రా.
**మైదాపిండి :** ఒక కప్పు
**మిరియాల పొడి :** అర టీస్పూన్
**పచ్చిమిర్చి :** 2
**జీలకర్రపొడి :** ఒక టీస్పూన్
**వెల్లుల్లి పేస్ట్ :** అర టీస్పూన్
**నిమ్మరసం :** 2 టేబుల్‌స్పూన్స్
**గుడ్డు :** ఒకటి
**బ్రెడ్‌ముక్కలు :** 2 కప్పులు
**నూనె :** సరిపడా
**ఉప్పు :** తగినంత.

**తయారీ :**

ఒక గిన్నెలో మైదాపిండి, ఉప్పు, మిరియాల పొడి, పచ్చిమిర్చిముక్కలు, జీలకర్ర పొడి, వెల్లుల్లి పేస్ట్, నిమ్మరసం, గుడ్డు, నీరు పోసి మిశ్రమంలా కలుపాలి. ఈ మిశ్రమంలో చేపముక్కలు వేసి 30 నిమిషాల పాటు మ్యారినేట్ చేయాలి. దీన్ని బ్రెడ్‌ముక్కలతో కవర్‌చేసి బ్రౌన్‌కలర్ వచ్చే వరకు ఫ్రై చేయాలి. ఇక అంతే ఫింగర్ ఫిష్ ఫ్రైను ప్లేట్ సర్వ్ చేసుకొని ఆరగించేయొచ్చు!



**సూరజ్ షా**
ఎగ్జిక్యూటివ్ చెఫ్
కిచెన్ 24 రెస్టారెంట్
బంజారాహిల్స్,
హైదరాబాద్,
ఫోన్ నెం. 09515108420

# ఇవాంకా షేర్వాణి.. అనితా డోంగ్రే కుట్టింది!





ఇండియా పర్యటనలో చివరిరోజు రాష్ట్రపతి విందుకు హాజరైన ఇవాంకా ట్రంప్‌నే మీడియా మొత్తం టార్గెట్ చేసింది. కారణం.. ఆమె ధరించిన తెలుపు రంగు భారతీయ షేర్వాణి. ఇవాంకకు రెట్టింపు అందం తీసుకొచ్చిన ఆ సంప్రదాయ షేర్వాణి.. 20 యేండ్ల అనుభవంతో తయారు చేసిందని మీకు తెలుసా? ఆమె.. ప్రముఖుల ఫ్యాషన్ డిజైనర్, మనసున్న మానవతావాది, మహిళా సాధికారతకు కేరాఫ్.. అనితా డోంగ్రే.

అందం, చలాకీతనం కలగలిసిన ఇవాంకా.. ఎక్కడికెళ్లినా ఓ ఫ్యాషన్ ఐకాన్ అనే చెప్పొచ్చు. రాష్ట్రపతి భవన్‌లో పూర్తిగా భారతీయ శైలి కనిపించేలా తెల్లని షేర్వాణీ ధరించిన ఇవాంకా గురించి అంతర్జాతీయ మీడియాలోనూ విపరీతంగా చర్చ జరుగుతున్నది. ఆ షేర్వాణిని తయారు చేసింది ఇండో వెస్టన్ డిజైనర్ అనితా డోంగ్రే. పశ్చిమ బెంగాల్‌లోని ప్రఖ్యాత ముర్షిదాబాద్ పట్టును షెర్వాణీ కోసం ఉపయోగించినట్లు అనిత తెలిపారు. 20 యేండ్ల నాటి పురాతన పద్ధతిలో, చేతితో ఈ పట్టు షేర్వాణిని నేశారు. దీని ధర రూ. 82,400.

**ప్రఖ్యాతిగాంచిన వారికి..**
ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన, ప్రభావశీలురైన మహిళలకు అనిత డోంగ్రే బట్టలను డిజైన్ చేస్తుంటారు. గతంలో ఆమె కేట్ మిడిల్‌టన్‌కు, బెల్జియం రాణి మథిదే, ట్రుడేకు చెందిన సోపి గ్రెగోయిర్‌లకు వస్త్రాలను డిజైన్ చేశారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ సతీమణి హిల్లరీ క్లింటన్‌కు 2018లో భారత్ వచ్చిన సందర్భంగా బట్టలు రూపొందించారు అనిత. కేంబ్రిడ్జి రాణి కేట్ మిడిల్‌టన్‌కు అనిత డిజైన్ చేసిన డ్రెస్ అప్పట్లో సంచలనం సృష్టించింది. కేట్ మిడిల్‌టన్‌కు డిజైన్ చేసినట్లే తమకూ చేయాలని ఆనాడు లెక్కకు మించిన ఆర్డర్లు వచ్చాయి. ఓ క్రమంలో అనిత నిర్వహిస్తున్న వెబ్‌సైట్ హ్యాంగ్ కూడా అయిందట.

**2 కుట్టు మిషన్లతో ప్రారంభమై..**
ముంబైకి చెందిన అనితా డోంగ్రేకు ఫ్యాషన్ అంటే ఎంతో ఇష్టం. 'ఫ్యాషన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ శ్రీమతి నతీబాయ్ దామోదర్ థాకర్‌సే ఉమెన్స్ యూనివర్సిటీ'లో ఫ్యాషన్ డిజైన్ విద్యను అభ్యసించింది. 1995లో తన పేరిట ఓ సొంత ఫ్యాబ్రిక్ కంపెనీని సోదరి మీనా సెహ్రా, సోదరుడు ముకేష్ షావ్లానీలతో కలిసి ఏర్పాటు చేసింది. ప్రారంభంలో ఆమె కేవలం 2 కుట్టుమిషన్‌లతో ఓ చిన్నరూమ్‌లో తన వ్యాపారం చేసేది. కాలక్రమంలో అదే కంపెనీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నది. ప్రస్తుతం నవీ ముంబైలో లక్షా 80 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అనితా డోంగ్రే కంపెనీ కార్యకలాపాలు కొనసాగిస్తున్నది. డిజైన్ ప్యాటర్న్ దగ్గరి నుంచి ఫ్యాబ్రిక్ క్లాత్, దారం వరకూ అన్నింటినీ అనితా డోంగ్రేనే స్వయంగా చూసుకుంటుంది. ఆమె అనుమతి లభించాకే కార్మికులు ఆయా ప్యాటర్న్‌లకు అనుగుణంగా ఫ్యాబ్రిక్‌తో డిజైన్లు వేస్తారు.

**ఫోర్బ్స్‌లో చోటు..**
అనితా డోంగ్రే బాలీవుడ్ ఫ్యాషన్ ప్రపంచంలో హీరో హీరోయిన్లకు ఎప్పటి నుంచో డ్రెస్‌లు డిజైన్లు చేస్తున్నది. అనితకు ఫోర్బ్స్ ఇండియా, ఫార్చ్యూన్ ఇండియా, బిజినెస్ టుడే, బ్లాక్‌బుక్ మ్యాగజైన్లు అత్యంత శక్తివంతమైన 50 మంది మహిళల్లో ఒకరిగా గుర్తింపునిచ్చాయి. #ఐవేర్ హ్యాండ్లూమ్ క్యాంపెయిన్‌లో విస్తృతంగా పాల్గొన్నది.



**అనిత ఫౌండేషన్‌తో ఉపాధి**
అనిత డోంగ్రే కంపెనీలో ప్రస్తుతం 3 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారిలో సింహభాగం మహిళలే. స్త్రీ సాధికారత కోసమే 'అనిత డోంగ్రే ఫౌండేషన్'ను స్థాపించింది. దీని ద్వారా గ్రామీణ మహిళా చేనేత కళాకారులను ప్రోత్సహిస్తున్నది అనిత. హస్తకళా వారసత్వాన్ని కాపాడుతూ.. మహిళలకు ఉపాధి కల్పిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునేలా అండగా ఉంటున్నది. మహారాష్ట్రలో 'కమ్యూనిటీ టైలరింగ్ యూనిట్ల'ను ఏర్పాటు చేసింది. ఇందులో అట్టడుగు వర్గాలకు చెందిన గిరిజన మహిళలకు వస్త్రాల తయారీపై శిక్షణ ఇస్తున్నది. ఇప్పటి వరకు 20వేల మందికి శిక్షణ ఇచ్చింది అనిత ఫౌండేషన్. 'ఎస్ఈడబ్ల్యూఏ ట్రేడ్ ఫెసిలిటేషన్ సెంటర్'కు వైస్ ప్రెసిడెంట్‌గా ఉంటూ మహిళా హస్తకళాకారులు, ఇతర చేనేత కంపెనీల యజమానులు, వాటాదారులను సమన్వయపరుస్తున్నది అనిత డోంగ్రే.

... డప్పు రవి

# పోషకాల బీర.. ఆరోగ్య ధార



**బీరకాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వారంలో కనీసం ఒక్కసారైనా బీరకాయలు ఆహారంలో చేర్చుకోవాలని చెబుతున్నారు న్యూట్రిషియన్లు. బీరకాయను ఆహారంలో తీసుకుంటే కలిగే లాభాలేంటంటే..**

బీరకాయలోని సి విటమిన్, ఐరన్, రిబోఫ్లేవిన్, మెగ్నీషియం, థయామిన్‌తో పాటు అనేక రకాల ఖనిజ లవణాలుంటాయి. బీరకాయలో కొవ్వు, కొలెస్ట్రాల్, కేలరీలు తక్కువ. కాబట్టి బరువు తగ్గాలనుకునేవారికి ఇది మంచి ఆహారం.

సెల్యులోజ్, నీటిశాతం ఎక్కువ కాబట్టి మలబద్ధకం, పైల్స్ సమస్యతో బాధపడేవారికి బీరకాయ తినడం చక్కటి పరిష్కారం. రక్తంలో, మూత్రంలోనూ చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు దీన్ని తీసుకుంటే మంచిది.

బీరకాయల్లో బీటా కెరోటిన్ సమృద్ధిగా ఉంటుంది. ఇది కంటిచూపును మెరుగుపరుస్తుంది. బీరకాయ రక్తాన్ని శుద్ధి చేయడంలోనూ సహాయపడుతుంది. దీనివల్ల మొటిమలు తొలిగిపోతాయి. దేహం నుంచి ఆల్కహాల్ కారక వ్యర్థాలను తొలగించి కాలేయం, గుండె ఆరోగ్యాన్ని ఇది కాపాడుతుంది.

కామెర్ల వ్యాధి సహజంగా తగ్గాలంటే రోజూ ఒక గ్లాస్ బీరకాయ రసం తాగితే చాలు. ఇది వ్యాధి నిరోధక శక్తిని పెంచడంలో సాయపడుతుంది. బీరకాయలో పీచు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి తరచూ తీసుకుంటుంటే మలబద్ధక సమస్య దూరమవుతుంది.

# హార్ట్ ఫర్ ఆర్ట్‌తో అండగా..

**హస్త కళాకారులు పడే వెతలను గ్రహించి, వారిని ఆదుకోవడానికి ఓ మహిళ శ్రీకారం చుట్టింది. అందుకోసం స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసింది. దీని ద్వారా వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నది.**





దేశంలోని హస్తకళాకారులు రూపొందించిన ఉత్పత్తులకు సరైన ఆదరణలేక అంతరించిపోయే పరిస్థితులేర్పడుతున్నాయి. పుణెకు చెందిన పద్మజా జలిహాల్ అనే మహిళ అటువంటి కళాకృతులకు జీవం పోసేందుకు ముందుకు వచ్చింది. సరైన ఆదాయం లేక ఎంతోమంది హస్తకళాకారులు తమ వృత్తిని వదిలేస్తున్నారు. అలా వదిలేయడం వల్ల సాంప్రదాయక కళాకృతులెన్నో కనుమరుగయ్యాయి. ఎంతో అద్భుతమైన చేతివృత్తులకు ఆదరణలేకపోవడానికి కారణాలు తెలుసుకునే ప్రయత్నం చేసింది. అందుకోసం భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో నివసించే హస్తకళాకారుల జీవనస్థితిగతులపై పద్మజా భర్తతో కలిసి అధ్యయనం చేసేందుకు సిద్ధమైంది. అందులో భాగంగా కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ వంటి రాష్ర్టాలను సందర్శించింది. వారు అద్భుతమైన ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. కానీ వాటిని వినియోగదారులకు అందించే మార్కెటింగ్ ప్రక్రియ తెలియక విఫలమవుతున్నారని ఆమె గ్రహించింది. పద్మజా గ్రామీణ హస్తకళాకారుల ఉత్పత్తులను మరింతమందికి అందించేందుకు ' హార్ట్ ఫర్ ఆర్ట్ ' పేరుతో చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసింది. దీని ద్వారా వారిలో నైపుణ్యాన్ని పెంచడానికి అవసరమైన శిక్షణ ఇచ్చింది. వినియోగదారుల అభిరుచికి తగిన విధంగా సరికొత్త ఉత్పత్తులు అందించేలా వారిలో మార్పు తీసుకువచ్చింది. చేతివృత్తుల గొప్పతనాన్ని అందరికీ తెలియజేసేందుకు విస్తృత ప్రచారం కల్పించింది. దీంతో ఆమె ఆశించినట్టుగానే ఆ ఉత్పత్తులకు ఆదరణ లభించింది. ఆమె కల్పించిన ప్రచారంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వారి ఉత్పత్తులకు గుర్తింపు వచ్చింది. దేశ, విదేశాలకు సైతం వీరి కళాకృతుల గురించి తెలిసేలా చేసింది. అలా దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 65 రకాల చేతి వృత్తుల వారికి అండగా నిలుస్తూ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నది పద్మజ.

# పాలు పగలవిక!



- చల్లబడిన చపాతీలపై కొద్దిగా నీళ్లు చల్లి మళ్లీ వేడిచేస్తే మెత్తగా మారుతాయి.
- కుక్కర్ అడుగున పేరుకుపోయినట్లు ఉంటే వంట చేసేముందు ఒక నిమ్మచెక్క కుక్కర్‌లో వేసి ఉడికిస్తే సరి.
- ఇడ్లీ పాత్రలు నల్లబడితే డిటర్జెంట్ పౌడర్, వెనిగర్ కలిపి వాడేసిన టూత్‌బ్రష్‌తో తోమితే ఇడ్లీ పాత్రలు మెరుస్తాయి.
- పాలను కాచేముందు పాలల్లో కొద్దిగా ఇలాయిచీ పొడి వేసి కాస్తే పాలు విరగవు.
- గారెలు మృదువుగా రావడానికి మినుపపప్పులో చారెడు పచ్చ పెసలు కలిపి రుబ్బితే గారెలు మృదువుగా వస్తాయి.
- ఏదైనా కూరలో లేదా చట్నీలో కారం ఎక్కువైతే కాస్తంత నిమ్మ రసం పిండితే సరి.
- పరుపులు, సోఫా స్పాంజీల కింద వేపఆకులు, తులసి ఆకులు పెట్టి ఉంచితే క్రిమికీటకాలు, బ్యాక్టీరియా చేరవు.
- చెవిలో చీమ, లేదా పురుగు చొరబడితే త్వరగా బయటకు రావాలంటే టార్చిలైటు ఆన్ చేసి చెవిలోపలివైపు చూపాలి. క్షణాల్లోనే బయటికివస్తాయి.



# నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్



సినీరంగంలో కొన్ని అనూహ్యమైన కలయికలు ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేస్తుంటాయి. అలాంటి ఓ అరుదైన కాంబినేషన్‌కు రంగం సిద్ధమైంది. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్‌అశ్విన్ ('మహానటి' ఫేమ్) దర్శకత్వంలో ఓ సినిమా రూపొందబోతున్నది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ తెరకెక్కించనుంది. ఈ ప్రొడక్షన్ హౌస్ 50వ ఏట అడుగుపెడుతున్న సందర్భంగా ఈ సినిమాను ప్రకటించారు. 'నాగ్‌అశ్విన్ చెప్పిన కథ నచ్చడంతో ప్రభాస్ ఈ సినిమా చేయడానికి అంగీకరించారు. మునుపెన్నడూ చూడని విధంగా ప్రభాస్‌ను కొత్త పంథాలో ఆవిష్కరించే చిత్రమిది. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడిస్తాం' అని చిత్రబృందం ప్రకటించింది. ప్రస్తుతం ప్రభాస్ 'జాన్' (వర్కింగ్ టైటిల్) చిత్రంలో నటిస్తున్నారు. రాధాకృష్ణ దర్శకుడు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. ఈ సినిమా పూర్తయిన తర్వాతే నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో రూపొందే చిత్రం సెట్స్‌మీదకు వెళ్తుందని సమాచారం. 2018లో సావిత్రి జీవితకథ ఆధారంగా రూపొందించిన 'మహానటి' చిత్రంతో సంచలనం సృష్టించారు దర్శకుడు నాగ్‌అశ్విన్. ఈ సినిమా మూడు జాతీయ అవార్డులను కైవసం చేసుకొని దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రతిభావంతుడైన దర్శకుడిగా నాగ్‌అశ్విన్ విమర్శకుల ప్రశంసలందుకున్నారు.



# నిద్రలేని రాత్రులు గడుపుతున్నా..



శంకర్

కమల్‌హాసన్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఇండియన్-2' సినిమా సెట్‌లో ఇటీవలే క్రేన్ ప్రమాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంపై దర్శకుడు శంకర్ ట్విట్టర్ వేదికగా భావోద్వేగంగా స్పందించారు. తనకే ఆ ప్రమాదం జరిగితే బాగుండేదని వ్యాఖ్యానించారు. 'ఆ ప్రమాదం జరిగిన రోజు నుంచి నిద్రలేని రాత్రుల్ని గడుపుతున్నా. ఆ షాక్ నుంచి నేనింకా కోలుకోలేదు. తీవ్రమైన దుఃఖంతో ఈ మాటల్ని చెబుతున్నా. ప్రమాదంలో నా వ్యక్తిగత సహాయకుడు, అసిస్టెంట్ డైరెక్టర్‌తో పాటు ఇతర సిబ్బందిని కోల్పోవడం బాధించింది. నేను త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాను. ఆ క్రేన్ నా మీద పడ్డా బాగుండేదనిపిస్తోంది. మరణించిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా' అని శంకర్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

# అంతకుమించి

పదేళ్ల ప్రయాణంలో ప్రేమ, కుటుంబ కథాంశాలతో తెలుగు ప్రేక్షకుల్ని అలరించింది సమంత. తొలిసారి ఆమె భయపెట్టడానికి సిద్ధమవుతోంది. సమంత కథానాయికగా అశ్విన్ శరవణన్ ('గేమ్ ఓవర్' ఫేమ్) దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్నది. పూర్తిస్థాయి హారర్ కథాంశంతో సమంత నటిస్తున్న తొలి సినిమా ఇది. హారర్ సినిమాకు మించి ఎన్నో అద్భుతమైన అంశాల సమాహారంగా ఈ సినిమా ఉంటుందని సమంత బుధవారం ట్విట్టర్ ద్వారా పేర్కొన్నది. మహిళా ప్రధాన కథాంశంతో తెరకెక్కనున్న ఈ చిత్రంలో తమిళ నటుడు ప్రసన్న కథానాయకుడిగా నటించనున్నట్లు సమాచారం. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపుదిద్దుకోనున్నట్లు చెబుతున్నారు. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం సమంత తమిళంలో విజయ్‌సేతుపతి, నయనతారలతో కలిసి 'కాతువాకుల రెండు కాదల్' సినిమాలో నటిస్తున్నది. ఈ సినిమాతో పాటు 'ఫ్యామిలీ మ్యాన్-2' వెబ్‌సిరీస్‌తో డిజిటల్ మాధ్యమంలో అరంగేట్రం చేస్తున్నది. మరికొన్ని తెలుగు చిత్రాలు చర్చల దశలో ఉన్నట్లు సమాచారం.



సమంత



# చాణక్యుడిగా అజయ్‌దేవ్‌గన్

మౌర్యుల కాలాన్ని వెండితెరపై ఆవిష్కరించేందుకు బాలీవుడ్ కథానాయకుడు అజయ్‌దేవ్‌గన్ సిద్ధమవుతున్నారు. భారతదేశ చరిత్రలో గొప్ప రాజనీతిజ్ఞుడిగా, అర్థశాస్త్ర పితామహుడిగా పేరుతెచ్చుకున్న చాణక్యుడి పాత్రలో ఆయన కనిపించబోతున్నారు. చారిత్రక కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నీరజ్‌పాండే దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి 'చాణక్య' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు సమాచారం. అక్టోబర్‌లో ఈసినిమా సెట్స్‌పైకి రానున్నది. మౌర్య చక్రవర్తి చంద్రగుప్తుని ఆస్థానంలో ప్రధానమంత్రిగా పనిచేసిన చాణక్యుడి జీవితంలోని కీలక ఘట్టాలను ఆవిష్కరిస్తూ ప్రతీకార నేపథ్యంతో ఈ సినిమా తెరకెక్కనున్నది. అజయ్‌దేవ్‌గన్ ద్విపాత్రాభినయం చేయనున్నట్లు సమాచారం. చారిత్రక కథాంశంతో నేను చేస్తున్న తొలి సినిమా ఇది. పూర్తిస్థాయి పీరియాడిక్ ఫిల్మ్‌గా సరికొత్త అనుభూతిని పంచుతుంది. ప్రేక్షకుల్ని మౌర్యుల కాలంలో తీసుకెళ్తుంది. అని నీరజ్‌పాండే తెలిపారు. అజయ్‌దేవ్‌గన్, నీరజ్‌పాండే కలయికలో తెరకెక్కుతున్న తొలి చిత్రమిది.

# అపరిచితుల ప్రయాణం

శ్రీకాంత్, సుమంత్ అశ్విన్, ఇంద్రజ, ప్రియా వడ్లమాని ప్రధాన పాత్రల్లో గురుప్ప పరమేశ్వర ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కుతున్న తాజా చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. గురుపవన్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. జి.మహేష్ నిర్మిస్తున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం నాయకానాయికలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి ఎన్.బి. బాలసుబ్రహ్మణ్యం క్లాప్‌నివ్వగా, రాంప్రసాద్ కెమెరా స్విఛాన్ చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ 'భిన్న నేపథ్యాలు కలిగిన నలుగురు అపరిచితుల కథ ఇది. వారంతా కలిసి 3450 కిలోమీటర్లు ఎందుకు ప్రయాణం చేశారు? ఈ జర్నీలో వారికి ఎదురైన అనుభవాలేమిటన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. మార్చి 2న తొలి షెడ్యూల్, 22న రెండో షెడ్యూల్‌ను ప్రారంభిస్తాం. హైదరాబాద్, నాగ్‌పూర్, గ్వాలియర్‌లలో చిత్రీకరణ జరుపుతాం' అని తెలిపారు. కలల సాధన కోసం ప్రయత్నించే గృహిణిగా తన పాత్ర ఛాలెంజింగ్‌గా ఉంటుందని ఇంద్రజ చెప్పింది. సుమంత్ అశ్విన్ మాట్లాడుతూ 'శ్రీకాంత్, ఇంద్రజ వంటి అనుభవజ్ఞులతో పనిచేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నా' అని పేర్కొన్నారు. 'జీవితంలో ఏదో ఒకటి సాధించాలని తపనపడే ప్రతి ఒక్కరికి కనెక్ట్ అయ్యే కథ ఇది. సందేశం, వినోదం కలబోతగా మహిళా ప్రధాన కథాంశంతో రూపొందిస్తున్నాం. అన్ని వయసుల వారిని అలరిస్తుంది' అని నిర్మాత అన్నారు.



ఇంద్రజ, సుమంత్‌అశ్విన్, ప్రియా

# ఆడపిల్లలను రక్షించుకోవాలి!



మంగ్లీ

'ఒకప్పుడు సినిమాలు బాగుంటే వంద రోజులు ఆడేవి. ఇప్పుడు వారాలు మాత్రమే ఆడుతున్నాయి. మంచి కథలతో బాగున్న సినిమాల్నే ప్రేక్షకులు ఆదరిస్తున్నారు' అని అన్నారు మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి. గాయని మంగ్లీ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'స్వేచ్ఛ'. రాజు నాయక్ నిర్మాత. కె.పి.ఎన్ చౌహాన్ దర్శకుడు. బంజారా భాషలో రూపొందిన 'గోర్ జీవన్'కు అనువాదమిది. ఈ నెల 28న విడుదలకానుంది. బుధవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక జరిగింది. తీగల కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 'అరచేతిలో సినిమాల్ని చూసే సాంకేతికత అభివృద్ధి చెందింది. కొత్త కథాంశాలతో సినిమాలు చేస్తూ నవతరం ప్రతిభను చాటుకుంటున్నారు' అని అన్నారు. ఆడపిల్లలతో పాటు వృక్షాలను రక్షించాలనే సందేశంతో రూపొందిన చిత్రమిదని నటుడు చమ్మక్‌చంద్ర చెప్పారు. మంగ్లీ మాట్లాడుతూ 'బంజారా భాషలో విడుదలై పెద్ద విజయాన్ని సాధించింది. నా పాత్ర వినూత్నంగా ఉంటుంది' అని చెప్పింది. వృక్షాలు నశిస్తే విశ్వం ఉండదు, ఆడపిల్లలు లేకపోతే సమాజమే ఉండదనే సందేశంతో ఈ సినిమాను రూపొందించామని దర్శకుడు అన్నారు.

# కాలేజీ ప్రేమాయణం



కార్తిక్ ఆనంద్, షాలిని

కార్తిక్ ఆనంద్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'యురేక'. షాలిని, మున్నా, డింపుల్ హయతి కీలక పాత్రల్ని పోషిస్తున్నారు. ప్రశాంత్ తాత నిర్మిస్తున్నారు. మార్చి 13న విడుదలకానుంది. దర్శకుడు మాట్లాడుతూ 'ఇంజినీరింగ్ కాలేజ్ నేపథ్యంలో సాగే చిత్రమిది. ప్రేమ, యాక్షన్ అంశాలతో ఆద్యంతం నవ్విస్తుంది. కాలేజ్ ఫెస్టివల్ కొందరు విద్యార్థుల జీవితాన్ని ఎలాంటి మలుపులు తిప్పిందన్నది ఆసక్తిని పంచుతుంది. ఇటీవల విడుదలచేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్స్, టీజర్‌కు చక్కటి స్పందన లభిస్తున్నది. కొత్తదనాన్ని కోరుకునే ప్రతి ఒక్కరిని ఈ సినిమా మెప్పిస్తుంది' అని అన్నారు. సమీక్ష, బ్రహ్మాజీ, రఘుబాబు, శివన్నారాయణ, వాసు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: నరేష్ కుమరన్, ఛాయాగ్రహణం: ఎన్.బి. విశ్వకాంత్.









నమస్తే తెలంగాణ
# రైతుబడి
కరీంనగర్
గురువారం 27 ఫిబ్రవరి 2020
raithubadi@ntnews.com

చేపల పెంపకం సాగునీటి చెరువులు, కుంటలతో పాటు ప్రత్యేకంగా తవ్వుకున్న చెరువులలో చేపడుతున్నారు. అధిక చేపల దిగుబడుల కోసం రైతులు అనేక రకాలైన కృత్రిమ మేతలను పెంపక సమయంలో చేపలకు అదనపు ఆహారంగా ఇస్తున్నారు. దీంతో దిగుబడులు పెరిగినా చేపల ఉత్పత్తి ఖర్చులు మాత్రం రాను రాను గణనీయంగా పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం సుమారు 60 శాతానికి పైగా ఖర్చులు మేత కోసమే ఖర్చుచేస్తున్నారు. కాబట్టి చేపల మేత గురించి రైతులు పూర్తిగా అవగాహన చేసుకోవాలి. అప్పుడే మేత సక్రమంగా వినియోగించడం ద్వారా లాభాలు సాధించవచ్చని నిపుణులు చెప్తున్నారు. చేపలకు వేసే మేత తయారీ, రకాలు, వాటిలో గల పోషకాలు, వాడే విధానాలను గురించి గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త బూర్గు లవకుమార్ వివరించారు. అదనపు సమాచారం కోసం 9849063796 నంబర్ ద్వారా వారిని సంప్రదించవచ్చు. చేపల మేత గురించి ఆయన తెలిపిన వివరాలు..



బూర్గు లవకుమార్

# చేపలకు పౌష్టిక మేతతోనే మంచి లాభాలు

**మేత ఆవశ్యకత:** పాక్షిక సాంద్రత పద్ధతిలో గానీ, సాంద్ర పద్ధతిలో గానీ చేపల పెంపకం చేపట్టేటప్పుడు నిర్ణీత సమయంలో అవి మార్కెట్ సైజుకు రావాలంటే మంచి నాణ్యతతో కూడిన సమతుల్య మేతలను ఇవ్వాలి. దీనివల్ల చేపల పెరుగుదల బాగుంటుంది. అంతేగాక చేపలు వ్యాధి నిరోధక శక్తి పొంది వ్యాధుల బారిన పడవు. ఆక్వా పరిశ్రమలో చేపలకు మేతగా వ్యవసాయ పరిశ్రమ నుంచి వచ్చిన ఉప ఉత్పత్తులైన తవుడు, నూనె తీసిన తవుడు (డీఓబీ), వేరుశనగ చెక్క పిండి (జీఎన్‌సీ), నువ్వుల చెక్క, మక్కజొన్న వగైరా వంటి వాటిని వినియోగించవచ్చు.

**మేత రకాలు:** ప్రస్తుతం మార్కెట్‌లో రెండు రకాల మేతలు అందుబాటులో ఉన్నాయి. అవి 1.పొడి మేత 2. పెల్లెట్ (కణికలు) మేత.

**పొడి మేత:** చేపల పెంపకంలో తవుడు, నూనె తీసిన వేరుశనగ చెక్క, పత్తి చెక్కలను చేపలకు ఆహారంగా ఇచ్చే పొడి మేతలు. ఇటీవల అక్కడక్కడ రైతులు బీరు ఫ్యాక్టరీల నుంచి వచ్చే మక్కజొన్న పిప్పిని కూడా చేపలకు ఆహారంగా ఇస్తున్నారు.

**పెల్లెట్ మేత:** చేపల పెంపకంలో ఇటీవల కాలంలో పెల్లెట్ మేతలు కూడా వినియోగంలోకి వచ్చాయి. ఇవి వివిధ సైజులలో లభిస్తున్నాయి. అలాగే వివిధ రకాల చేప జాతులకు అవసరమైన మేత రకాలు అందుబాటులో ఉన్నాయి. అందులో నీటిలో తేలే, నీటిలో మునిగే మేత రకాలు కూడా ఉన్నాయి.
చేపల పెంపకంలో పెల్లెట్ (కణికల) మేతలు, పొడిమేతల కంటే ఉన్నతమైనవి. అలాగే ప్రస్తుతం వీటి వినియోగం కూడా క్రమేణా పెరుగుతుంది. పెల్లెట్ మేతలు సరియైన ఎఫ్‌సీఆర్(ఫ్రీడ్ కన్వర్షన్ రేషియో)ను కలిగి ఉండి నీటి కాలుష్యాన్ని కలుగజేయవు. కొనుగోలు చేసిన పెల్లెట్ మేతలోని పోషక పదార్థాల స్థాయిలను మేత సంచులపై క్షుణ్ణం గా పరిశీలించాలి. అవసరమైన మొతాదులోనే వాడాలి.

**కార్ప్ చేపలకు అవసరమైన పోషకాల స్థాయి**

| పోషక పదార్థాలు | అవసరమైన స్థాయి |
|---|---|
| మాంసకృత్తులు (ప్రొటీన్స్) | 25-30 శాతం |
| కొవ్వులు (ఫ్యాట్స్) | 5-8 శాతం |
| పిండి పదార్థాలు (కార్బోహైడ్రేట్స్) | 30-40 శాతం |
| విటమిన్లు, ఖనిజ లవణాలు | కనీసం 1 శాతం |

**ఇవ్వాల్సిన విధానం:** పొడి మేతలను రంధ్రాలు చేసిన సంచులలో తగిన పరిమాణంలో నింపి చెరువు నీటిలో పాతిన కర్రలకు లేదా ఏర్పాటు చేసుకున్న వైరు తాడుకు నిర్ణీత ప్రదేశాలలో అక్కడక్కడ ఎకరా నీటి విస్తీర్ణానికి కనీసం పది వరకు కట్టుకోవాలి. పెల్లెట్ మేతలను నేరుగా చెరువు నీటిపై జల్లుకోవాలి. ప్రతిరోజు ఉదయం 6-7 గంటల సమయంలో చేపలకు మేత ఇవ్వరాదు. ఎందుకంటే చేపలకు ఈ సమయంలో చెరువు నీటిలో ఆక్సిజన్ కనిష్ఠస్థాయిలో ఉంటుంది. ఈ సమయంలో మేత వేస్తే చేపల పెరుగుదలకు ఎక్కువ మేత అవసరం అవుతుంది. కాబట్టి పొద్దుగాల 9 గంటల తర్వాతే అంటే 9-10 గంటల మధ్యన ఇవ్వాలి. దీనివల్ల మేత పూర్తిస్థాయిలో చేపలకు ఉపయోగపడుతుంది.



**వివిధ మేత దినుసులలో ఉండే పోషకాలస్థాయి (శాతంలో)**

| మేత దినుసులు | ప్రొటీన్స్ | ఫ్యాట్స్ | కార్బోహైడ్రేట్స్ | ఖనిజ లవణాలు | ఫైబర్ | తేమ |
|---|---|---|---|---|---|---|
| **1. వృక్ష సంబంధమైనవి** | | | | | | |
| తవుడు | 12.6 | 11.3 | 36.5 | 10.2 | 19.3 | 10.1 |
| నూనె తీసిన తవుడు | 12.1 | 1.3 | 40.4 | 23.8 | 15.2 | 7.2 |
| వేరుశనగ చెక్క | 42.0 | 7.3 | 25.2 | 2.5 | 13.0 | 10.0 |
| సోయా చెక్క | 46.0 | 0.9 | 35.2 | 0.6 | 7.3 | 11.8 |
| పత్తి చెక్క | 37.0 | 6.7 | 5.3 | 1.0 | 13.0 | 7.0 |
| మక్కజొన్న | 9.5 | 4.0 | 67.5 | 1.5 | 4.0 | 13.5 |
| **2. జంతు సంబంధమైనవి** | | | | | | |
| చేప పొడి | 47.8 | 10.3 | 7.0 | 18.3 | 2.0 | 14.0 |
| రొయ్యపొట్టు | 22.5 | 3.6 | 11.0 | 18.6 | 35.6 | 9.0 |
| నత్తగుల్ల మాంసం | 50.7 | 3.9 | 2.2 | 6.9 | 3.9 | 8.1 |

**మేత పరిమాణం:** చేపల సైజును ఉష్ణోగ్రతను అనుసరించి చేపల బరువులో కనీసం 2-10 శాతం వరకు మేతను ఇవ్వాలి. రోజూ చేపలు తీసుకునే ఆహారాన్ని బట్టి ఇవ్వాల్సిన మేత పరిమాణాన్ని పెంచుకోవచ్చు లేదా తగ్గించుకోవచ్చు. చేపలు చిన్నగా ఉన్నప్పుడు ఎక్కువ శాతం అంటే పెరిగే కొద్ది తక్కువ శాతం మేత ఇవ్వాలి. అంటే చేపల శరీర పరిమాణం పెరిగే కొద్ది ఇచ్చే మేత శాతం తగ్గిస్తూ పోవాలి.

**చేపల బరువులో ఇవ్వాల్సిన ఆహార పరిమాణం**

| చేపల శరీర బరువు (గ్రాము) | ఇవ్వాల్సిన ఆహార పరిమాణం |
|---|---|
| 5-20 | 10 శాతం |
| 21-50 | 8 '' |
| 51-100 | 6 '' |
| 101-300 | 5 '' |
| 301-500 | 3 '' |
| 501-1000 | 2 '' |

**మేత తయారీ:** సొంతంగా ముడి పదార్థాలు కొనుగోలు చేసి మేతను తయారుచేసుకునే వారు వీలైనంత వరకు ఎక్కువరకాల మేత దినుసులను కలుపుకోవాలి. దీనిద్వారా చేపలకు అవసరమైన సమతుల ఆహారాన్ని తయారుచేసుకుని చేపలకు ఇవ్వాలి.

**100 కిలోల మేత తయారీలో వాడాల్సిన దినుసులు**

| మేత దినుసు | పరిమాణం |
|---|---|
| నూనె తీసిన తవుడు | 40 కిలోలు |
| వేరుశనగ చెక్క | 40 కిలోలు |
| చేప పొడి (ఫిష్‌మీల్) | 15 కిలోలు |
| మైదా/ గంజిపొడి | 4కిలోలు |
| విటమిన్ /ఖనిజ లవణాల మిశ్రమం | 1 కిలో |
| **మొత్తం** | **100 కిలోలు** |

**ఇతర యాజమాన్యం**

- మేత సంచులను ఆరుబయట ఎండ తగిలేటట్లు నిల్వ ఉంచకూడదు. ఎండలో నిల్వ చేస్తే ఎండ వేడిమికి మేతలో పోషకాలస్థాయి తగ్గిపోతుంది. అలాగే మేత సంచులు తేమ లేకుండా లేదా నీటితో తవ్వకుండా చూసుకోవాలి. నీటిలో తడిసిన అధిక తేమగా ఉన్న మేతలో బూజు అభివృద్ధి చెందుతుంది. ఫలితంగా హానికరమైన అఫ్లోటాక్సిన్లు అభివృద్ధి చెందుతాయి. ఇవి చేపలకు హానికరం.
- బూజు పట్టిన మేతలను ఎట్టి పరిస్థితులలోనూ చేపలకు ఆహారంగా ఇవ్వరాదు. రైతులు మేతలను ఎక్కువరోజులు నిల్వ ఉంచుకోవద్దు. సాధ్యమైనంత వరకు తాజా మేతలనే కొని వాడుకోవాలి. మేత సంచులను గాలి సోకే షెడ్‌లలో నేలపై గాక చెక్క బల్లలపై అరలుగా నిల్వ చేసుకోవాలి. అలాగే 3-4 వరుస మధ్య ఖాళీ ఉంచాలి. ప్రతిరోజు ఇచ్చే పొడి మేత సంచులను శుభ్రపరుచుకుని దండానికి కట్టి ఆరబెట్టాలి. లేకపోతే ఈ సంచులపై ఫంగస్ అభివృద్ధి చెందుతుంది. బాగా ఆరిన తర్వాతనే తిరిగి ఈ సంచులను వాడుకోవాలి.
- చెరువు నీటి రంగు ఎక్కువ ఆకుపచ్చ రంగు లేదా గోధుమ రంగులలో ఉంటే నీటిలో ప్లవకాల (ప్లాంక్టాన్) స్థాయి అధికంగా ఉన్నట్లు ఇలాంటి చెరువులలో వారంకు ఒకసారి మేతను ఇవ్వడం నిలిపివేయాలి. దానివల్ల చేపలు నీటిలోని ప్లవకాలను ఆహారంగా వినియోగించుకుంటాయి. ఫలితంగా కొంత మేత ఖర్చు తగ్గుతుంది.
- చెరువు నీటిలో నాణ్యత సరిగా లేనప్పుడు, ప్రతికూల వాతావరణ పరిస్థితులలో మేత ఇవ్వడానికి తాత్కాలికంగా నిలిపివేయాలి. కనీసం ప్రతి నెలకు ఒకసారి ట్రయిల్ నెటింగ్ చేసి చేపల బరువు, పెరుగుదలను చూసి మేత పరిమాణం నిర్ణయించుకోవాలి.

**నట్టె కోటేశ్వర్‌రావు**, 9989944945
గరిడేపల్లి, సూర్యాపేట జిల్లా

## కూరగాయలలో దిగుబడికి హార్మోన్లు

వేసవిలో సాగు చేసే కూరగాయలలో ప్రధాన సమస్య మొక్కలు ఎదగకపోవడం. పూత, పిందె విపరీతంగా రాలిపోవడం. దీనికితోడు వైరస్ తెగుళ్ల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీంతో దిగుబడి కూడా తగ్గిపోతుంది.ఉష్ణోగ్రత 36 డిగ్రీల సెల్సియస్ మించితే మగపూల సంఖ్య పెరుగుతుంది. సకాలంలో సూక్ష్మధాతు పోషకాలు, వృద్ధి నియంత్రక హార్మోన్లు వాడితే దీన్ని తగ్గించడంతో పాటు దిగుబడులు పెంచుకోవచ్చు.



**పందిరి** కూరగాయలైన బీర, సొర, దోస, కాకర, పొట్ల, గుమ్మడిలలో వేసవిలో అధిక ఉష్ణోగ్రతల వల్ల మగపూలు ఎక్కువై దిగుబడి తగ్గుతుంది.
గింజలు విత్తిన 15 రోజులకు మొక్క 2 నుంచి 4 ఆకుల దశలో ఉన్నప్పుడు లీటరు నీటికి 3-4 గ్రాముల బోరాక్స్ లేదా 10 లీటర్ల నీటిలో 2.5 మి.లీ. ఇథరిల్ కలిపి వారంరోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేస్తే, ఆడపూల సంఖ్య పెరిగి దిగుబడి పెరుగుతుంది.

- ఈ పంటలకు సిఫార్సు చేసిన నత్రజనిని రెండు దఫాలుగా విభజించాలి. రెండోదఫాను పూత, పిందె పడే సమయంలో అంటే 45 రోజుల పంటప్పుడు తప్పనిసరిగా వేయాలి.
- బూడిద గుమ్మడి తీగ పాకే సమయంలో సైకోసిల్ (CCC) 2.5 గ్రాములు లేదా మాలిక్ హైడ్రజైడ్ 0.5 గ్రాములు పదిలీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఫలితంగా దిగుబడి పెరుగుతుంది.
- దొండలో పూత, పిందె సమయంలో నీటి ఎద్దడి ఎదురుకాకుండా చూసుకోవాలి. లేదంటే పూత, పిందె రాలిపోతుంది.
- పుచ్చ, దోసపండు మొక్కలు 2-4 ఆకుల దశలో ఉన్నప్పుడు లీటరు నీటికి 1.5 నుంచి 2 గ్రాముల డైసోడియం ఆర్తోబోరేట్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పూత రావడానికి ముందు చివర్లు తుంచాలి. దీనివల్ల పక్క తీగలు అభివృద్ధి చెంది దిగుబడి పెరుగుతుంది.
- వేసవిలో తోటకూర మొక్కలపై లీటరు నీటికి 20 గ్రాముల యూరియాతో 50 పీపీఎం (లీటరు నీటికి 50 మి. (గ్రా.) జిబ్బరిలిక్ ఆమ్లం కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేస్తే దిగుబడి పెరుగుతుంది. ఆకులు తాజాగా ఉంటాయి.
- పాలకూరలో లీటరు నీటికి 10 గ్రాముల యూరియా కలిపి పిచికారీ చేయాలి.
- కేవలం అధిక వేడిని తట్టుకునే టమాటా రకాలను సాగు చేయాలి. మొక్కలను దగ్గర దగ్గరగా నాటాలి. పూతదశలో ఎకరానికి 400 మి.గ్రా. 2,4-డి మందును 200 లీటర్ల నీటిలో కలిపి లేదా 1 మి.లీ. ప్లానోఫిక్స్ 4 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. దీంతో ఎండకాలంలో పూత, పిందె నిలుస్తుంది. దిగుబడి కూడా తగ్గకుండా ఉంటుంది.
- వీటితోపాటు వైరస్ తెగుళ్లను ఎప్పటికప్పుడు అరికట్టాలి. అలాగే సాధ్యమైనంత వరకు నీడను కల్పిస్తే వేసవిలోనూ మేలైన దిగుబడులు పొందవచ్చు.



**డాక్టర్ అమరపల్లి గీత**
అసిస్టెంట్ ప్రొఫెసర్,
వ్యవసాయ కళాశాల, పాలెం
నాగర్‌కర్నూల్ జిల్లా

కొద్దిమంది రైతులు డ్రిప్ పద్ధతిలో పంటలను సాగు చేస్తుంటారు. డ్రిప్ ద్వారానే ఆయా పంటలకు అవసరమైన ఎరువులు కూడా అందించే అవకాశం ఉన్నది. ఇంకా దీనిపై పూర్తిస్థాయి అవగాహన లేని చాలామంది రైతులు మొక్కల మొదళ్ల వద్ద ఎరువులు వేస్తున్నారు. ఫలితంగా శారీరక శ్రమ బారిన పడుతున్నారు. మరోవైపు మొక్క కూడా మొదళ్ల వద్ద వేసిన ఎరువును సరిగ్గా తీసుకోవడం లేదు.



ఫెర్టిగేషన్ ట్యాంక్

# ఫెర్టిగేషన్‌తో ప్రయోజనాలు

నీటిలో కరిగే రసాయన ఎరువులను నీటితో సహా సరైన మోతాదులో మొక్కకు నేరుగా అందజేయడాన్ని ఫెర్టిగేషన్ అంటారు. ఈ పద్ధతిలో మొక్కలకు అవసరమయ్యే సాగు, నీరు, పోషకాలు మొక్కకు ఏకకాలంలో అందుతాయి. ఫలితంగా పంటల దిగుబడి పెరుగుతుంది. పర్యావరణంపై కూడా ఎలాంటి ప్రభావం ఉండదు.

### లాభాలు

మొక్కలకు నీరు, పోషక పదార్థాలు ఎప్పుడూ అందుబాటులో ఉంటాయి. దీనివల్ల మొక్కల పెరుగుదల బాగా ఉండి నాణ్యమైన పంటలు ఉత్పత్తవుతాయి. ఫెర్టిగేషన్‌ను అన్ని వాతావరణ పరిస్థితుల్లో చేయవచ్చు. తగిన సమయంలో తగిన మోతాదులో ప్రతిసారీ మొక్కల వేర్ల దగ్గర పోషకాలు అందించడం వల్ల ఎరువుల వినియోగం, సామర్థ్యం పెరుగుతుంది. వేసిన ఎరువులు భూమిలో ఇంకిపోకుండా ఉంటాయి. మొక్కల వేర్లకు ఎలాంటి హాని ఉండదు. సమయం కలిసి వస్తుంది. కూలీల ఖర్చు తగ్గుతుంది. నేల గట్టిపడదు.



డ్రిప్ ద్వారా రసాయనాలను పంపించే విధానం

### ఎలాంటి ఎరువులు వాడాలి

నీటిలో పూర్తిగా, త్వరగా కరగాలి. నీటిలో కరగక మిగిలిన అవశేషాల వల్ల డ్రిప్పర్లు మూసుకుపోకుండా ఉండాలి. నీటిలో రసాయన ప్రక్రియ జరుగకుండా ఉండాలి. పోషకాల శాతం వీలైనంత ఎక్కువగా ఉండాలి. ఇలా నీటిలో కరిగే ఎరువులను డ్రిప్ పరికరం వద్ద ఉండే ఫెర్టిగేషన్ ట్యాంక్ ద్వారా ఎరువులను అందించవచ్చు.

### లీకేజీ లేకుండా చూసుకోవాలి

డ్రిప్‌లో లీకేజీలు ఉంటే రసాయనాలు వృథా కావడమే కాకుండా పొలంలో అన్నిచోట్లకు సమానంగా నీరు, రసాయనాలు అందే అవకాశం ఉండదు. ఫెర్టిగేషన్ చేసే రోజుల్లో మొక్కలకు అవసరాన్ని మించి ఎక్కువ నీరు పెట్టొద్దు. ఫెర్టిగేషన్‌లో ఒకటి కంటే ఎక్కువ ఎరువులను ఒకేసారి డ్రిప్‌లోకి పంపించాలనుకుంటే ఆ ఎరువుల మధ్య రసాయనిక చర్యలు జరుగకుండా డ్రిప్ భాగాలను, మొక్కలకు హాని జరుగకుండా చూసుకోవాలి. రెండు లేదా అంతకుమించి ఎరువులను కలుపడం వల్ల వాటిలోని రసాయనాల మధ్య చర్యల ఫలితంగా లవణాలు తయారవుతాయి. ఇలాంటి లవణాలు నీటిలో కరగక డ్రిప్ సిస్టం మూసుకుపోయే ప్రమాదం ఉన్నది. ఇందుకోసం ఫెర్టిగేషన్‌కు వాడే ఎరువులను ముందుగా గ్లాస్‌లోని నీటిలో పోసి రెండు గంటల సమయం వరకు కదలకుండా ఉంచాలి. గ్లాస్‌లో మడ్డి లవణాలు పేరుకుపోకుండా ఉందేమో చూసుకోవాలి. అప్పుడు డ్రిప్‌ద్వారా ఉపయోగిస్తే ఎలాంటి ఇబ్బందులూ ఉండవు.

### ఏ జాగ్రత్తలు తీసుకోవాలి

సాగు భూమిలో వివిధ పోషకాల లభ్యత, మొక్కల దశల వారి అవసరాలు దృష్టిలో ఉంచుకొని సరైన ఫెర్టిగేషన్ ప్రణాళిక రూపొందించుకోవాలి. ఫెర్టిగేషన్ ప్రణాళిక భూసార పరీక్షలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన మోతాదులను పాటించాలి. డ్రిప్ సిస్టమ్‌ను సరైన డిజైన్‌లో అమర్చుకోవాలి. డ్రిప్ ద్వారా నీరు అందించడంలోనూ సమస్యలొస్తాయి.
ఫెర్టిగేషన్ పరికరాల ఇంజక్షన్ రేటు సరిచూసుకొని అనుకున్న విధంగా రసాయనాలు సిస్టమ్‌లోకి వెళ్తున్నాయా లేదా తెలుసుకోవాలి. నీరు పెట్టే మొత్తం సమయంలో చివరి 40-50 నిమిషాల ముందుగా ఫెర్టిగేషన్ పూర్తయ్యేలా చూసుకోవాలి. ఇలా కాకుండా ఫెర్టిగేషన్ తర్వాత చాలా సమయం దాకా నీరు పెడితే రసాయనాలు భూమిలోతుకు పోయి వేర్లకు అందకుండా పోవచ్చు. అలాగే ఫెర్టిగేషన్ తరువాత డ్రిప్ సిస్టమ్‌ను వెంటనే ఆపేస్తే రసాయన ద్రవం సిస్టమ్‌లో ఉండిపోతుంది. డ్రిప్ భాగాలు పాడవుతాయి.

**నగిరి హరీష్**, త్రిపురారం

## హరితగృహాలలో టమాటా సాగులో
# తీసుకోవాల్సిన జాగ్రత్తలు

**హరితగృహాలలో తీగజాతి టమాటా రకాలు సాగుచేయడానికి బాగా అనుకూలంగా ఉంటాయి. ఇది రెండు రకాలు. మొదటిది సాధారణ టమాటా (10 సెం.మీ. వ్యాసం గల కాయలు), రెండవది చెర్రీ టమాటా (1-2 సెం.మీ. వ్యాసం గల కాయలు). చెర్రీ టమాటాను సలాడ్లలో ఎక్కువగా వాడుతారు.**



**వాతావరణం:** వేడిగా (18-30 డిగ్రీల సెల్సియస్), తేమగా ఉండే వాతావరణం టమాటా సాగుకు బాగా అనుకూలంగా ఉంటుంది. మంచును, తక్కువ ఉష్ణోగ్రతలను తట్టుకోలేదు. అయినప్పటికీ దీనిని హరిత గృహాలలో డిసెంబరు - జనవరి మాసాలల్లో ముందస్తు వేసవి కాలపు పంటగా సాగు చేసుకోవచ్చు.

సంవత్సరమంతా దిగుబడి కోసం కొమ్మ కత్తిరింపులు, శిక్షణ తప్పనిసరి. హరిత గృహాలలో సాగుచేసే తీగజాతి సంకర రకాలను నాటినప్పటి నుంచి కొమ్మలు కత్తిరించి శిక్షణ నివ్వాలి. ఈ తీగజాతి రకాలలో ప్రతీ మొక్కకు ఒక ప్రధాన కాండాన్ని ఉంచి మిగతా పక్క కొమ్మలను ఎప్పటికప్పుడు తీసివేయాలి. ఈ పక్క కొమ్మలను లేత దశలో గోరుతో గిచ్చి కూడా తొలిగించవచ్చు. ఎదిగే టమాటా మొక్కలను ప్లాస్టిక్ దారము సహాయంతో మొక్క మొదలు వద్ద కట్టి దారం కొన భాగాన్ని కప్పు కింది భాగములో 10 అడుగుల ఎత్తులో నేలకు సమాంతరంగా ఉండే జి.ఐ వైరుకు వదులుగా కట్టి మొక్కకు ఊతాన్నివ్వాలి.

ఎదిగే మొక్క ప్రధాన కాండాన్ని పక్కనే ఉన్న వదులైన ప్లాస్టిక్ దారానికి సవ్య దిశలో కింది నుంచి పైకి చుడుతూ పోవాలి. ఇలా చుట్టేటప్పుడు ప్లాస్టిక్ దారము పూల, కాయ గుత్తుల మీద, ప్రధాన కాండం కొన భాగం మీదికి రాకుండా కేవలం ఆకు కాడల కింద భాగంలో ఉండేటట్లు చూసుకోవాలి. మొక్కలు 10 అడుగుల ఎత్తులో ఉన్న జి.ఐ వైరుకు చేరుకోగానే తీగ కొనభాగాన్ని కిందికి వదలాలి. ఈ విధంగా మొక్కలను నిర్దిష్ట వ్యవధిలో పక్కకొమ్మలు కత్తిరించి శిక్షణనిస్తే నాటిన తర్వాత 10-11 నెలల వరకు పూత, కాతనిస్తాయి. మొక్క మొదలు భాగంలో ఉన్న కాయలు పరిపక్వదశకు చేరేటప్పుడు దాని కింది భాగంలో ఉండే ముదురు ఆకులను గిచ్చి తొలిగించాలి. కాయ గుత్తిలో ఎక్కువ సంఖ్యలో ఉన్న కాయలను తొలి దశలోనే గమనించి తొలిగించాలి. కాండానికి ఆకు కాడ కలిసే భాగం దగ్గర ఏర్పడిన పిలకలను గిచ్చి వేయాలి. పూగుత్తులలో ఉన్నటువంటి ఆకులను కూడా తొలిగించాలి.

టమాటాలో స్వపరాగ సంపర్కం జరిగినప్పటికీ, హరిత గృహలలో సాగు చేసేటప్పుడు పరాగ సంపర్కం సరిగా జరగకపోవటం వలన పిందె సరిగా కట్టదు. దీనిని అధిగమించడానికి హరిత గృహలలో బంబుల్ ఈగల పెట్టెలను అమర్చాలి. దీనితోపాటుగా వైబ్రేటర్లు పొద్దటి పూట మొక్కలకు తాకించి కూడా పరాగ సంపర్కాన్ని ప్రోత్సహించవచ్చు.

హరితగృహాలలో వేసవిలో ఆకుముడత వైరస్ తెగులు ఎక్కువగా ఉంటుంది. ఈ తెగులు సోకిన ఆకులు ఆకులు పైకి, కిందికి ముడుచుకొని, పసుపుపచ్చ మచ్చలను కలిగి ఉంటాయి. నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 5 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తుకోవాలి. వైరస్ తెగులు ఆశించిన మొక్కలను పెరికి నాశనం చేయాలి. రసం పీల్చే పేనుబంక, తామర పురుగులను ఎప్పటికప్పుడు నివారించాలి.
**మచ్చల మాడు వైరస్ తెగులు:** చిగురుటాకుల పైభాగంలో గోధుమ వర్ణంతో కూడిన పసుపు రంగు మచ్చలు ఏర్పడి ఆకులు కిందివైపున వంగిపోతాయి. వైరస్ తెగులు ఆశించిన మొక్కలను పెరికి నాశనం చేయాలి. రసం పీల్చే పేనుబంక, తామర పురుగులను ఎప్పటికప్పుడు నివారించాలి.

**రైతుబడి డెస్క్**

## రైతుబడికి ఆహ్వానం

రచనలు పంపవలసిన చిరునామా:
**8-2-603/1/7,8,9, కృష్ణాపురం,
రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.**
raithubadi@ntdaily.news, Fax-040-23291118

నమస్తే తెలంగాణ
# ఆట
12
[ కరీంనగర్ ]
గురువారం 27 ఫిబ్రవరి 2020
WWW.NTNEWS.COM





పూనమ్

# హ్యాట్రిక్‌పై గురి

## నేడు న్యూజిలాండ్‌తో భారత్ ఢీ

## జోరుమీదున్న హర్మన్‌సేన.. మహిళల టీ20 ప్రపంచకప్

**పొట్టి ప్రపంచకప్‌లో అంచనాలకు తగ్గట్లు రాణిస్తున్న భారత అమ్మాయిలు.. న్యూజిలాండ్‌తో అమీతుమీ తేల్చుకునేందుకు రెడీ అయ్యారు. పటిష్ఠ ఆస్ట్రేలియాకు చుక్కలు చూపిన హర్మన్ గ్యాంగ్.. బంగ్లాపై అలవోక విజయంతో మంచి దూకుడు మీదుంది. ఇదే జోరులో బ్లాక్‌క్యాప్స్‌ను పడగొట్టి సగర్వంగా సెమీఫైనల్లో అడుగుపెట్టాలని టీమ్ఇండియా యోచిస్తుంటే.. ఈ ఫార్మాట్‌లో తమ ప్రతాపమేంటో చాటిచెప్పి గ్రూప్‌లో అగ్రస్థానానికి చేరాలని కివీస్ కృతనిశ్చయంతో ఉంది. ఇరు జట్లు సమ ఉజ్జీలుగా కనిపిస్తుండటంతో పోరు హోరాహోరీగా సాగడం ఖాయంగా కనిపిస్తున్నది.**

**మెల్‌బోర్న్:** మహిళల టీ20 ప్రపంచకప్‌లో అప్రతిహత విజయాలతో దూసుకెళ్తున్న భారత అమ్మాయిలు మరో పోరుకు సిద్ధమయ్యారు. తొలి మ్యాచ్ లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాను చిత్తు చేసిన హర్మన్‌ప్రీత్ బృందం.. మలి పోరులో బంగ్లాదేశ్‌ను మట్టికరిపించి ముచ్చటగా మూడో మ్యాచ్‌లో పటిష్ఠ న్యూజిలాండ్‌తో పోటీకి రెడీ అయింది. గ్రూప్-ఏలో భాగంగా గురువారం ఇక్కడి జంక్షన్ ఓవెల్ మైదానంలో ఇరు జట్ల మధ్య కీలక మ్యాచ్ జరుగనుంది. ఈ మ్యాచ్‌లో నెగ్గితే భారత్ సెమీస్ బెర్త్ ఖరారు చేసుకుంటుంది. గత రెండు మ్యాచ్‌ల్లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన అమ్మాయిలు అదే జోరు కొనసాగించి హ్యాట్రిక్ విజయంతో నాకౌట్‌లో అడుగుపెట్టాలని తహతహలాడుతుంటే.. భారత్‌ను అడ్డుకొని పట్టికలో అగ్రస్థానానికి చేరాలని న్యూజిలాండ్ ఉవ్విళ్లూరుతున్నది.

### టాపార్డర్‌పైనే భారం

తొలి రెండు మ్యాచ్‌ల్లో మెరుపులు మెరిపించిన పదహారేండ్ల యంగ్‌గన్ షఫాలీ వర్మపై భారత యాజమాన్యం గంపెడాశలు పెట్టుకుంది. పవర్‌ప్లేలో ఆకాశమే హద్దుగా చెలరేగుతున్న షఫాలీ.. ప్రత్యర్థి బౌలర్లను ఒత్తిడిలో పడేస్తున్నది. డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్‌ను తలపించేలా వీర విజృంభణ చేస్తున్న షఫాలీ మరోసారి మెరుగైన ఆరంభాన్నిస్తే.. టీమ్ఇండియాకు తిరుగుండదు. అనారోగ్యం కారణంగా బంగ్లాతో మ్యాచ్‌కు దూరమైన స్మృతి మంధాన కీలక పోరుకు అందుబాటులోకి రావడం భారత్‌కు కలిసొచ్చే అంశం. వీరిద్దరు ఇచ్చే ఆరంభాలపైనే మ్యాచ్‌లో టీమ్ఇండియా విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. వన్‌డౌన్‌లో జెమీమా రోడ్రిగ్స్ కూడా మంచి టచ్‌లో ఉంది. దీప్తి శర్మ, వేద కృష్ణమూర్తి ఒక్కో మ్యాచ్‌లో రాణించారు. ఎటొచ్చి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ వైఫల్యమే టీమ్ఇండియాను కలవర పెడుతున్నది. హార్డ్ హిట్టర్‌గా మంచి గుర్తింపు ఉన్న హర్మన్ ఈ టోర్నీలో ఇప్పటి వరకు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేదు.

### అచ్చం నాలాగే



గత రెండు మూడేండ్లుగా జట్టు కోసం నేను ఏం చేశానో.. ఇప్పుడు షఫాలీ అదే చేస్తున్నది. పవర్‌ప్లేలో భారీగా పరుగులు సాధించి ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచేందుకు ప్రయత్నిస్తున్నది. ధాటిగా ఆడుతూ బౌలర్ల లయ దెబ్బ తీస్తున్నది. దీంతో జట్టుకు మరింత సమతూకం చేరినట్లైంది. ఆమెతో కలిసి బ్యాటింగ్ చేయడాన్ని ఆస్వాదిస్తా. న్యూజిలాండ్‌తో పోరు గురించి ఎలాంటి ఆందోళన లేదు. గత రెండు మ్యాచ్‌ల్లోలానే ధాటిగా ఆడేందుకు ప్రయత్నిస్తాం.

**- స్మృతి మంధాన**

### పూనమ్ మరోసారి తిప్పేస్తే..

టోర్నీ ఆరంభం నుంచి తన అద్భుత బౌలింగ్‌తో కట్టిపడేస్తున్న పూనమ్ యాదవ్ మరోసారి విజృంభిస్తే.. టీమ్ఇండియా విజయం నల్లేరుపై నడకే. తనకే సొంతమైన ఫ్లైటెడ్ బంతులతో ప్రత్యర్థిని ముప్పుతిప్పలు పెడుతున్న పూనమ్.. కివీస్‌పై కూడా చెలరేగాలని టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తున్నది. పేస్ విభాగంలో శిఖ జట్టుకు చక్కటి ఆరంభాలను ఇస్తున్నది. గత మ్యాచ్‌లో హైదరాబాదీ పేసర్ అరుంధతి రెడ్డి కూడా రాణించడం సానుకూలాంశం.

### కివీస్‌దే పైచేయి

గతేడాది టీమ్ఇండియాతో జరిగిన పొట్టి సిరీస్‌ను న్యూజిలాండ్ 3-0తో సొంతం చేసుకున్నది. అయితే 2018 టీ20 ప్రపంచకప్‌లో కివీస్ అమ్మాయిలను ఓడించడం భారత్‌కు సానుకూలాంశం. డివైన్, సూజీ బేట్స్, అమెలియా కెర్, తహూహు రూపంలో కివీస్ జట్టులో అత్యుత్తమ ప్లేయర్లు ఉన్నారు.

| నేటి మ్యాచ్‌లు | |
|---|---|
| భారత్ X న్యూజిలాండ్ | |
| వేదిక: మెల్‌బోర్న్ | ఉ. 9.30 |
| ఆస్ట్రేలియా X బంగ్లాదేశ్ | |
| వేదిక: కాన్‌బెర్రా | మ. 1.30 |
| స్టార్ స్పోర్ట్స్‌లో | |

## హీతెర్ నైట్ అజేయ సెంచరీ



హీతెర్ నైట్ (108)

**కాన్‌బెర్రా:** కెప్టెన్ హీతెర్ నైట్ (66 బంతుల్లో 108 నాటౌట్; 13 ఫోర్లు, 4 సిక్సర్లు) అజేయ శతకంతో విజృంభించడంతో థాయ్‌లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 98 పరుగుల తేడాతో విజయపతాక ఎగురవేసింది. గ్రూప్-బిలో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ జట్టు నిర్ణీత ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. స్కీవర్ (59; 8 ఫోర్లు)తో కలిసి నైట్ చెలరేగిపోయింది. వీరిద్దరూ అభేద్యమైన మూడో వికెట్‌కు 169 పరుగులు జోడించారు. మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఏ వికెట్‌కైనా ఇదే అత్యధిక భాగస్వామ్యం కావడం విశేషం. అనంతరం లక్ష్యఛేదనలో థాయ్‌లాండ్ 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 78 పరుగులు చేసింది. మరో మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై పాకిస్థాన్ జట్టు 8 వికెట్ల తేడాతో గెలుపొందింది.

# ఆటకు అందం వీడ్కోలు





## మారియా షరపోవా సంచలన నిర్ణయం

## టెన్నిస్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన రష్యా సుందరి

**ఆటకు ఆట. అందానికి అందం.** భువి నుంచి దివికి దిగివచ్చిన దేవకన్యలా ముట్టుకుంటే కందిపోయే పాలరాతి శిల్పం లాంటి మేను.అందంతోనే కాదు తనదైన ఆటతీరుతో టెన్నిస్ ప్రపంచాన్ని ఓ ఊపు ఊపిన రష్యా భామ మరియా షరపోవా అభిమానులను ఆశ్చర్యంలో పడేసింది. అవును తానేంతో అభిమానించే టెన్నిస్‌కు అనూహ్యంగా వీడ్కోలు పలికింది. టీనేజ్‌లోనే సంచలనాలు సృష్టించిన షరపోవా టెన్నిస్‌కు ఇక గుడ్‌బై అంటూ సంక్షిప్త సందేశంతో తన నిర్ణయాన్ని ప్రకటించింది. కెరీర్‌లో డోపింగ్ మరకగా నిలిచినా..అందమైన ఆటతో కోట్లాది మంది హృదయాలను మరియా కొల్లగొట్టింది. కోర్టులో దిక్కులు పిక్కటిల్లేలా అరిచే ఈ అందాల భామ ఐదు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లకు తోడు మరెన్నో ట్రోఫీలు సొంతం చేసుకుంది. టెన్నిస్‌లో తనకంటూ ప్రత్యేక పేజీని లిఖించుకున్న షరపోవా ఆటపై చెరగని ముద్రవేసిందనే చెప్పాలి.

**ప్యారిస్:** టెన్నిస్ స్టార్ మరియా షరపోవా అనూహ్య నిర్ణయం తీసుకుంది. ఆటకు వీడ్కోలు ప్రకటించి అభిమానులను విస్మయంలో ముంచెత్తింది. అద్వితీయమైన ఆటతో ఐదు గ్రాండ్‌స్లామ్‌లు ఖాతాలో వేసుకున్న ఈ 32 ఏండ్ల రష్యా భామ.. తనకు ఇష్టమైన ఆట నుంచి తప్పుకుంటున్నట్లు బుధవారం స్పష్టంచేసింది. 'టెన్నిస్.. నేను వీడ్కోలు చెబుతున్నా. 28 ఏండ్లు, ఐదు గ్రాండ్‌స్లామ్‌ల తర్వాత, మరో శిఖరాన్ని అధిరోహించేందుకు సిద్ధమయ్యా. కానీ ఇది చాలా భిన్నమైనది' అని వానిటీ ఫెయిర్ మ్యాగ్‌జైన్ ద్వారా వెల్లడించింది. నాలుగేండ్ల వయసులోనే రాకెట్ పట్టిన మరియా.. కెరీర్‌లో ఎన్నో ఉత్థాన పతనాలు చవిచూసింది. పద్దెనిమిదేండ్ల ప్రాయంలోనే ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ అధిరోహించిన షరపోవా.. నిషేధిత ఉత్ప్రేరకాలు వాడి డోపీగా తేలడంతో బ్యాన్ ఎదుర్కొంది. ఇలా ఎన్నో మలుపులు తిరిగిన ఆమె కెరీర్‌కు భుజం గాయం రూపంలో గట్టి ఎదురుదెబ్బ పడింది. నిషేధం పూర్తి చేసుకొని పునరాగమనం చేసినా.. ఫిట్‌నెస్ సమస్యలతో పాటు, భుజం గాయం తిరగబెట్టడంతో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయింది. ఇటీవల వింబుల్డన్, యూఎస్ ఓపెన్, ఆస్ట్రేలియా ఓపెన్‌లలో మరియా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. దీంతో ఆటకు ఫుల్‌స్టాప్ పెట్టాలనుకున్న ఈ ఆరడుగుల అందగత్తె.. 373వ ర్యాంక్‌తో కెరీర్‌ను ముగించింది.

**పూర్తి పేరు**
మరియా యురివ్నే షరపోవా
**ఎత్తు**
ఆరడగుల రెండు అంగుళాలు
**కెరీర్ ప్రారంభం**
2001 ఏప్రిల్
**గ్రాండ్‌స్లామ్ టైటిల్స్:** 5
ఆస్ట్రేలియా ఓపెన్ (2008)
వింబుల్డన్ (2004)
యూఎస్ ఓపెన్ (2006)
ఫ్రెంచ్ ఓపెన్ (2012, 2014)
**కెరీర్ టైటిల్స్**
36 డబ్ల్యూటీఏ
**అత్యుత్తమ ర్యాంక్**
1 (2005 ఆగస్టు)
**ఒలింపిక్స్ మెడల్**
రజతం (2012, లండన్)

"నేనెప్పుడూ గతం గురించి పెద్దగా ఆలోచించలేదు.. భవిష్యత్తు గురించి బెంగ చెందలేదు. ఇదే నా విజయ రహస్యం అనుకుంటా. నా జీవితాన్ని టెన్నిస్‌కు అంకితమివ్వడంతో.. టెన్నిస్ నాకు జీవితాన్నించి. నిద్ర లేవగానే కుడికాలి కంటే ముందు ఎడమ కాలి షూ లేస్‌లు కట్టుకోవడంతో నా దైనందిన జీవితం ప్రారంభమయ్యేది. ప్రాక్టీస్ కోర్టు బెంచ్‌పై మా నాన్నతో కలిసి కూర్చునే ఆ మధురమైన క్షణాలు ఇక కోల్పోతా. ఒక్కసారి వెనుదిరిగి చూసుకుంటే.. టెన్నిస్ నా జీవితంలో ఓ పర్వతంలా కనిపిస్తున్నది. ఆ మార్గంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురయ్యాయి. కానీ శిఖరాన్ని అధిరోహించాక వచ్చిన అనుభూతి మాత్రం అనిర్వచనీయం.

**- షరపోవా**

# 62 ఏండ్లలో అదరహో



**చికాగో:** సాధించాలన్న కసి ఉంటే వయసు అడ్డంకి కాదని నిరూపించాడు అమెరికాకు చెందిన జార్జ్ హుడ్. అవును ఆరు పదుల వయసులో ఎవరికి సాధ్యం కాని రికార్డును సొంతం చేసుకున్నాడు. అమెరికా మాజీ మెరైన్ సైనికుడు అయిన 62 ఏండ్ల జార్జ్ సరికొత్త గిన్నిస్ ప్రపంచ రికార్డు తన పేరిట లిఖించుకున్నాడు. చికాగోలో జరిగిన ఈ ఫీట్‌లో ఏకంగా ఎనిమిది గంటల 15నిమిషాల 15 సెకన్ల పాటు మోచేతులు, మునివేళ్లపై ఉండి ఔరా అనిపించాడు. దీని ద్వారా 2016లో చైనాలో మావో వీడాంగ్(ఎనిమిది గంటల ఒక నిమిషం) పేరు మీదున్న రికార్డును జార్జ్ తాజాగా తుడిచిపెట్టాడు. అయితే ఈ అద్భుత ఫీట్ వెనుక జార్జ్ వెలకట్టలేని శ్రమ దాగుంది. ప్రపంచ రికార్డును నెలకొల్పాలనే అకుంఠిత దీక్షతో జార్జ్ ఏకంగా 2,100 గంటల పాటు ప్లాంకింగ్(మోచేతులు, మునివేళ్లపై బ్యాలెన్స్ చేయడం)ను ప్రాక్టీస్ చేశాడు. రికార్డు నమోదు తర్వాత ప్లాంకింగ్‌కు తాను రిటైర్మెంట్ పలుకుతున్నట్లు ప్రకటించాడు. 2011లో తొలిసారి ప్లాంకింగ్‌ను ఎంచుకున్న ఈ అమెరికా వృద్ధ సంచలనం ప్రపంచ రికార్డు ఫీట్‌కు ముందు ప్రతి రోజు ఏడు గంటల పాటు తీవ్రంగా ప్రాక్టీస్ చేశాడు. 'గత కొన్నేండ్లుగా నేను చేస్తున్న శ్రమకు తగిన ఫలితం దక్కింది. నిర్విరామంగా కదలకుండా ఉండటమంటే మామూలు విషయం కాదు. దీనికి చాలా కఠోర శ్రమ కావాలి. వాన్ హలెన్, మోట్లె క్రూ, డీప్ పర్పుల్ లాంటి రాక్ అండ్ రోల్ వీడియోలు నన్ను ప్రభావితం చేశాయి' అని జార్జ్ అన్నాడు.

# ఒక్క సిక్స్ లేకుండానే..

## వన్డేలో అత్యధిక స్కోరు చేసిన శ్రీలంక



అవిష్కా ఫెర్నాండో (127)

**కొలంబో:** వన్డే క్రికెట్‌లో శ్రీలంక జట్టు కొత్త రికార్డు నెలకొల్పింది. ఇన్నింగ్స్‌లో ఒక్క సిక్సర్ కూడా లేకుండానే అత్యధిక స్కోరు నమోదు చేసిన జట్టుగా చరిత్ర పుటల్లోకెక్కింది. ఓపెనర్ అవిష్కా ఫెర్నాండో (127; 10 ఫోర్లు), కుషాల్ మెండిస్ (119; 12 ఫోర్లు) రికార్డు భాగస్వామ్యంతో చెలరేగడంతో.. వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో శ్రీలంక 161 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇప్పటికే తొలి మ్యాచ్‌లో గెలుపొందిన లంక.. ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. బుధవారం జరిగిన పోరులో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లకు 345 పరుగులు చేసింది. కెప్టెన్ కరుణరత్నె (1), కుషాల్ పెరీరా (0) విఫలమవడంతో 9/2తో కష్టాల్లో పడ్డ లంకను ఫెర్నాండో, మెండిస్ ఆదుకున్నారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు రికార్డు స్థాయిలో 239 పరుగులు జతచేశారు. లంక తరపున వన్డేల్లో మూడో వికెట్‌కు ఇదే అత్యధిక భాగస్వామ్యం కావడం విశేషం. లంక ఇన్నింగ్స్‌లో మొత్తం 33 బౌండ్రీలు నమోదు కాగా.. అందులో ఒక్క సిక్సర్ కూడా లేకపోవడం విశేషం. విండీస్ బౌలర్లలో కాట్రెల్‌కు 4, జోసెఫ్‌కు మూడు వికెట్లు దక్కాయి. అనంతరం టార్గెట్ ఛేజింగ్‌లో బ్యాట్స్‌మెన్ ఏమాత్రం ప్రభావం చూపలేకపోవడంతో విండీస్ 39.1 ఓవర్లలో 184 పరుగులకు ఆలౌటైంది. షై హోప్ (51) ఒక్కడే హాఫ్‌సెంచరీ చేశాడు. లంక బౌలర్లలో సందకన్, హసరంగ చెరో మూడు వికెట్లు పడగొట్టారు.



సత్య నాదెళ్ల

## నాడు సచిన్.. నేడు కోహ్లీ

**న్యూఢిల్లీ:** క్రికెట్ అంటే సగటు భారత అభిమానిలాగే మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల తన ఇష్టాన్ని చాటుకున్నాడు. అయితే క్రికెటర్ల అందరిలో ఎవరు ఇష్టమనే విషయంలో మాత్రం సత్య ఒకింత తడబడ్డాడనే చెప్పాలి. ఢిల్లీలో జరిగిన యంగ్ ఇన్నోవేటర్స్ సమ్మిట్‌లో సత్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ ఇండియా అధ్యక్షుడు అనంత్ మహేశ్వరి అడిగిన ప్రశ్నకు ఆసక్తిగా బదులిచ్చాడు. సచిన్, కోహ్లీలో ఎవరు ఇష్టమన్న ప్రశ్నకు సత్య స్పందిస్తూ 'మతాన్ని ఎంచుకోవడం లాగా ఉంది. నిన్న సచిన్ ఇష్టమైతే..నేడు కోహ్లీ' అని సమాధానమిచ్చాడు.

## సాక్షి మాలిక్ ఒలింపిక్స్ ఆశలు గల్లంతు!

### సోనమ్ చేతిలో అనూహ్య ఓటమి



**లక్నో:** భారత యువ రెజ్లర్ సాక్షి మాలిక్ టోక్యో ఒలింపిక్స్ ఆశలు దాదాపు గల్లంతయ్యాయి. బుధవారం జరిగిన 62 కిలోల తుది పోరులో 18 ఏండ్ల సోనమ్ మాలిక్.. సాక్షిపై అనూహ్య విజయం సొంతం చేసుకుంది. ఒక దశలో 1-2తో వెనుకంజలో ఉన్నా.. బౌట్ పూర్తి కావడానికి మరో నిమిషముందనగా ఒక్కసారిగా పుంజుకున్న సోనమ్..సాక్షిని మట్టికరిపించింది. అంతు ముందు జరిగిన వేర్వేరు బౌట్లలో సరితా మోర్‌పై 3-1తో ఓడించడంతో పాటు రాధికపై అలవోకగా గెలిచింది. సోనమ్.. వచ్చే నెల 27 నుంచి మొదలయ్యే ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్ టోర్నీకి ఎంపికైంది. ఇందులో ఫైనల్ చేరిన వారు టోక్యో ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధిస్తారు.

## హ్యాండ్‌బాల్ టోర్నీ షురూ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** పదకొండు రాష్ర్టాల జట్లు పాల్గొంటున్న ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ టోర్నీ ఘనంగా ప్రారంభమైంది. గచ్చిబౌలి స్టేడియం వేదికగా మూడు రోజుల పాటు జరుగున్న పోటీలను బుధవారం జాతీయ హ్యాండ్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు అరిశనపల్లి జగన్‌మోహన్‌రావు ప్రారంభించారు. ఈ టోర్నీలో తెలంగాణతో పాటు హర్యానా, గుజరాత్, కేరళ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, త్రిపుర, బీహార్, హిమాచల్ ప్రదేశ్, అండమాన్ నికోబార్ జట్లు పాల్గొంటున్నాయి. టోర్నీ ప్రారంభ కార్యక్రమంలో సాట్స్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, సాయ్ హాస్టల్ డైరెక్టర్ శ్రీలత రెడ్డి, తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్ ఇండియన్ టీమ్ హ్యాండ్ బాల్ కోచ్ రవి కుమార్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రిఫరీ బోర్డు కన్వినర్ ఇంద్రసేనరెడ్డి, గోకుల్, తదితరులు పాల్గొన్నారు.

## టాప్ చేజారే..



**దుబాయ్:** న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో పెద్దగా ప్రభావం చూపలేకపోయిన టీమ్ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కోల్పోయాడు. హామిల్టన్ టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ తక్కువ స్కోరుకే వెనుదిరిగిన విరాట్ 906 పాయింట్లతో పట్టికలో రెండో స్థానానికి చేరాడు. చాన్నాళ్ల తర్వాత ఆసీస్ మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ (911) తిరిగి టాప్ ప్లేస్ దక్కించుకున్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో విలియమ్సన్ (3) ఓ స్థానం మెరుగుపరుచుకోగా.. ఆసీస్ నయా సంచలనం మార్నస్ లబుషేన్ ఓ స్థానం కోల్పోయి 4వ ర్యాంక్‌కు చేరాడు. కోహ్లీతో పాటు భారత్ నుంచి అజింక్యా రహానే (8), చతేశ్వర్ పుజారా (9), మయాంక్ అగర్వాల్ (10) టాప్-10లో చోటు దక్కించుకున్నారు.

# టోక్యో ఈవెంట్స్‌పై కరోనా ఎఫెక్ట్

## రెండు వారాల పాటు టోర్నీలు వాయిదా

**టోక్యో:** ప్రపంచ దేశాలను వణికిస్తున్న కరోనా వైరస్ ప్రభావం ప్రతిష్ఠాత్మక టోక్యో (2020) ఒలింపిక్స్‌పై కూడా కనిపిస్తున్నది. ఈశాన్య దేశాల్లో ఈ మహమ్మారి విజృంభిస్తుండటంతో ఒలింపిక్స్ నిర్వాహకులు రెండు వారాల పాటు తమ కార్యక్రమాలను వాయిదా వేశారు. ఈ మేరకు బుధవారం జపాన్ ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేసింది. మెగాటోర్నీకి ముందు జరగాల్సిన అనేక ఈవెంట్‌లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపింది. అయితే భయపడాల్సిన అవసరమేమీలేదని.. విశ్వక్రీడలకు ఇంకా చాలా సమయం ఉందని ప్రస్తుతానికి షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు ఉండవని స్పష్టం చేసింది. 'ఒలింపిక్స్, పారాలింపిక్స్‌ను షెడ్యూల్ ప్రకారం నిర్వహించడమే మా ప్రాథమిక ఆలోచన. ఈ అంశంపై అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐవోసీ)తో కూడా చర్చిస్తున్నాం. ప్రతి ఈవెంట్‌పై స్పష్టత వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం'అని ఒలింపిక్స్ సీఈవో తషిరో మోటో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది జూలై 24 నుంచి ఆగస్టు 9 వరకు టోక్యో వేదికగా విశ్వ క్రీడలు జరగాల్సి ఉంది.

### షూటింగ్ ప్రపంచకప్‌నకు 6 దేశాలు దూరం

వచ్చే నెల 15 నుంచి 26 వరకు ఢిల్లీ వేదికగా జరగాల్సి ఉన్న ఐఎస్‌ఎస్‌ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌పై కరనో వైరస్ ఎఫెక్ట్ పడింది. చైనా సహా ఆరు దేశాలు ఈ టోర్నీ నుంచి తప్పుకుంటున్నట్లు బుధవారం ప్రకటించాయి. 'కరోనా కారణంగా కొన్ని దేశాలు షూటింగ్ ప్రపంచకప్‌లో పాల్గొనడం లేదు. వైరస్ వ్యాప్తి చెందకూడదనే మంచి ఉద్దేశంతో చైనా పోటీల నుంచి స్వచ్ఛందంగా తప్పుకుంది. చైనాతో పాటు తైవాన్, హాంకాంగ్, మకావు, ఉత్తర కొరియా, తుర్కమెనిస్థాన్ కూడా ఈ నిర్ణయానికే కట్టుబడ్డాయి. అని జాతీయ రైఫిల్ సంఘం (ఎన్‌ఆర్‌ఏఐ) అధ్యక్షుడు రణిందర్ సింగ్ తెలిపారు. కాగా, ఇటీవల ముగిసిన ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు భారత ప్రభుత్వం చైనా రెజ్లర్లకు వీసాలు నిరాకరించిన విషయం తెలిసిందే.